thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 162 కరీంనగర్ బుధవారం, 20 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.



# కేసీఆర్, హరీష్ సంచలన నిర్ణయం

## - జస్టిస్ ఘోష్ రిపోర్టు చెల్లదని హైకోర్టులో పిటిషన్లు

హైదరాబాద్ : కాళేశ్వరం నివేదిక పూర్తిగా చట్ట విరుద్ధమని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కమిషన్ వేసిందని.. ఆ కమిషన్ రిపోర్టుపై స్టే ఇవ్వాలని కేసీఆర్, హరీష్ రావు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు మంగళవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్ నియమించారు.

జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ తన పని పూర్తి చేసి, 665 పేజీల నివేదికను జులై 31, 2025న ప్రభుత్వానికి సమర్పించారు. ఈ నివేదికలో కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలకు కారణం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, నిధులు మంజూరు చేసిన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అని తేల్చినట్లుగా తర్వాత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ రిపోర్టును అసెంబ్లీలో పెట్టి పూర్తి స్థాయిలో చర్చించి ఏం చర్యలు తీసుకోవాలో అసెంబ్లీనే డిసైడ్ చేస్తుందని సీఎం రేవంత్ చెప్పారు. అయితే ఈ రిపోర్టు తమను రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికేనని కేసీఆర్ భావిస్తున్నారు. రిపోర్టు ఇచ్చినప్పటి నుండి ఫామ్ హౌస్లో పార్టీ ముఖ్య నేతలతో, న్యాయ నిపుణులతో సుదీర్ఘ మంతనాలు నిర్వహించారు. ఈ రిపోర్టులో ఉన్న తీవ్రతను బట్టి కేసీఆర్ , హరీష్ రావు కేసులను, అరెస్టు వంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ అంచనాకు వచ్చారు. వీటిపై న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని అనుకున్నప్పటికీ న్యాయనిపుణుల సూచనల మేరకు ముందుగా.. హైకోర్టులోనే పిటిషన్లు దాఖలు చేసినట్లుగా తెలుస్తోంది.

జస్టిస్ పీసీ ఘోష్ రిపోర్టు ద్వారా కాంగ్రెస్ పార్టీ చేసే దాడులను ఎదుర్కోవడానికి కేసీఆర్ కొద్ది రోజులుగా కేటీఆర్, హరీశ్ రావు, జగదీష్ రెడ్డి వంటి ముఖ్య నేతలు సమావేశమవుతూ వస్తున్నారు. నివేదిక తర్వాత పరిణామాలను ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి అవినీతి జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో ఇది భాగమని చెప్పేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. . పి.సి. ఘోష్ కమిషన్ నివేదిక ఆలస్యం అవ్వడం, అది స్థానిక సంస్థల ఎన్నికల ముందే బయటపెట్టడం ఇవన్నీ కాంగ్రెస్-బీజేపీ సంయుక్త కుట్రగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. నిజానికి అసెంబ్లీలో పూర్తి స్థాయి నివేదిక పెట్టిన తర్వాత చర్చల్లోనే చీల్చిచెండాడాలని అనుకున్నారు కానీ.. దాని వల్ల ఆ నివేదికకు చట్టబద్ధత అంగీకరించినట్లు అవుతుందన్న ఉద్దేశంతో ముందుగానే న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. అయితే ఈ అంశంలో.. కేసీఆర్ ను అరెస్టు చేసే అవకాశం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ సందర్భంలో చెప్పారు. కేసీఆర్ ను ఓడించడమే ఆయనకు పెద్ద శిక్ష అన్నారు. ఆయన జైల్లో ఉన్నా.. ఫామ్ హౌస్ లో ఉన్నా ఒకటేనన్నారు. కేసీఆర్ కు అరెస్టు ముప్పులేదని సీఎం చెప్పినప్పటికీ .. అది రేవంత్ రాజకీయమని.. తర్వాత అరెస్టు చేసి తన ప్రమేయం లేదని చెప్పుకోవడానికి ఇలాంటి స్టేట్ మెంట్లు ఇస్తున్నారని బీఆర్ఎస్ నేతలు అనుమానిస్తున్నారు.




## మార్వాడీ. సడన్‌గా ఏంటీ వేడి!?

జస్ట్ 5వేల పెట్టుబడితో 50వేల కోట్లు సంపాదించారు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా. ఆయనో మార్వాడీ. మధ్యతరగతి పచారీ సామాన్లకు కేరాఫ్.. డీమార్ట్. దాని ఫౌండర్ ఓ మార్వాడీ. ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ మార్వాడీ. బజాజ్ గ్రూప్ ఛైర్మన్ ఒక మార్వాడీ. ఓయో రూమ్స్ ఫౌండర్.. మార్వాడీ. అల్ట్రా టెక్ సిమెంట్, రేమండ్, గోయెంకా, సియెట్.. కంపెనీలన్నీ మార్వాడీలవి. ఫ్లిప్‌కార్ట్, మింత్రా, లెన్స్‌కార్ట్, జొమాటో కో-ఫౌండర్లు మార్వాడీలు. ఓలా, స్నాప్‌డీల్, షాప్‌క్లూస్ పెట్టిన వాళ్లూ మార్వాడీలే. ఒక లెక్క ప్రకారం భారత్‌లో ఉన్న ధనవంతుల్లో 42 శాతం మార్వాడీలే. ఈ మార్వాడీల వ్యాపార మెళకువల ముందు.. ఎంబీఏలు, మార్కెటింగ్ పాఠాలు, బిజినెస్ స్కూల్స్ అన్నీ జుజుబి. అలాంటి కమ్యూనిటీపై సడెన్‌గా ఎందుకీ వ్యతిరేకత? మార్వాడీల వ్యాపార ఆధిపత్యంపై తెలంగాణలో ఎప్పటినుంచో ఆందోళన కనిపిస్తోంది. బట్.. పెద్దగా బయటపడలేదు, అలాంటి సందర్భాలూ రాలేదు. కాని, ఈమధ్య వరుస సంఘటనలు కనిపిస్తున్నాయి మార్వాడీలకు వ్యతిరేకంగా. సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో కార్ పార్కింగ్ విషయంలో చిన్న తగాదా జరిగింది. ఆ గొడవలో మార్వాడీలు స్థానికుడిపై దాడి చేశారు. విజువల్స్ కూడా బయటికొచ్చాయి. ఆ తరువాత గోరేటి రమేష్ అనే కళాకారుడు.. మార్వాడీలను టార్గెట్ చేస్తూ పాట పాడారు. ఆ సాంగ్ సోషల్ మీడియాలో చాలా వైరల్ అయింది. పాట పాడిన గోరేటి రమేష్‌ను అరెస్ట్ చేశారు కూడా. అదే సమయంలో ఆమనగల్లులో మార్వాడీలకు వ్యతిరేకంగా పెద్ద పోరాటమే జరుగుతోంది.



## 'ముక్కు నేలకు రాసి సారీ చెప్పు'..

### రేవంత్‌పై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పెట్టారు.

"SLBC టన్నెల్ తొవ్వడం చేతకాదు.. సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగ్గా కట్టించే తెలివిలేదు.. చివరికి ఓ చెక్ డ్యామ్‌ను కూడా నిర్మించలేని కాంగ్రెస్ సన్నాసులు కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం సిగ్గుచేటు.. మహబూబ్ నగర్‌లోని అడ్డాకుల మండలం గుడిబండ పెద్ద వాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్ డ్యామ్ రెండునెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో CM రేవంత్ సమాధానం చెప్పాలి. నాసిరకం పనులు చేసి రైతుల పొలాలు, మోటర్ పైప్ లైన్లు, చివరికి ట్రాన్స్‌ఫార్మర్ కూడా కొట్టుకుపోయే దుస్థితికి కారణమైన ప్రతి ఒక్కరిపై సర్కారు చర్య తీసుకుని బాధితులను ఆదుకోవాలి.

ప్రాజెక్టుల మాట దేవుడెరుగు చివరికి ఒక్క ఇటుక కూడా సరిగా పేర్చలేని ఈ దద్దమ్మ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సర్కారు ముక్కు నేలకు రాసి మరోసారి కాళేశ్వరం ప్రాజెక్టుపై నోరు పారేసుకోమని లెంపలేసుకోవాలి" అని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు.




## ప్రతిపక్ష ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డి.. తెలంగాణ వ్యక్తి పేరు ప్రకటించిన ఖర్గే

ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరూ ఊహించని పేరును కాంగ్రెస్ ప్రకటించింది. తెలంగాణకు చెందిన బి.సుదర్శన్‌రెడ్డి పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని కాంగ్రెస్ పోటీలోకి దింపింది. ఎన్డీఏ కూటమి తమిళనాడు వ్యక్తిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెటట్టగా.. ఇండియా కూటమి దక్షిణాదికి చెందిన తెలంగాణ వ్యక్తిని పోటీగా దింపింది. ఇప్పుడు రాధాకృష్ణన్-సుదర్శన్‌రెడ్డి మధ్య పోటీ నెలకొంది. బి.సుదర్శన్‌రెడ్డి.. స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం. వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యను అభ్యసించారు. నాలుగేళ్ల పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. ఇక రిటైర్మెంట్ తర్వాత గోవా లోకాయుక్త ఛైర్మన్‌గా పని చేశారు.

వాస్తవానికి సంఖ్యా బలాన్ని బట్టి చూస్తే ఎన్డీఏ కూటమినే ఉపరాష్ట్రపతి పదవిని గెలుచుకుంటుంది. అయినా కూడా తమ ఐక్యతను చాటిచెప్పాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఇందులో భాగంగానే ప్రతిపక్ష కూటమి అభ్యర్థిని నిలబెడుతోంది. ప్రస్తుతం మొత్తం ఉభయ సభల సభ్యుల సంఖ్య 782గా ఉంది. సింపుల్ మెజారిటీతో 392 ఓట్లు వచ్చిన అభ్యర్థే గెలుపొందుతారు. ఉభయ సభల్లో ఎన్డీఏ కూటమి బలం 422గా ఉంది. లోక్‌సభలో 293 ఎన్డీఏ కూటమి పక్షాల సభ్యులు, రాజ్యసభలో 129 మంది ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరగనుంది. అయితే ఏకగ్రీవం కోసం ఎన్డీఏ కూటమి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా రాజ్‌నాథ్‌సింగ్ ఇండియా కూటమిని సంప్రదించగా.. ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న వ్యక్తికి సపోర్ట్ చేయమని తేల్చి చెప్పినట్లు సమాచారం.

# 'తెలుగోడి సత్తా చూపే టైమొచ్చింది'

## చంద్రబాబు, కేసీఆర్, పవన్, జగన్‌లకు సీఎం రేవంత్ కీలక విజ్ఞప్తి

హైదరాబాద్ : ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ప్రకటించడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీఏ కూటమి దుర్వినియోగం చేస్తోందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న ఇండియా కూటమి ఒకవైపు.. రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న కూటమి మరోవైపు ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ పడుతున్నాయని చెప్పారు. ఈ ఎన్నికను అందరూ విచక్షణతో గమనించాలని కోరారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతీ తెలుగు వాడిపై ఉందని అన్నారు. పీవీ నరసింహా రావు తర్వాత తెలుగువాడిని కీలక పదవిలో కూర్చోబెట్టే అవకాశం మనకు వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, జనసేన, ఎంఐఎం పార్టీలు అన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. చంద్రబాబు, కేసీఆర్, పవన్ కల్యాణ్, జగన్‌లు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇది రాజకీయాలు చేయాల్సిన సమయం కాదని.. మనందరం ఒక్కటే అనే నిదానాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన సమయం అని అన్నారు.




సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ సభ్యుడు కాదు.. రాజ్యాంగ పరిరక్షకుడిలా పనిచేస్తాడని చెప్పారు. గతంలో నంద్యాల నుంచి పీవీ నరసింహా రావు పోటీ చేస్తే.. ఎన్టీఆర్ సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా సుదర్శన్ రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరి మీదా ఉందని అన్నారు.



## ముంచుకొస్తున్న వాయుగుండం.. ఆ జిల్లాలకు రెడ్ అలెర్ట్!

గత వారం రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు పడుతున్నాయి. మరికొన్ని గంటల్లో ఈ అల్పపీడనం వాయుగుండంగా మారి ఒడిస్సా- ఉత్తరకోస్తా సమీపంలోని గోపాల్ పూర్ తీరం దాటే అవకాశం ఉంది. ఈ వాయుగుండం ప్రభావం వల్ల ఉత్తర కోస్తాంధ్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

**ఆ జిల్లాలకు అలెర్ట్...** తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. 25 సెం.మీ వర్ష పాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాల్లో ఉన్న పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఏలూరు, ఎన్టీఆర్, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కావున ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో తప్పా బయటకు రాకపోవడం మంచిదని సూచించింది. కృష్ణ, పల్నాడు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతి పురం మన్యం, పశ్చిమ గోదావరి, కోనసీమ, జిల్లాకు అరేంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే నంద్యాల, కర్నూల్, కడప, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రాబోయే ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయి. ఈరోజు కూడా కొన్ని చోట్ల అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు వచ్చే ప్రమాదం ఉంది. కావున అక్కడ నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని , సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. వాయుగుండం నేపథ్యంలో మత్సకారుల ఎట్టిపరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. అలాగే నదులు, వాగుల దగ్గర ఉండే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఈరోజు ఏపీలో పలు జిల్లాల్లోని స్కూల్స్ కి కూడా సెలవు ప్రకటించారు.





ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జాతీయస్థాయిలో విపక్ష కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. తమ అభ్యర్థిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. ఇందుకు విపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయన్నారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధికార పక్షం విజ్ఞప్తి చేసిన సమయంలోనే విపక్ష పార్టీలు తమ అభ్యర్థిని ప్రకటించాయి. " దేశంలోని ప్రఖ్యాత న్యాయనిపుణుల్లో బి.సుదర్శన్ రెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్, గువాహటి హైకోర్టులతోపాటు సుప్రీంకోర్టులో సేవలందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఓ అభిప్రాయానికి వచ్చి ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి" అని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ ఒకే పేరును అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమన్నారు.

**ఉస్మానియా వర్సిటీ నుంచి..** జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం. 1946 జులైలో జన్మించిన ఆయన 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేశారు. అనంతరం అదే ఏడాది డిసెంబర్ 27న బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో గువాహటి హైకోర్టు సీజేగా పని చేశారు. 2007–11 మధ్య సుప్రీంకోర్టు జడ్జిగాను సేవలందించిన ఆయన.. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాలతో ఏడు నెలల్లోనే ఆ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించిన ఎన్డీయే.. ఆ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేసి మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అంతకుముందు భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. తాజాగా విపక్షాలు కూడా అభ్యర్థిని ప్రకటించడంతో రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిల మధ్య పోటీ అనివార్యమైంది.




దిల్లీ: తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న యూరియా సమస్యను పరిష్కరించాలంటూ పార్లమెంట్ ఆవరణలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగారు. వారితోపాటు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ నిరసనలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన యూరియాను సరఫరా చేయకుండా తెలంగాణ రైతాంగాన్ని ఇబ్బంది పెడుతున్నారని ఎంపీలు మండిపడ్డారు. యూరియాను భాజపా పాలిత రాష్ట్రాలకు దారి మళ్లిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

## హౌసింగ్ స్కీమ్‌లో అవినీతి.. మంత్రి ఉత్తమ్ చర్యలు



హుజుర్‌నగర్, ఆగస్టు19 : హుజుర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని జానపహాడ్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జరిగిన అవకతవకలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. అవకతవకల విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ కేసు నమోదు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తక్షణమే రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ సదరు కార్యదర్శి వెంకటయ్యను సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఒకటి, రెండు రోజుల్లో వెంకటయ్య అరెస్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఉప రాష్ట్రపతి ఎన్నిక.. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు, కేసీఆర్ సహకరించాలి: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీయే దుర్వినియోగం చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థలను ఎన్డీయే అపహాస్యం చేస్తోంది. రాజ్యాంగ రక్షణ కోసం పోరాడుతున్న కూటమి ఒక వైపు.. రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న కూటమి మరో వైపు. పీవీ నరసింహారావు తర్వాత తెలుగువాడిని కీలక పదవిలో కూర్చోబెట్టే అవకాశం మనకు వచ్చింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటి మీదకు రావాలి. తెదేపా, వైకాపా, భారత రాష్ట్ర సమితి, ఎంఐఎం సహా అన్ని పార్టీలు.. ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు తెలపాలి. చంద్రబాబు, కేసీఆర్, జగన్, పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాల నేతలంతా కలిసి రావాలి. ఆనాడు ప్రధాని పీవీ నరసింహారావుకు ఎన్టీఆర్ మద్దతు ఇచ్చారు. నంద్యాల ఉప ఎన్నికలో పీవీపై పోటీ పెట్టకుండా గెలిపించారు. తెలుగువాడు అత్యున్నత స్థానంలో ఉండాలనే భావనతో సహకరించారు. ఇప్పుడు మరోసారి తెలుగు నేతలంతా ఎన్టీఆర్ స్ఫూర్తితో సహకరించాలి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చారు. న్యాయమూర్తిగా, లోకాయుక్తగా దేశానికి సేవలందించారు" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్‌ను అభాసుపాల్జేయాలని ఆ రెండు పార్టీల కుట్ర: మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్: రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం తక్షణమే ఇవ్వాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీద అక్కసుతో రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇవ్వట్లేదని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిల్లీలో ఉన్నారని విమర్శించారు. "

కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదు. భాజపా, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయి. కాంగ్రెస్‌ను అభాసుపాల్జేయాలని కుట్ర చేస్తున్నాయి. ఇప్పటికే యూరియా కోసం సీఎం రేవంత్, మంత్రి తుమ్మల కేంద్రానికి లేఖ రాశారు. రైతులు ఆందోళన చెందవద్దు" అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను కొట్టివేయండి: హైకోర్టులో కేసీఆర్ పిటిషన్



హైదబాద్: కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ (%ఖజ=%), మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్ హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణ అర్హత లేదని, కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 14.03.2024న జస్టిస్ పీసీ ఘోష్ ఛైర్మన్‌గా జ్యుడిషియల్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విచారణకు నియమించింది. దాదాపు 16 నెలలు ఘోష్ కమిషన్.. నాటి ముఖ్యమంత్రి, అప్పటి సాగునీటి, ఆర్థిక మంత్రులు.. ఐఏఎస్, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలు, ప్రజాసంఘాలు, పాత్రికేయులు, ముందుకొచ్చిన ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించింది. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటలను ప్రశ్నించి... వారి వివరణను విశ్లేషించింది. గత నెల 31వ తేదీన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. కమిషన్ నివేదికను మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే.

## విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను వెంటనే తొలగించండి: భట్టి విక్రమార్క



హైదరాబాద్: విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల టీవీ, ఇంటర్నెట్ కేబుళ్ల (వైర్లు) ఏర్పాటులో నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తాజాగా హైదరాబాద్ రామంతాపూర్‌లో ఐదుగురి మృతికి రోడ్డుకు అడ్డంగా లాగిన కేబుల్ తెగి విద్యుత్‌లైనుపై పడటమే కారణమని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో మంగళవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా నిర్వహించారు. అనుమతులు లేకుండా ఎలాంటి విద్యుత్ కనెక్షన్లు ఉన్నా వెంటనే తొలగించాలన్నారు. కేబుల్ వైర్లు తొలగింపునకు ఏడాది సమయం ఇచ్చినా ఆపరేటర్లు స్పందించలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో కీలక పరిణామం..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలన సృష్టించిన కూకట్‌పల్లి మైనర్ బాలిక సహస్ర మర్డర్ కేసులో కీలక పురోగతి చోటుచేసుకుంది. ఒక అనుమాతుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలిక ఉంటున్న బిల్డింగ్‌లోనే అద్దెకు ఉంటున్న సంజయ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. బాలిక సహస్ర హత్య తరువాత సంజయ్ అక్కడకక్కడే అనుమానాస్పదంగా తిరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ అనుమానంతో సంజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల బాలిక సహస్రని గుర్తుతెలియని వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. బాలిక గొంతుకోసి.. ఆపై కడుపులో పొడిచి కిరాతకంగా చంపేశాడు. అయితే ఈ కేసు దర్యాప్తులో భాగంగా చుట్టుపక్కల ఉన్న వందల సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. దుండగుడు ఇంట్లో చొరబడి బాలికపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించి ఉంటాడని.. తప్పించుకోవడానికి ప్రయత్నించిన బాలిక ప్రతిఘటించడంతోనే నిందితుడు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.




## భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతి.. 37 అడుగులకు చేరిన ప్రవాహం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈరోజు ఉదయానికి గోదావరి నీటిమట్టం 37 అడుగులకు చేరింది. స్నాన ఘట్టాల వద్ద చాలా మెట్లు వరద నీటిలో మునిగాయి. కళ్యాణ కట్ట వరకు వరద నీరు చేరింది. దీంతో నదిలో స్నానాలు ఆచరించే భక్తులు లోపలికి వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ విగ్రహం వరద నీటిలో మునిగాయి.

## నందమూరి పద్మజ భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళి




హైదరాబాద్: నందమూరి పద్మజ భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఎన్టీఆర్ పెద్ద కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ అనారోగ్యంతో బాధపడుతూ ఇవాళ ఉదయం కన్నుమూశారు. మంగళవారం సాయంత్రం హైదరా బాద్‌లోని జయకృష్ణ నివాసానికి వెళ్లిన సీఎం చంద్రబాబు.. పద్మజ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "మా పెళ్లి విషయంలో జయకృష్ణ, పద్మజ పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకున్నారు. ఇంట్లో అందరూ యంగ్ స్టర్స్‌గా ఉంటే మా అత్తగారి తర్వాత ఆవిడే కుటుంబ పెద్దగా అందరితో కలుపుగోలుగా ఉండేవారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందడం చాలా బాధేస్తోంది. అందరికంటే జయకృష్ణ గారికి తీరని లోటు. ఎన్టీఆర్ కుటుంబంలో మొదట నాకు పరిచయం జయకృష్ణగారితోనే. నేను సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు.. ఎగ్జిబి టర్‌గా ఆయన నా దగ్గరికి వచ్చే వారు. ఆ తర్వాత ఎన్టీఆర్ గారిని కలవడం.. అవన్నీ జరిగాయి. అన్ని విషయాలు ముందుండి ఆలోచించింది జయకృష్ణే. ఆయన కుటుంబానికి అందరం అండగా ఉంటాం" అని చంద్రబాబు తెలిపారు. పద్మజ.. దగ్గుబాటి వెంకటేశ్వరరావుకు సోదరి.

హైదరాబాద్: డీఎస్ఆర్ గ్రూప్ కన్‌స్ట్రక్షన్ సంస్థతో లావాదేవీలు జరిపిన మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. సంస్థ సీఈవో సత్యనారాయణరెడ్డి, ఎండీ సుధాకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్ నగర్, సూరారం, నెల్లూరు, బెంగళూరు తదితర చోట్ల మొత్తం 15 బృందాలు సోదాలు చేపడుతున్నాయి. గత కొన్నేళ్లుగా సంస్థ చేసిన చెల్లింపులు, బకాయిలు తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఉదయం 5 గంటల ప్రాంతం నుంచి సీఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ మధ్య సోదాలు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశముంది.



# చిన్న వయసులోనే ప్రధానియైన రాజీవ్ గాంధీ

## ఆగస్టు 20...దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి - సద్భావనా దినోత్సవం




40 ఏళ్ల వయసులో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ అప్పట్లో చిన్న వయస్కులైన నేతల్లో ఒకరు. అలాగే ఆయన తాత, నెహ్రూ కుటుంబంలో... జవహర్‌లాల్ తొలి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేనాటికి వయసు 58 సంవత్సరాలు, ఆయన తల్లి ఇందిరా గాంధీ 1966లో మొదటిసారి ప్రధానమంత్రి అయినప్పుడు ఆమె రాజీవ్ గాంధీ కంటె 8 ఏళ్ళు (48) పెద్ద. రాజీవ్‌గాంధీ 1944లో ఆగస్ట్ 20న ముంబైలో జన్మించారు. భారతదేశం స్వాతంత్ర్యం సాధించే నాటికి ఆయన తాత నెహ్రూ ప్రధానమంత్రి అయ్యేనాటికి రాజీవ్ వయసు కేవలం 3 సంవత్సరాలు మాత్రమే. ఆయన తల్లిదండ్రులు ఇందిరా ఫిరోజ్ లక్నో నుంచి ఢిల్లీకి మకాం మార్చారు. 1984 అక్టోబర్ 31న తల్లి ఇందిరా గాంధీ దారుణ హత్యకు గురైన సమయంలో ప్రధాన మంత్రిగాను, కాంగ్రెస్ అధ్యక్షునిగానూ ఆయన బాధ్యతలు చేపట్టారు. రాజీవ్ డెహ్రాడూన్ లోని వెల్హామ్ ప్రైమరీ స్కూల్ కు కొన్నిరోజులు వెళ్లాడు. తర్వాత రెసిడెన్షియల్ డూన్ స్కూల్ కు మారిపోయాడు. అక్కడే ఆయన అనేకమందితో స్నేహపరిచయాలను పెంచు కున్నారు. అప్పుడే తమ్ముడు సంజయ్ గాంధీ కూడా ఆయనతో కలిశారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాత కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో చేరారు. అయితే రాజీవ్ లండన్ లోని చాలా త్వరగా ఇంపీరియల్ కళాశాలకు మారిపోయారు. అక్కడే మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సు చేశారు. రాజీవ్ కు రాజకీయాల పట్ల పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ఫిలాసఫీ, రాజకీయాలు లేదా చరిత్ర గురించి పట్టించుకునే వారు కాదు. సైన్సు, ఇంజినీరింగ్ కు సంబంధించిన పుస్తకాలే ఎక్కువగా చదివే వారు. ఇంగ్లండ్ నుండి ఇండియాకు తిరిగి వచ్చాక ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్ ఎంట్రన్స్ పరీక్ష రాసి పాసై కమర్షియల్ పైలెట్ లైసెన్సు తీసుకుని, వెంటనే దేశీయ విమాన సంస్థ ఇండియన్ ఎయిర్ లైన్స్ లో పైలెట్ జీవితం ప్రారంభించారు. రాజీవ్ ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జ్ లో ఉన్న సమయం లోనే ఇంగ్లీష్ చదివే ఇటాలియన్ లేడీ సోనియాతో ఆయనకు పరిచయమై, ప్రేమగా మారి, 1968లో అక్కడే వివాహం చేసుకున్నారు. తర్వాత ఇద్దరు పిల్లలు రాహుల్, ప్రియాంకతో కలిసి వారు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంట్లో నివాసం ఉండేవారు. 1980లో సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించడంతో, తన తల్లిని అనేక సవాళ్లు చుట్టుముట్టిన పరిస్థితుల్లో రాజీవ్ రాజకీయాల్లో చేరాల్సిందిగా ఒత్తిడి బాగా పెరిగి, బలవంతంగానే ఉత్తరప్రదేశ్ లోని అమేథీ స్థానానికి పోటీ చేసి, ఉప ఎన్నికల్లో రాజీవ్ గాంధీ ఘన విజయం సాధించారు. 1984లో అక్టోబర్ 31వ తేదీన ప్రధాన మంత్రిగా ఉన్న ఇందిరాగాంధీ దారుణ హత్యకు గురి కావడంతో రాజీవ్ ప్రధానమంత్రిగా, కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతులు స్వీకరించాల్సి వచ్చింది. తల్లి అంత్యక్రియలు పూర్తికాగానే ఆయన లోక్ సభ ఎన్నికలకు వెళ్ళి ఫలితాల్లో అత్యంత ఘన విజయం సాధించారు. అంతకుముందు ఏడు సార్లు జరిగిన ఎన్నికల్లో కంటే రాజీవ్ హయాంలో ఎక్కువ సీట్లను సాధించారు. 508 లోక్ సభ సీట్లకు గాను 401 సీట్లు గెలుచుకున్నారు. ఆలస్యంగా, అయిష్టంగా రాజకీయాల్లో ప్రవేశించి కూడా ఇంత పెద్ద మెజార్టీ సాధించడం విశేషం. రాజీవ్ ప్రధానిగా భావి భారత దేశం ఎలా ఉండాలి అనే యోచించారు. వ్యక్తి తన కులం, పుట్టుక, మతం, రంగు మొదలైన వాటితో సంబంధం లేకుండా అభివృద్ధిని అనుభవించాలని ఆయన కోరుకున్నారు. యువతకు ఓటు హక్కును కల్పించడంలో, రాజ్యాంగంలోని 73వ ఆర్టికల్ ద్వారా స్థానిక సంస్థలకు నేరుగా కేంద్ర నిధులు వచ్చే విధంగా కృషి చేశారు. ఎన్నో ప్రజాహిత, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. 1984, అక్టోబరు 31 న తల్లి దారుణ హత్యకు గురైన తర్వాత ప్రధానమంత్రి అయిన రాజీవ్ 1989, డిసెంబరు 2 న సాధారణ ఎన్నికలలో పరాజయము పొంది, రాజీనామా చేసే వరకు ప్రధాన మంత్రిగా పని చేశారు. రాజీవ్ ప్రధానిగా ఉన్న సమయంలో బోఫోర్స్ కుంభకోణం ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసింది. మరియు 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమికి దారితీసింది. 1991 మేలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నెలరోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనేకచోట్ల 250 సభల్లో మాట్లాడారు. ఆయన మే 20 మధ్యాహ్న సమయములో బయలుదేరి భువనేశ్వర్ మీదుగా, ఆంధ్ర ప్రదేశ్ లోని కొన్ని నియోజక వర్గాలలో పర్యటించారు. సాయంత్రం 6.30కి వైజాగ్ నుంచి బయలుదేరి చెన్నై చేరుకొని, సాయంత్రం 8.30ని, లకు స్థానిక కాంగ్రెస్ నాయకురాలు మరకతం చంద్రశేఖర్ తో కలసి గ్రాండ్ వెస్టన్ ట్రంక్ రోడ్డు ఆలయ ప్రాంగణములో ఉన్న సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కొద్దిసేపట్లోనే రాజీవ్ గాంధీ మానవ బాంబు పేలుళ్లతో హతమార్చ బడ్డారు. ఎల్‌టీటీఈకి చెందిన ఆత్మాహుతి దళం బాధ్యులు నళిని, శ్రీలంక జాతీయుడైన ఆమె భర్త మురుగన్ ఎల్‌టీటీఈ ఉగ్రవాదులతో కలిసి రాజీవ్ గాంధీ హత్యకు కుట్ర పన్నారు. మే 21న రాత్రి పది గంటల ప్రాంతంలో ఈ హత్య జరిగింది. ఈ దుర్ఘటనలో సుమారు 14 మంది హతులైనారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సమాచారం నుండి సంస్కృతి వరకు - రేడియో యాత్ర

## ఆగస్టు 20 - శ్రోతల మనసుల్లో ప్రతిధ్వనించే రేడియో జ్ఞాపకం

## జాతీయ రేడియో దినోత్సవం - ఆగస్టు 20




రేడియో అనేది మానవ సమాజ చరిత్రలో ఒక విప్లవాత్మక మాధ్యమం. మాట, సంగీతం, వార్త, జ్ఞానం, సంస్కృతి %-% ఇవన్నీ కేవలం ఒక చిన్న పరికరం ద్వారా కోట్లాది ప్రజలకు చేరవేయగల శక్తి రేడియోకే ఉంది. టెలివిజన్, ఇంటర్నెట్, డిజిటల్ మీడియా విస్తరించినప్పటికీ, రేడియో ప్రత్యేక స్థానం కోల్పోలేదు. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 20న జాతీయ రేడియో దినోత్సవం జరుపుకుంటారు. ఈ రోజు రేడియో ప్రయాణాన్ని, ప్రాధాన్యతను, భవిష్యత్తు అవసరాలను మనం గుర్తు చేసుకునే రోజు. రేడియో ఆవిష్కరణకు మూలం 19వ శతాబ్దంలో శాస్త్రీయ పరిశోధనలకే చెందుతుంది. 1895లో ఇటలీకి చెందిన గుల్గెల్మో మార్కోని విజయవంతంగా రేడియో తరంగాలను ప్రయోగించి ప్రపంచ వ్యాప్తంగా కొత్త యుగాన్ని తెరిపించాడు. ఆయనకే "రేడియో పితామహుడు" అనే బిరుదు లభించింది. మొదట సైనిక సమాచార మార్పిడికే ఉపయోగించిన ఈ సాంకేతికత క్రమంగా ప్రజా మాధ్యమంగా పరిణామం చెందింది. 1901లో అట్లాంటిక్ మహాసముద్రం దాటి రేడియో సంకేతాలు ప్రసారం కావడం చరిత్రలో ఒక అద్భుత ఘట్టం. భారతదేశంలో రేడియో ప్రయాణం 1923లో ప్రైవేట్‌గా బాంబేలో ప్రారంభమై, 1927లో బాంబే, కలకత్తాలలో రెగ్యులర్ ప్రసారాలు మొదలయ్యాయి. ఆ తరువాత 1936 జూన్ 8న అధికారికంగా "ఆల్ ఇండియా రేడియో" ఆవిర్భవించింది. 1957లో దీనికి "ఆకాశవాణి" అనే పేరు పెట్టబడింది. నేడు ఆకాశవాణి ప్రపంచంలోనే అతిపెద్ద రేడియో నెట్వర్క్‌లలో ఒకటిగా 470కి పైగా కేంద్రాల ద్వారా 23 భాషల్లో, 146 మాండలికాల్లో ప్రతిరోజూ కోట్లాది శ్రోతలను చేరుకుంటోంది. సుమారు 99.20 శాతం భారత జనాభా రేడియో పరిధిలో ఉందనేది గణాంకాలు చెబుతున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో రేడియో పాత్ర అపారమైనది. 1940లలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జర్మనీలో స్థాపించిన "ఆజాద్ హింద్ రేడియో" ద్వారా దేశభక్తి సందేశాలు ప్రసారం అయ్యాయి. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల ప్రసంగాలు రేడియో ద్వారా ప్రజలకు చేరడం ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణంలో కూడా రేడియో మార్గదర్శక శక్తిగా పనిచేసింది. వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ ప్రచారాలు, విద్యా అవగాహన కార్యక్రమాలు, జాతీయ ఏకతా స్ఫూర్తిని పెంచే సంగీత, నాటక, సాంస్కృతిక ప్రసారాలు ప్రజల జీవితాన్ని ప్రభావితం చేశాయి. గ్రామీణ భారత దేశానికి రేడియో ఒక అద్భుత సహాయకుడు. విద్యుత్ లేకున్నా బ్యాటరీల ద్వారా రేడియో వినవచ్చు. చదవలేని వారికి కూడా విని జ్ఞానం పొందే మార్గం ఇది. రైతులు పంటలపై సలహాలు, వాతావరణ సూచనలు, మార్కెట్ ధరల సమాచారం రేడియో ద్వారానే పొందేవారు. విపత్తు పరిస్థితుల్లోనూ రేడియోనే అత్యంత నమ్మదగిన సమాచార వనరుగా నిలుస్తుంది. 2004 సునామీ సమయంలో, 2018 కేరళ వరదల్లో రేడియోనే కోట్ల మందికి ప్రాణాధారంగా నిలిచింది. ఆధునిక కాలంలో రేడియో రూపు మార్చుకున్నప్పటికీ ప్రభావాన్ని కోల్పోలేదు. 1999 తర్వాత ఎఫ్.ఎమ్. రేడియో ప్రవేశించడంతో నగరాలలో యువతకు ఇది ప్రధాన వినోద మాధ్యమమైంది. నేడు మొబైల్ ఫోన్లలో, ఇంటర్నెట్ యాప్‌లలో, ఉపగ్రహ రేడియో రూపంలో రేడియో చేరువైంది. 2025 గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 3.5 బిలియన్లకు పైగా ప్రజలు రేడియో వింటున్నారు. ఇది రేడియో శాశ్వతతకు సాక్ష్యం. జాతీయ రేడియో దినోత్సవం జరుపుకోవడం వెనుక ఉద్దేశ్యం కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడమే కాదు. రేడియో అనేది ఇంకా సజీవంగా, ప్రజల జీవితాల్లో కీలకంగా ఉందని తెలియజేయడమే. ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది %-% సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందినా, రేడియో ఒక మానవీయమైన, సులభమైన, అందరికీ అందుబాటులో ఉన్న మాధ్యమమని. అందువల్ల ఆగస్టు 20న జరుపుకునే జాతీయ రేడియో దినోత్సవం రేడియో వారసత్వాన్ని స్మరించుకోవడమే కాక, డిజిటల్ భవిష్యత్తులో దాని పాత్రను మరింత బలంగా చర్చించే రోజు కూడా. గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని ఆస్వాదిస్తూ, భవిష్యత్తును సాంకేతికంగా మరింత బలోపేతం చేస్తూ రేడియో నిరంతరం జ్ఞానం, వినోదం, అవగాహనను అందిస్తూ మానవ సమాజానికి మార్గదర్శకంగా కొనసాగుతూనే ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# రాజయ్య చిత్రాలు... సజీవ రూపాలు - ఆగస్టు 20...కాపు రాజయ్య వర్ధంతి



కాపు రాజయ్య. ఈ పేరు తెలియని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. కాపు రాజయ్య ( ఏప్రిల్ 7, 1925 %-% ఆగష్టు 20, 2012) తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు. గ్రామీణ నేపథ్యం గల చిత్రాలకు ఆయన పెట్టింది పేరు. ఈయన చిత్రపటాలు ప్రపంచం లోని పలు దేశాలలో ప్రదర్శింప బడడం తెలుగు వారికి గర్వకారణం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఊరూరా వీధి వీధిన, వాడవాడలా ప్రదర్శితాలై, ఉద్యమ కారుల తో మమేకమైన తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక రూపాలు అయిన బోనాలు, బతుకమ్మలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగి పాలనా పగ్గాలు తెరాస చేపట్టాక, అధికారిక పండుగలుగా ప్రకటింప బడటం అందరికి తెలిసిందే. అయితే రాజయ్య ఆయా సాంస్కృతిక వారసత్వ ప్రతీకలను కళా రూపాలుగా దశాబ్దాల క్రితమే కాన్వాసుపై చిత్రీకరించి గ్రామీణ సంస్కృతి ప్రాధాన్యత చాటి చెప్పారు.

దైవదత్తమైన ఆయన కుంచెతో ఏ గీత గీసినా, ఆ కుంచె వాటికి ప్రాణం పోసేది. అందుకే ఆయన చిత్రాలు జీవం పోసుకుని కళ్లముందు సజీవంగా కదలాడుతున్నట్లు కనిపిస్తాయి. గ్రామీణ జీవితాలను నిశితంగా పరిశీలించి, సృజనాత్మకత ఉట్టి పడేలా ఆయన వేసిన చిత్రాలు సహజత్వానికి ప్రతిబింబాలు. నిజానికి ఆ చిత్రాలు సామాన్యమైన జనజీవనం తో ముడివడి ఉన్నవే. చీరలపై కనిపించే కోలాటం వంటి బొమ్మలు, కూడా వసంత కేళి, రాధాకృష్ణుల చిత్రం, 'పొలం పనులు' సోది చెప్పే మహిళ, పాలమ్మో పాలు అంటూ వీధుల్లోకి వెళ్ళే గొల్లభామల చిత్రాలు, వడ్డెర మహిళ, ఎల్లమ్మ జోగి ఒక్కొక్కటి రాజయ్య మునివేళ్లతో అలవోకగా చిత్రీకరించిన ఒక కళా ఖండమే. తెలంగాణ పల్లె సీమలకు సంబంధించి జానపదుల జీవితాలతో పెనవేసుకున్న సహజ దృశ్యాలను చిత్రించిన కళాకారులు మరొకరు లేరనేది నూటికి నూరుపాళ్లు నిజం. కాపు రాజయ్య మెదక్ జిల్లా సిద్ధిపేటలో 1925 ఏప్రిల్ 7వ తేదీన జన్మించారు. హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన చిత్రకళలో డిప్లమా పొందారు. డ్రాయింగ్‌లో మద్రాసు ప్రభుత్వ డిప్లమా కూడా పొందారు. 1963 లో తాను స్థాపించిన లలితకళా సమితి / అకాడమీ ద్వారా ఆయన చెకోస్లోవికియా, హంగేరి, రుమేనియా, బల్గేరియా దేశాల్లో ప్రదర్శనలు పెట్టారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన కళారంగంలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారు. చిన్న వయస్సు లోనే తండ్రి మరణించడంతో ఆయన తీవ్రమైన ఇబ్బందుల పాలయ్యారు. కాపు రాజయ్య కుటుంబాన్ని తండ్రి మిత్రుడు మార్క చంద్రయ్య ఆదుకున్నారు. చిత్రకళలో కాపు రాజయ్యకు కుబేరుడు అనే ఉపాధ్యాయుని ప్రోత్సహించారు. ఉన్నత పాఠశాల లో చదువు తున్నపుడు ఆయన మొదటి చిత్ర ప్రదర్శన జరిగింది. ఆ తర్వాత దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా ఆయన తన కుంచెతో చిత్రాలకు ప్రాణప్రతిష్ట చేశారు. తెలుగు చిత్ర కళకు అంతర్జాతీయ కీర్తిని ఆర్జించి పెట్ట గలిగారు. రాజయ్య తొలి చిత్రాలు సంప్రదాయబద్ధమైన, కాలపరీక్షకు నిలిచిన ప్రాచ్య విధానంలో, అంటే వాష్ పద్ధతిలో చిత్రాలు వేశారు. ఆ తర్వాత నకాషీ చిత్రకారుల అద్భుతమైన టెక్నిక్ ఆయను ముగ్ధుడ్ని చేసింది. దాంతో టెంపరా రంగుల వాడకాన్ని ప్రారంభించారు. నకాషీ చిత్రకారులంటే ఆయనకు ఎనలేని అభిమానం. ఇరవై ఏళ్ల పాటు 1950 నుంచి 1970 వరకు ఆయన టెంపరా చిత్రాలు వేశారు. రాజయ్యను 50కి పైగా అవార్డులు వరించాయి. రాష్ట్రప్రభుత్వం ఆయనను 1966లో రజత పత్రంతో, 1969లో తామ్ర పత్రంతో సత్కరించింది. 1975లో ఆయనకు చిత్ర కళాప్రపూర్ణ సత్కారం లభించింది. సీనియర్ ఫెలోషిప్ (1988 లో భారతదేశ ప్రభుత్వం చే), 1992లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి చిత్రలేఖనంలో విశిష్ట పురస్కారం లభించింది. రాజయ్య 1993లో కళా ప్రవీణ, 1997లో కళా విభూషణ్, 2000లో హంస, 2007లో లలిత కళారత్న అవార్డు అందుకున్నారు. విదేశాల్లో సైతం ఆయన చిత్రాల ప్రదర్శనలు జరిగాయి. రాజయ్య చిత్రాలు పార్లమెంటు హౌస్, న్యూఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్, సాలార్‌జంగ్ మ్యూజియం, ఆంధ్రప్రదేశ్ లలితా కళా అకాడమీల్లో ప్రదర్శనకు ఉంచారు. గ్రామీణ పేదల జీవన వైవిధ్య భరితమైన అశేష అజరామర చిత్రాలకు ప్రాణం పోసి, తెలుగు వారి ప్రాచీన కళా రూపాల ను దిగంతాలకు పరిచయం చేసి తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయిన కాపు రాజయ్య 20 ఆగష్టు 2012 ఆగస్టు 20న 87వ ఏట తనువు చాలించి శాశ్వత చిత్తరువుగా జన హృదయాలలో నిలిచి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సిద్ధాంతాల సమరం, సంఖ్యల గణితం....

# ఉపరాష్ట్రపతి ఎన్నిక 2025:

## దక్షిణాదే కేంద్రం... ఉపరాష్ట్రపతి ఎన్నికలో కొత్త సమీకరణాలు

## కుడి-ఎడమ భావజాలాల మధ్య కొత్త సమరం....ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యం



భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక 2025 వేదిక సిద్ధమైంది. పాలక కూటమి ఎన్డీయే తరఫున మహారాష్ట్ర గవర్నర్, తమిళనాడుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు సి.పి. రాధాకృష్ణన్‌ను అభ్యర్థిగా ప్రకటించగా, ప్రతిపక్ష ఇండియా బ్లాక్ మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి, గోవా తొలి లోకాయుక్తగా పనిచేసిన బి. సుదర్శన్ రెడ్డిని పోటీలోకి దించింది. ఇది కేవలం వ్యక్తుల మధ్య పోటీ మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలు, రాజకీయ సిద్ధాంతాలు, ప్రాంతీయ ప్రతినిధిత్వం అనే అనేక అంశాలను ప్రతిబింబించే సమరముగా మారింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ రాజీనామా అనంతరం ఎన్నికల సంఘం సెప్టెంబర్ తొమ్మిదో తేదీని పోలింగ్ రోజుగా ప్రకటించింది. ఆగస్టు ఇరవై ఒక్కవ తేదీ వరకు నామినేషన్లు, ఇరవై రెండవ తేదీన పరిశీలన, ఇరవై ఐదవ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉండగా, పోలింగ్ జరిగిన రోజే లెక్కింపు పూర్తయ్యేలా ఏర్పాట్లు జరిగాయి. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరూనామినేటెడ్ సభ్యులు సహాగోప్యంగా సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు పద్ధతిలో ఓటు వేయనున్నారు. ఓటు వేసే సభ్యుల సంఖ్య, చెల్లుబాటు అయ్యే ఓట్ల ఆధారంగా ఎన్డీయే వ్యూహం స్పష్టంగానే కనిపిస్తోంది. దక్షిణాదిలో తమ బలం పెంచుకోవాలనే ఉద్దేశంతో తమిళనాడుకు చెందిన అనుభవజ్ఞుడైన నాయకుడిని పోటీలో దించారు. రాధాకృష్ణన్ రాజకీయ జీవితంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావం ఉన్నా, ఆయనను 'సన్ ఆఫ్ ది సాయిల్'గా ప్రదర్శించడం ద్వారా తమిళనాడులో ప్రాంతీయ గర్వాన్ని రేకెత్తించాలన్నది ఎన్డీయే లెక్క. ఇలాంటి అభ్యర్థి కారణంగా ప్రతిపక్ష శిబిరంలోని ముఖ్యంగా డీఎంకే వంటి పార్టీలు చిక్కులో పడే అవకాశం ఉన్నదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇండియా కూటమి వ్యూహం వెనక లోతైన ఆలోచన ఉంది. రాజకీయ నాయకుని కంటే రాజ్యాంగ విలువల పట్ల కట్టుబాటు ఉన్న న్యాయమూర్తిని పోటీలో నిలబెట్టడం ద్వారా ఒక సందేశం ఇవ్వాలన్నది వారి లక్ష్యం. తెలంగాణలో జన్మించిన బి. సుదర్శన్ రెడ్డి న్యాయవాదిగా ప్రారంభమై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా చేరిన మార్గం, న్యాయపరమైన చరిత్రలో సల్వా జుడుం కేసులో ఆయన ఇచ్చిన తీర్పు, పౌరులను ఆయుధీకరించడం ప్రజాస్వామ్యానికి హానికరం అన్న కఠిన వ్యాఖ్య ఇవన్నీ ఆయన ప్రజాహిత పరుడనేది రుజువు చేశాయి. గోవా తొలి లోకాయుక్తగా కూడా ఆయన స్పష్టమైన పరిపాలనా ధోరణిని చూపించారు. ఇలాంటి వ్యక్తిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ముందుకు తేవడం ద్వారా ప్రతిపక్షం దక్షిణాదిలో తెలంగాణ బలం, దేశవ్యాప్తంగా ప్రగతిశీల ధోరణి రెండింటినీ సమన్వయం చేసింది. ఈ నేపథ్యంలో పోటీ గణాంకాలు పాలకపక్షానికే అనుకూలంగా కనిపిస్తున్నా, ప్రతిపక్షం పెట్టిన అభ్యర్థి వ్యక్తిత్వం, ఆయన ప్రతినిధిత్వం చర్చను కొత్త దిశలోకి నడిపిస్తోంది. లోక్‌సభలో బీజేపీ ఆధిపత్యం, రాజ్యసభలోనూ సహజమైన బలం, నామినేటెడ్ సభ్యుల ఓట్లు ఇవన్నీ ఎన్డీయేకు సంఖ్యాత్మక ఆధిక్యాన్ని అందిస్తున్నాయి. అయితే విపక్షం ఆశించేది క్రాస్‌వోటింగ్, గైర్హాజరు, లేదా ప్రాంతీయ పార్టీల ఇష్యూ-బేస్డ్ నిర్ణయాలు మార్పు తేవడం. ఇప్పటికే ఎన్డీయేకు మద్దతు లభిస్తుందనే సంకేతాలు ఉన్నా, సుదర్శన్ రెడ్డి వంటి అభ్యర్థి దేశవ్యాప్తంగా ఒక కొత్త చర్చకు దారి తీస్తున్నారు. సెప్టెంబర్ తొమ్మిదో తేదీన ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పార్లమెంట్ హౌస్‌లో జరిగే పోలింగ్ అనంతరం అదే రోజు ఫలితాలు వెలువడతాయి. ఓటింగ్ పద్ధతి ప్రకారం అభ్యర్థుల ప్రాధాన్యతను గుర్తించి వరుసగా గుర్తు పెట్టాలి. రెండు ప్రధాన అభ్యర్థులే ఉన్నందున మొదటి ప్రాధాన్యత ఓట్లే నిర్ణయాత్మకం అయ్యే అవకాశం ఉంది. ఫలితాలు వెలువడిన వెంటనే కొత్త ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేసి రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారు. మొత్తంగా చూస్తే, ఈ ఎన్నిక సంఖ్యల లెక్కల ప్రకారం ఎన్డీయే ఆధిపత్యం సుస్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, ఇండియా బ్లాక్ ముందుకు తేవడం ద్వారా సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం రాజకీయాన్ని మించి రాజ్యాంగ విలువలపై, సంక్షేమ%-%ప్రగతిశీల భావజాలాలపై, దక్షిణాది ప్రతినిధిత్వంపై ఒక చర్చను మళ్లీ ప్రేరేపిస్తోంది. ఈ పోటీ చివరికి ఎవరు గెలిచినా, దేశ రాజకీయ చరిత్రలో భావజాలాల మధ్య ఉన్న భిన్నతను స్పష్టంగా గుర్తుచేసే ఘట్టంగా నిలిచిపోనుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# మోడీ ఆర్ఎస్ఎస్ కి భయపడ్డారా ?

నరేంద్ర మోడీ. హిమ పర్వతం లాంటి వారు. మేరు నగధీరుడు. అజేయుడు, ఆయన గుండె ధైర్యం ప్రత్యర్థులకు దడ పుట్టిస్తుంది. ఇవన్నీ మోడీని తరచూ కీర్తించే వారి నోటి నుంచి వచ్చే పడి కట్టు పదాలు మరి మోడీ కూడా జడుస్తారా లేక భయపడతారా అంటే ప్రత్యర్ధి కాంగ్రెస్ నేతలు అయితే ట్రంప్ కి మోడీ భయపడతారు అని ఒక్కటే విధంగా విమర్శలు చేస్తారు. ఇప్పటిదాకా ట్రంప్ చేసిన ఏ ప్రకటన మీద మోడీ వివరణ నేరుగా ఇవ్వలేదని వామపక్షాలు సైతం తప్పు పడతాయి. మరి అది రాజకీ యంగా చేసే విమర్శలుగా కొట్టి పారేసినా నిజంగా మోడీ భయపడ తారా అది కూడా తాను పుట్టి పెరిగిన ఆర్ఎస్ఎస్ కి భయపడతారా అంటే అక్కడ ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయని అంటున్నారు.

**సంఘ్ పవర్ ఫుల్ :** బీజేపీకి కర్త కర్మ క్రియ ఇవన్నీ ఆర్ ఎస్ ఎస్ అని ఘంటాపథంగా చెబుతారు. సంఘ్ మొదట పుట్టింది. తరువాత జన సంఘ్ పుట్టింది ఆ జన సంఘ్ కి మారు రూపమే బీజేపీ. అలాంటిది సంఘ్ నుంచే అంతా నాయకత్వం నేర్చుకుని బీజేపీలోకి వస్తారు. అందుకే సంఘ్ అంటే అంతా భయంతో కూడిన భక్తితో కడు వినయంగా ఉంటారు మోడీ కూడా సంఘ్ నుంచి వచ్చిన వారే. ఆయనకు సంఘ్ అంటే ఏమిటో పూర్తిగా తెలుసు అని కూడా అంటారు.

**బీజేపీ వెనక ఆర్ఎస్ఎస్ :** బీజేపీ ప్రతీ విజయంలో ప్రతీ అడుగులో ఆర్ఎస్ఎస్ ఉంది. బీజేపీ ఎపుడు అధికారంలోకి వచ్చినా కచ్చితంగా ఆర్ఎస్ఎస్ గ్రౌండ్ లెవెల్ లో చేసే వర్క్ తో అని అంతా నమ్ముతారు. బీజేపీకి మొత్తం దిశా నిర్దేశం చేసేదే ఆర్ఎస్ఎస్ అన్నది కూడా ఒక నిశ్చితాభిప్రాయంగా ఉంది. బీజేపీకి గురువుగా ఒక శ్రేయోభిలాషిగా ఒక పెద్దగా ఆర్ఎస్ఎస్ ఉంటుంది. బీజేపీ రాజకీయంగా చేసే తప్పు ఒప్పులను కూడా నివేదించి ఎప్పటికపుడు సవరించే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అలాంటి సంఘ్ అంటే బీజేపీలో అందరికీ భయమే అని చెబుతారు.

**కోపంతో పాటు గ్యాప్ :** ఇదిలా ఉంటే బీజేపీ పెద్దలుగా కాషాయ ద్వయంగా పేరు గడించిన నరేంద్ర మోడీ అమిత్ షా ఈ ఇద్దరూ కూడా ఆ మధ్య కాలంలో ఆర్ఎస్ఎస్ అంటే ఎందుకో ఆగ్రహంగా ఉన్నారని అంటున్నారు. దాంతో 2024 ఎన్నికల్లో కూడా ఆర్ఎస్ఎస్ ని పక్కన పెట్టారు అని అంటున్నారు. అలా ఆర్ ఎస్ ఎస్ ని పక్కన పెడితే ఏమైందో తరువాత ఫలితాలతో పూర్తిగా వారికి అర్థం అయింది అని కూడా చెప్పుకుంటున్నారు అయితే కొంతకాలంగా బీజేపీకి ఆర్ఎస్ఎస్ కి మధ్య చాలా అంశాలలో భేదాభిప్రాయాలు ఉన్నాయని అంటున్నారు

**మోడీ మార్క్ కితాబులు :** అయితే కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆర్ఎస్ఎస్ ని దగ్గర తీయడం మొదలెట్టారు అని అంటారు దాంతో ఆ ప్రభావం హర్యానా మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల మీద పడి బీజేపీకి మంచి విజయాలు దక్కాయని కూడా గుర్తు చేస్తారు. ఇటీవలనే మోడీ నాగపూర్ లోని ఆర్ఎస్ ఎస్ కార్యాలయం కూడా సందర్శించి వచ్చారు. ఆయన పదకొండేళ్ళ ప్రధానమంత్రిత్వంలో ఎపుడూ సంఘ్ కార్యాలయానికి వెళ్ళింది లేదని కూడా గుర్తు చేస్తారు. ఇక తాజాగా జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎర్ర కోట మీద మోడీ ప్రసంగితూ ఆర్ఎస్ఎస్ కి కితాబులు ఇచ్చారు. సంఘ్ సేవలను ఎంతగానో మెచ్చుకున్నారు. వందేళ్ళ ప్రయాణంలో ఆర్ఎస్ఎస్ ఎంతో సాధించింది అని కూడా జాతి జనులకు బిగ్గరగా చెప్పారు.

**నాడు అలా నేడు ఇలా :** ఇక బీజేపీకి ఎంతో సమర్థత ఉందని ఆర్ఎస్ఎస్ తమకు అవసరం లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గత లోక్ సభ ఎన్నికల ముందు సంచలన వ్యాఖ్యలు చేసారు. దాని మీద ఆర్ఎస్ఎస్ కూడా బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేదు అయితే లోక్ సభ ఎన్నికల్లో సీట్లు తగ్గాక కానీ బీజేపీ పెద్దలకు తత్వం బోధపడలేదని దాంతో సంఘ్ తో తమ బంధాలను మెరుగుపరచుకోవడానికి ప్రయత్నాలు ఒదలెట్టారు అని గుర్తు చేస్తున్నరు.

**బీజేపీ అధ్యక్షుడి ఎన్నికతో క్లారిటీ :** ఇక బీజేపీ పెద్దగా ప్రధానిగా మోడీ ఆర్ఎస్ఎస్ ని పొగిడారు దాని వెనక చాలా అంశాలు ఉన్నాయని అంటున్నారు. బీహార్ తమిళనాడు వంటి అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2029లో జరిగే లోక్ సభ ఎన్నికలు కూడా దృష్టిలో పెట్టుకుని ఆర్ఎస్ఎస్ కి దగ్గర కావాలని కో ఆర్డినేట్ చేసుకోవాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు అయితే ఈ కో ఆర్డినేషన్ ఫలితాలు ఏమిటి ఎలా అన్న దానికి ఒక కొలమానంగా కొత్త బీజేపీ ప్రెసిడెంట్ ఎవరు అన్నదానిని బట్టి అర్థం అవుతుంది అని అంటున్నారు. సంఘీయుడికే ఈ పదవి ఇస్తే కనుక ఆర్ఎస్ఎస్ తో బీజేపీ కో ఆర్డినేషన్ సాఫీగా సాగుతున్నట్లే భావించాలి. పరిస్థితులు చూస్తే మోడీ అమిత్ షా ఆర్ఎస్ఎస్ అంతా కలసి బలమైన సంఘ్ నేతనే ఎంపిక చేయవచ్చు అన్న ఊహాగానాలూ ఉన్నాయి. చూడాలి మరి ఏమి జరుగుతుందో....


# మధుర గాత్రానికి ప్రతిరూపం వి. రామకృష్ణ - ఆగస్టు 20... మధుర గాయకుడు వి. రామకృష్ణ జయంతి

తెలుగు సినీ సంగీతానికి ఒక నిత్య పుష్పంగా వికసించిన గాయకుడు విస్తంరాజు రామకృష్ణ దాసు, తెలుగు ప్రేక్షకులకు "వి. రామకృష్ణ"గా సుపరిచితుడు. మధురమైన స్వరానికి, సున్నితమైన భావాలకు నూరిత గాత్రానికి ఆయన మారు పేరయ్యారు. మూడు దశాబ్దాలకు పైగా శ్రోతలను తీయటి పాటలతో అలరించి, వేలాది గాన మణులను తెలుగు సంగీత ఖజానాకు అందించారు. ఆయన గాత్రం చల్లని వానలో తడిచిన తొలి చినుకుల లా ఉండేది. ప్రతి పాటా ఓ ఆత్మీయ అనుభూతి, ఒక స్వర యాత్ర. 1947 ఆగస్టు 20న విజయ నగరం జిల్లాలో జన్మించిన రామకృష్ణ చిన్నతనం నుంచే సంగీతంపై అపారమైన మక్కువను పెంచుకున్నారు. శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకొని, ఆ శిక్షణను అనుభూతిగా మార్చిన అరుదైన గాయకుల్లో ఆయన ఒకరు. సంగీతాన్ని ఆత్మగా భావించిన ఆయన, కేవలం కళా ప్రదర్శనకే కాకుండా, భావ ప్రకటనకు సాధనంగా గానం చేశారు. 1960ల చివరలో సినీ రంగ ప్రవేశం చేసి, తక్కువ కాలంలోనే తన మృదువైన గాత్రంతో సంగీత దర్శకుల మన్ననలు పొందారు. కె.వి.మహదేవన్, రాజన్ నాగేంద్ర, చక్రవర్తి, కోటి వంటి దిగ్గజాలచే అవకాశం పొందిన రామకృష్ణ, అనేక హిట్ చిత్రాల్లో పాడి తెలుగు పాటల పటాన్ని ఆహ్లాద భరితంగా మలచారు. రామకృష్ణ గానం సౌందర్యాన్ని మాత్రమే కాదు, సాహిత్యపు సారాన్ని కూడా ప్రతిబింబించేది. ఆయన పాడిన "చూపులేచి చినుకై తగిలే వేళ" అనే పాటలో ప్రేమలోని సంశయాలను, అమాయకపు ఆకర్షణను ఎంతో మృదువుగా మలిచారు. "ఓ ఊర్వశి కావ్యమూర్తి" అనే పాటలో శృంగార రసానికి కవిత్వపు వర్ణనను గాత్రంలో ప్రతిబింబిస్తూ, శ్రోతలను మైమర పించారు. "కలలే పలుకుతుంటే" అనే పాటలో కలలలోనూ ఊహలలోనూ మాట్లాడే అనురాగాన్ని ఆయన గొంతు స్పష్టంగా పలికించింది. "ఈ కాలమే ఈ పాత నవల" పాటలో కాలప్రవాహాన్ని, భావ వికాసాన్ని, జీవిత పరిమళాన్ని గాన రూపంలో ఆవిష్కరించారు. "నిన్ను చూసాక నాకేమైనా అయ్యింది" అనే పాటలో ప్రేమ అనేది ఎప్పుడూ ఊహలకే పరిమిత మవుతుందో అనే మనోభావాన్ని, ఎంతో అంతర్ముఖతతో వెలికి తీశారు. ఆయన ఆలపించిన పాటల్లో భావం, భాష, బంధం అన్నీ సమపాళ్లలో మిళితమై ఉండేవి. ఘంటసాల ప్రభావం ఉన్నా, ఆ ప్రభావాన్ని అధిగమించి, తనదైన గానశైలితో రామకృష్ణ వినూత్న ప్రతిభను చూపించారు. ఆయన గొంతులో ఉన్న మృదుత్వం, మధ్య శ్రుతిలోని మెలకువ, తక్కువ గమకాలతో ఎక్కువ భావాన్ని పలికించే శక్తి ఆయన గానానికి ప్రత్యేకతను కలిగించింది. "చిత్రమైన భావాలు" వంటి తక్కువగా ప్రసిద్ధి చెందిన పాటలు కూడా ఆయన గాత్రంలోని లోతును, తేజస్సును వెల్లడించాయి. భక్తి గీతాలలోనూ ఆయనకున్న పట్టు అసాధారణం. "హర హర శంకర", "శివ శివ శివ భోజనానంద" వంటి గీతాలు ఆధ్యాత్మికతను శ్రోత గుండెల్లో నాటే స్వరంగా మారాయి. రామకృష్ణ గాత్రంలో భక్తిరసం ఓ వేదగానంలా ప్రతిధ్వనించింది. గంభీరత, శాంతి, నిబద్ధతతో కూడిన స్వరం ఆలయ గర్భగుడిలో వినిపించే శాంతస్వరంలా ఉండేది. తాతామనవడు, భక్తతుకారాం, శారద, కృష్ణవేణి, అల్లూరి సీతారామరాజు, ముత్యాల ముగ్గు, అందాల రాముడు, భక్త కన్నప్ప, దాన వీర శూర కర్ణ, మహాకవి క్షేత్రయ్య, అమర దీపం, శ్రీమద్ విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, శ్రీషిర్డీ సాయిబాబా మహత్యం, బలిపీఠం, గుణవంతుడు, కరుణా మయుడు లాంటి చిత్రాల్లో ఆయన పాడిన పాటలు నిత్య జ్ఞాపకాలే. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్ బాబు, కృష్ణ, మురళీ మోహన్ లాంటి అగ్రతారల చిత్రాల్లో ఆయన గొంతు తమ పాత్రలకు జీవం పోసింది. ముఖ్యంగా శోభన్ బాబు పాత్రల పట్ల ఆయన గానం ఎంతో అనురాగాన్ని కలిగించేది. ఆ పాత్రల్లోని భావోద్వేగాలను ఆయన స్వరం ఆకర్షణీయంగా వెలికితీసింది. "దేవుడే ఇచ్చాడు వీధి", "ఎంతటి రసికుడివో", "వసంత సమీర" వంటి పాటలు ఆ పాత్రల ఆత్మను మనకు వినిపించినట్లు అనిపిస్తాయి. అతని పాటలు మాత్రమే కాదు, జీవిత ప్రవర్తన కూడా గంభీరంగా ఉండేది. మితభాషి, వినయ వంతుడు అయిన రామకృష్ణ తన గాన సాధనను విలాసంగా కాక, భక్తిగా కొనసాగించారు. అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నా, ఎప్పటికీ వినమ్రంగా ఉండటం ఆయన వ్యక్తిత్వ విశేషం. 2015



జూలై 16న అనారోగ్యంతో ఈ గాన మధుర స్వరం మూగ బోయింది. కానీ ఆయన ఆలపించిన పాటలు తెలుగు సంగీత చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోయాయి. గళపరంగా ఆయన మన మధ్య లేకపోయినా, గాత్రంగా మాత్రం ప్రతీ మనసులో ఒక తీయని ఆలాపనగా వినిపిస్తూనే ఉంటారు. వి. రామకృష్ణ ఒక గాయకుడు మాత్రమే కాదు %-% ఒక స్వరం. ఆ స్వరం మౌనంగా పలికిన భావాలకు శబ్దం ఇచ్చింది. ఆ గాత్రం తీయని అనుభూతికి రూపం ఇచ్చింది. తెలుగు గాన పరంపరలో ఆయన స్థానం శాశ్వతం. ఆయన పాటలు పల్లకిలో కూర్చుని, భావాల పయనంలో తీసుకెళ్లే లాంటి ప్రయాణం. ఆయన్ని మరచి పోవడం సాధ్యం కాదు - ఎందుకంటే ఆయన గానం మనల్ని తడిపించిన వర్షం, మన హృదయాన్ని తాకిన తంతి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**


# పునరుత్పాదక శక్తి వినియోగం - భవిష్యత్ తరాలకు పచ్చ పరిమళం - అక్షయ్ ఊర్జా దినోత్సవం ఆవిష్కారం...పర్యావరణ పరిరక్షణకు శక్తి విప్లవం




ప్రతి సంవత్సరం ఆగస్టు 20న దేశ వ్యాప్తంగా అక్షయ్ ఊర్జా దివస్ జరుపు కుంటారు. 2004లో మొదలైన ఈ దినోత్సవం, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన సాంకేతికాభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ పునరుత్పాదక ఇంధనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేయ బడింది. 'అక్షయ్' అనే పదానికి క్షీణించని, ఎప్పటికీ తరుగని అనే అర్థం ఉంది. అదే భావాన్ని ప్రతిబింబిస్తూ సౌర శక్తి, గాలి శక్తి, నీటి ప్రవాహ శక్తి, బయోమాస్, భూతాప శక్తి, సముద్ర తరంగాల శక్తి వంటి పునరుత్పాదక వనరులను వినియోగించడంపై ఈ రోజు దృష్టి కేంద్రీకరించ బడుతుంది. మనిషి నాగరికతలో శక్తి వనరుల ప్రాధాన్యం అపారమైంది. పారిశ్రామిక విప్లవం నుండి ఇప్పటివరకు బొగ్గు, చమురు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలే అభివృద్ధికి ఆధారం. కానీ వీటి నిల్వలు పరిమిత మవుతుండటంతో పాటు అధిక వినియోగం వలన గ్రీన్ హౌస్ వాయువులు పెరిగి భూమి ఉష్ణోగ్రతలు గత 150 సంవత్సరాల్లో సగటున 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి. యునైటెడ్ నేషన్స్ నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా కార్బన్ ఉద్గారాలలో సుమారు 75% శాతం శిలాజ ఇంధనాల వినియోగం వల్లే ఉత్పత్తి అవుతున్నాయి. వాతావరణ మార్పులు, సముద్ర మట్టాల పెరుగుదల, హిమనదుల కరుగుదల, తుపానులు, వరదలు, కరువులు వంటి సమస్యలకు ఇది ప్రధాన కారణం. ఈ పరిస్థితుల్లో పునరుత్పాదక ఇంధనాలే భవిష్యత్తు కోసం సరైన మార్గం. భారత్ ఈ దిశగా గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. 2014లో దేశంలో పునరుత్పాదక శక్తి సామర్థ్యం 80 గిగావాట్లు మాత్రమే ఉండగా, 2025 నాటికి ఇది 180 గిగావాట్లకు పెరిగింది. ఇందులో 82 గిగావాట్లు సౌర శక్తి, 47 గిగావాట్లు గాలి శక్తి, మిగతావి జలవిద్యుత్, బయోమాస్ వనరులవే. అంతర్జాతీయ సౌర కూటమి ఏర్పాటులో భారత్ కీలకపాత్ర పోషించింది. ఇది 2015లో పారిస్ ఒప్పందం తరువాత భారత్–ఫ్రాన్స్ సంయుక్త ఆవిష్కరణ. ప్రస్తుతం 110కిపైగా దేశాలు సభ్యత్వం పొందాయి. గుజరాత్ లోని చరణకా సోలార్ పార్క్, రాజస్థాన్ లోని భద్లా సోలార్ పార్క్ వంటి ప్రాజెక్టులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. తమిళనాడు గాలి విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పెద్ద సౌర ప్రాజెక్టులు విజయవంతంగా నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బయోగ్యాస్ ప్లాంట్లు, సౌర దీపాలు, సౌర వంటిల్లు వాడకం పెరుగుతోంది. ప్రభుత్వం 'గ్రీన్ ఎనర్జీ కారిడార్స్' ద్వారా పునరుత్పాదక శక్తి ఉత్పత్తి కేంద్రాలను జాతీయ విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తోంది. అక్షయ్ ఊర్జా దివస్ సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో సెమినార్లు, ప్రదర్శనలు, ర్యాలీలు, వర్క్‌షాప్‌లు నిర్వహించి విద్యార్థులు, యువతలో పునరుత్పాదక శక్తి ప్రాముఖ్యతను చాటి చెప్పుతున్నారు. పునరుత్పాదక శక్తి వినియోగం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుని కర్తవ్యమని ఈ రోజుతో గుర్తుచేస్తారు. ఇళ్లలో సౌర ప్యానెల్లు అమర్చడం, విద్యుత్ పొదుపు పరికరాలు వాడటం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, అవసరమైనంత మాత్రమే విద్యుత్ వినియోగించడం వంటి చిన్నచిన్న చర్యలతోనే పెద్ద మార్పు సాధ్యమవుతుంది. భారతదేశం 2070 నాటికి నెట్ జీరో కార్బన్ ఉద్గారాలు సాధించాలనే సంకల్పాన్ని ప్రకటించింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో పునరుత్పాదక ఇంధనాలు కీలక పాత్ర పోషించ నున్నాయి. శక్తి రంగంలో ఈ మార్పు కేవలం పర్యావరణ పరిరక్షణకే కాకుండా, ఆర్థికంగా దేశానికి మేలు చేస్తుంది. పచ్చశక్తి రంగం 2030 నాటికి కోట్లాది ఉద్యోగాలను సృష్టించే అవకాశముందని నిపుణుల అంచనా. అందువల్ల అక్షయ్ ఊర్జా దివస్ కేవలం ఒక దినోత్సవం కాదు, భవిష్యత్తు పర్యావరణ పరిరక్షణకు ఇచ్చే హెచ్చరిక, సుస్థిర అభివృద్ధికి ఇచ్చే సంకేతం. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడం ద్వారా ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక పురోగతిని ఒకేసారి సాధించవచ్చు. ప్రతి పౌరుడు తమ స్థాయిలో సహకరిస్తే, భారత్ ప్రపంచానికి పచ్చశక్తి విప్లవంలో ఆదర్శంగా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# దోమల పట్ల అప్రమత్తం అవసరం - ఆగస్టు 20... ప్రపంచ దోమల దినోత్సవం

దోమల కట్టడికి ఏటా ఓ రోజున ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్న విషయం చాలా మందికి తెలియదు. అదే ఆగస్టు 20వ తేదీ. బ్రిటీష్ శాస్త్రవేత్త, వైద్యులు, కీర్తిశేషులు రోనాల్డ్ రాస్ ఆవిష్కరణకు గుర్తుగా ప్రపంచ దోమల దినోత్సవాన్ని ప్రతి ఏటా జరుపు కుంటున్నారు. దోమల వల్ల ఏమేమి రోగాలొస్తాయో అందరికీ తెలిసిందే. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి రోగాలు రాకుండా ఏమేమీ జాగ్రత్తలు తీసుకోవాలో.. రాస్ అనే శాస్త్రవేత్త దోమల గురించి ఏమి కనుగోన్నారో తెలుసుకోవడం అత్యవసం, అనివార్యం. బ్రిటీష్ ఇండియా శాస్త్రవేత్త సికింద్రాబాద్ లో నివాసముండే రోజుల్లో సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20వ తేదీన మలేరియా పరాన్నజీవి ప్లాస్మోడియం పరాన్నజీవి ఉనికిని, అనాఫిలస్ అనే ఆడదోమ లాలజల గ్రంధుల్లో గుర్తించాడు. ప్లాస్మోడియం జీవిత చక్రాన్ని సైతం విపులంగా వివరించాడు. దీంతో ఆ గొప్ప శాస్త్రవేత్త ఆవిష్కరణకు గుర్తుగా దోమలకు ఒక గుర్తింపు వచ్చింది. ఈయన ఆవిష్కరణకు ముందు ప్రజల్లో వేరే భావన ఉండేది. అంతకు ముందు దీనిని మాల్ అని పిలిచేవారు. మాల్ అంటే చెడు అని అర్థం. చెడు ఏరియా వలన కలిగే వ్యాధి అని అందుకనే అలా పిలిచేవారు. రోనాల్డ్ రాస్ మహానుభావుడి చేసిన కృషి వల్లనే మలేరియాతో పాటు దోమల వల్లే వచ్చే ఇతర వ్యాధులకు నివారణ మార్గాలు సులభ మయ్యాయి. ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, విరేచనాలు, నీరసంగా ఉండటం, చలిజ్వరం, తలనొప్పి, ఆయాసం వంటి తొలిదశలో వచ్చే లక్షణాలు. దోమ కాటుకు గురైన ఏడు నుండి 18 రోజుల మధ్యలో మనకు మలేరియా లక్షణాలు కనిపిస్తాయి. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే మనం మెరుగైన చికిత్సను అందించవచ్చు. దోమ సాధారణంగా ఎక్కడపడితే అక్కడ కనిపించే కీటకం. అది మనుషుల రక్తం తాగి బతుకుతుంది. అయితే అలా అది రక్తం పీల్చేప్పుడు మన శరీరంలోకి కొన్ని క్రిములను కూడా విడుదల చేస్తుంది. ఆ క్రిముల వల్ల ఎన్నో వ్యాధులు వస్తాయి. మలేరియా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా (బోదవ్యాధి), డెంగ్యూ జ్వరం, చికెన్ గునియా, కాలా జ్వరము - నల్ల మచ్చలు జ్వరంలో కనపడే లక్షణాలు, లింఫాటిక్ ఫైలేరియల్ తదితర వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయి. జాతీయ మలేరియా కార్యక్రమం ద్వారా అన్ని జిల్లాలలో జిల్లా మలేరియా కార్యాలయాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఉప కేంద్రాలలో సిబ్బంది నియమింప బడి ఉన్నారు. ఇందులో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోజుకు 24 గంటలు పని చేయునట్లుగా ఏర్పాటు చేయబడింది. ఎవరైనా ఎలాంటి జ్వరంతోనైనా బాధపడుతుంటే ఎలాంటి మందులు తీసుకోక ముందు పైన ఉదహరించిన కేంద్రాలకు వెళ్ళి వ్యాధి నిర్ధారణ కొరకు రక్త పరీక్ష చేయించు కోవాలి. వ్యాధి నిర్ధారణలో వచ్చిన జ్వరం మలేరియా మూలంగా అని తేలితే, మలేరియా సిబ్బంది




చికిత్స ప్రారంభిస్తారు. మలేరియా క్రిములున్న దోమ ఆరోగ్యవంతున్ని కుట్టినాక 10 నుండి 14 రోజుల వ్యవధిలో వ్యాధి లక్షణాలు బయటకు వస్తాయి. జ్వరం వచ్చినప్పుడు రక్త పరీక్ష చేయించాలి. మలేరియా అని నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవాలి. రక్త పరీక్ష చేసే సదుపాయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లభిస్తుంది. దోమల ద్వారా ఈ జ్వరం వ్యాపిస్తుంది. కావున దోమలు పుట్టి పెరిగే స్థావరాలను అరికట్టాలి. నీరు నిలకడ ప్రదేశాలను పూడ్చి వేయాలి. ఇంటి పరిసరాలలో గుంతలు గోతులు లేకుండా జాగ్రత్త పడాలి. ఇంటి బయట పడుకునే వారికి దోమ తెర, వంటి నిండా బట్ట ఉంచుకోమని తెలియ చేయడం ముఖ్యం. వేపనూనె ఒంటికి రాసుకుంటే దోమ కుట్టదు. చిన్న చిన్న చెరువులు, గుంటలలో గంబూసియా లేక గప్పి చేపలు వదలడం చేపట్టాలి. ఇంటిపై కప్పులో వున్న ట్యాంకులు (ఓవర్ హెడ్ ట్యాంకులు), నీటి కూలర్స్ మొదలగు నీటి తొట్లలో దోమలు పెరగకుండా చూసుకోవాలి. జూన్ - మలేరియా మాసం. ఈ నెలలో స్ప్రే జరిగిందా లేదా చూసుకోవాలి. గ్రామ పంచాయితీలో యాంటీ లార్వలం (దోమ పిల్లలను చంపుట) జరిగిందా లేదా చూసుకోవాలి. చలిజ్వరం కేసులున్నప్పుడు మలేరియా సిబ్బంది వచ్చి రక్తపరీక్ష చేయించడంలో సమన్వయం ఏర్పరచు కోవాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## పెయ్యదూడలే పుడతాయ్..!

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వం మేలుజాతి పశు సంతతి, పాల ఉత్పత్తిని వృద్ధి చేసేందుకు కృషి చేస్తోంది. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టి పాడి రైతులకు రాయితీపై మేలుజాతి వీర్యం(సైవర్ (బ్రీడ్) సరఫరా చేస్తోంది. ఇందుకు ఆడ, పెయ్య దూడలు పుట్టేలా పశు సంవర్ధకశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీటితో జిల్లాలో ఉత్పత్తి పెరగడంతోపాటు పాల వృద్ధి కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో 1,89,000 వరకు ఆవులు, గేదెలు ఉన్నాయి. సాధారణంగా వీర్యం ఎక్కిస్తే 50 శాతం ఆడ, పెయ్య దూడలు జన్మిస్తాయి. అలా కాకుండా మేలు జాతి వీర్యం వినియోగిస్తే 90 శాతం ఆడ, పెయ్య దూడలు జన్మించే అవకాశం ఉంది. ఇందుకు ప్రభుత్వానికి ఒక్కో ఇంజెక్షన్‌కు రూ.600 ఖర్చు అవుతుండగా, పాడి రైతులకు రాయితీపై రూ.250కే అందిస్తోంది. దీనిపై పశువైద్య



సిబ్బంది, గోపాలమిత్రలు క్షేత్రస్థాయికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రతి పశువైద్యశాల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెల 30కిపైగా పశువులకు ఇంజెక్షన్లు వేయాలని లక్ష్యం నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని పశువైద్య కేంద్రాల్లో మేలుజాతి వీర్యాన్ని అందుబాటులో ఉంచడంతో ఏడాదిలో మేలుజాతి పశువులు, పాల ఉత్పత్తి పెరిగే అవకాశాలున్నాయి. పాల ఉత్పత్తి పెరుగుతుంది: శ్రీనివా సరావు, జిల్లా పశువైద్యాధికారి, సూర్యాపేట

జిల్లాలోని పశువుల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలి. పాల ఉత్పత్తికి మంచి తరుణం. దీంతోపాటు మేలు జాతి రకం పశువులు కూడా పెరిగే అవకాశం ఉంది. రైతులు ముందుకొచ్చి సహకరించాలి.

## స్థానిక ఎన్నికలకు సిరా సీసాలు

భానుపురి: ఎన్నికల్లో ఓటు వేసింది.. వేయనిది తేల్చేందుకు చేతి వేలికి గుర్తుపెడతారు. ప్రతి పోలింగ్ సమయంలో సిరా చుక్కను వేలికి రాస్తారు. అలాంటి గుర్తుపెట్టే రంగు సిరా సీసాలు జిల్లాకు కేటాయించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వీటిని వినియోగించనున్నారు. స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్న సిరా సీసాల్ని తీసుకెళ్లాలంటూ పంచాయతీరాజ్ డైరెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన జిల్లాకు కేటాయించిన వాటిని హైదరాబాద్‌లోని ప్రింటింగ్, స్టేషనరీ విభాగం నుంచి ఈ నెల 18న జడ్పీ అధికారులు తేనున్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ అధికారులు పూర్తిచేశారు. ఈ మేరకు 1740 గ్రామ పంచాయతీలలోని 20,880



వార్డుల ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం ఖరారు చేసిన తాజా ఓటర్ల జాబితాను అనుసరించి స్థానిక ఎన్నికలకు ఓటర్ల జాబితా మ్యాపింగ్ చేశారు. మండల పరిషత్తు కార్యాలయాల్లో గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఈ ప్రక్రియ చేపట్టారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా ఖరారైన తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా జాబితా రూపొందిస్తారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు ఎన్ని అవసరముంటాయో పరిశీలించి ఆర్డర్ పెట్టి తీసుకొస్తామని జడ్పీ సీఈవో అప్పారావుకు తెలిపారు.

## విద్యార్థి ప్రతిభకు.. విజ్ఞాన్ మంథన్

సంగారెడ్డి : విద్యార్థులు పరిశోధనలు, ప్రయోగాలపై దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విజ్ఞాన భారతి, విజ్ఞాన్ ప్రసార్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్స్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సంయుక్త ఆధ్వర్యంలో విజ్ఞాన్ మంథన్ పేరిట ప్రతిభా పరీక్ష ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ప్రస్తుతం దరఖాస్తులు ఆహ్వానించారు.

**దరఖాస్తు ఇలా..**6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు ప్రతిభ పరీక్ష రాసేందుకు అర్హులు. విద్యార్థులు %http:///vvm.org.in% వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేయాలి. రూ.200 రుసుం చెల్లించాలి. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తారు. అక్టోబరులో లెవల్–1 పరీక్షలు జరుగుతాయి.పరీక్షా విధానం..సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం. 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్, 9, 10, 11 తరగతుల వారు సీనియర్ విభాగంలో జరిగే పరీక్షలకు హాజరుకావాలి. తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు 14 భాషల్లో పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. అధునాతన చరవాణి, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా వినియోగించుకోవచ్చు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిస్తే ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ ఇస్తారు. ఉపకార వేతనాలు ఇలా..3పాఠశాల స్థాయిలో 18 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో ఒక్కో పాఠ్యాంశానికి ముగ్గురి చొప్పున రాష్ట్రస్థాయికి పంపిస్తారు. ఈ దశలో విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల ఉపకార వేతనం, ధ్రువపత్రం, జ్ఞాపిక ఇస్తారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయికి పంపిస్తారు. ఇక్కడ విజేతలకు తొలి బహుమతిగా రూ.26 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేలు అందిస్తారు. భాస్కర స్కాలర్‌షిప్ పేరిట ఏడాది పాటు నెలకు రూ.2 వేలు చెల్లిస్తారు.

# ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు వేళాయె..



ఖమ్మం : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మరో ముందడుగు పడింది. ఒక్కోచోట నిర్మాణాలు పూర్తికావొస్తుండగా.. గృహ ప్రవేశాలకు సర్కారు సన్నద్ధమవుతోంది. ఇందుకు భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు వేదిక కానుంది. (ఈనెల 21న) జరిగే ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్రంలో 44 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా.. ప్రారంభోత్సవాలకు నాలుగు గ్రామాలను గుర్తించారు.

**బెండాలపాడు ఎందుకంటే..?**

బెండాలపాడు జనాభా సుమారు 1,600. అందరూ వ్యవసాయ నేపథ్యం కలిగినవారే. ఈగ్రామానికి ప్రభుత్వం 310 ఇందిరమ్మ గృహాలు మంజూరుచేసింది. 180 మంది.. ప్రభుత్వ కొలతల ప్రకారం పనులు ప్రారంభించగా.. తక్కువ ఖర్చుతో నిర్మాణాలు పూర్తవుతు న్నాయి. ఇప్పటికే 50 ఇళ్లకు స్లాబ్‌లు పడ్డాయి. ప్లాస్టరింగ్, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు, రంగులు వేసేందుకు లబ్ధిదారులు సన్నద్ధమవుతున్నారు. గురువారం (ఈనెల 21) వరకు 25–30 ఇళు ప్రారంభోత్సవాలకు సిద్ధం కానున్నాయి. ఒకే గ్రామంలో ఎక్కువ మొత్తం గృహాలు పూర్తికావొస్తుండటంతో బెండాలపాడును సీఎం రేవంత్‌రెడ్డి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. బచ్చలి రమణ, బచ్చలి నర్సమ్మ, కుంజా భద్రమ్మ, పొడుగు జయ, పద్దం నాగమణి ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని సమాచారం. **ఖమ్మం జిల్లా ముందంజ** ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణాల పురోగతిలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందుంది. ఈ జిల్లాకు 16,153 ఇళ్లు మంజూరవగా.. 8,146 గృహాల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. ఆరెంపులలో 3, పుణ్యపురం, రేపల్లెవాడ(ఏన్కూరు), రేపల్లెవాడ(చింతకాని)లో 2 చొప్పున, చిన్నమల్యాల(వేంసూరు), మల్లేపల్లి(రఘునాథపాలెం)లో ఒకటి చొప్పున ఇళ్లకు రంగులు వేశారు. భద్రాద్రి జిల్లాలో 15,260 ఇళ్లు కేటాయించగా.. 13,846 మంజూరయ్యాయి. 6,512 (42.67శాతం) ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. పినపాక నియోజకవర్గంలో 48%, అశ్వారావుపేటలో 81.04%, భద్రాచలంలో 17.19%, కొత్తగూడెంలో 22.49% ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి.

**వర్షాలకు ఇసుక దొరక్క ఆలస్యం**

ఇళ్ల నిర్మాణాలకు వర్షాలు, ముహూర్తాలు ఆటంకంగా మారినట్లు తెలుస్తోంది. ఆషాఢమాసంలో కొందరు గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. శ్రావణమాసంలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో ఇసుక దొరకటం లేదు. దూరప్రాంతం నుంచి కొనాలంటే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయి. అందుకే పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. స్లాబ్ పూర్తయిన ఇళ్లకు ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, మరుగుదొడ్డి, తలుపులు, కిటికీలు బిగించి రంగులు వేస్తేనే పూర్తయినట్లు అధికారులు గుర్తిస్తున్నారు.

# బిల్లులు చెల్లిస్తే.. మన బడులు బాగు!



పాల్వంచ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా 2022లో భారాస సర్కారు 'మన ఊరు– మన బడి' పథకాన్ని ప్రవేశపెట్టింది. భోజనశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టింది. సింహభాగం పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఆ పథకం స్థానంలో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'ని తీసుకొచ్చింది. కొత్త పథకానికి 2024 మే మాసంలో శ్రీకారం చుట్టింది. పెద్ద పనులు కాకుండా చిన్నపాటి పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద పూర్తిచేశారు. 'మన ఊరు– మన బడి' పథకంలో పూర్తయిన పనులతో పాటు మిగిలిన పనులకు కొంతమేర నిధులు మంజూరు చేస్తే ప్రభుత్వ బడుల్లో సమస్యలు దూరం కానున్నాయి. **బకాయిలు.. రూ.21 కోట్లు** 'మన ఊరు– మన బడి' పథకం కింద ఖమ్మం జిల్లాలో 426 పాఠశాలల్లో రూ.62 కోట్లతో, భద్రాద్రి జిల్లాలో 368 బడుల్లో రూ.60.18 కోట్లతో పనులు చేపట్టారు. ఉభయ జిల్లాల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.21 కోట్ల బకాయిలు మంజూరైతే భోజనశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి. మన ఊరు– మన బడి పథకం బిల్లుల మంజూరు కోసం గుత్తేదారులు ఎదురుచూస్తున్నా రు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకంలో ఖమ్మం జిల్లాలో 955 పాఠశాలల్లో రూ.35 కోట్లతో, భద్రాద్రి జిల్లాలో 859 పాఠశాలల్లో రూ.25 కోట్లతో ఏడాది వ్యవధిలోనే పనులు పూర్తిచేయటం విశేషం. బిల్లులు సైతం ఎప్పటికప్పుడు గుత్తేదారులకు చెల్లించారు.

'మన ఊరు– మన బడి పథకం పనుల పురోగతిపై మండలాల వారీగా ఎంఈఓల ద్వారా నివేదికలు తెప్పిస్తాం. అసంపూర్తి పనుల గురించి కలెక్టర్‌కు తెలియజేస్తాం' అని భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ బి.నాగలక్ష్మి కు తెలిపారు.

# ఆరంభం అదిరింది.. అనంతరం చెదిరింది



భద్రాచలం : భద్రాచలం పట్టణంలో ప్లాస్టిక్ వాడకానికి సంబంధించిన నిబంధనలను గోదావరిలో కలిపేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు సరకులను విక్రయించే క్రమంలో పార్సిల్ చేయటానికి ప్లాస్టిక్ సంచులనే అంటకడుతున్నారు. వినియో గదారులు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించకుండా కాలకూట విషాన్ని చేత పట్టుకుని తిరుగుతున్నారు. ప్లాస్టిక్ వాడకం రోజూ సుమారు 2వేల కిలోలు ఉంటుందని అంచనా. ఇందులో 1,500 కిలోలు రీసైక్లింగ్‌కు ఉపకరిస్తుండటంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మిగతా 500 కిలోల ప్లాస్టిక్ భూతం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**పూర్వవైభవం రావాలి** పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం పట్టణాన్ని పర్యావరణ హిత ప్రాంతంగా చాన్నాళ్ల క్రితమే ప్రకటించారు. 2019 సెప్టెంబరు నుంచి ప్లాస్టిక్ రహిత భద్రాచలాన్ని తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వం 2022 జులై 1 నుంచి ప్లాస్టిక్ వాడకంపై ఆంక్షలు విధించింది. వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు వీధుల్లో తిరిగి ప్రచారం చేశారు. ప్లాస్టిక్ సంచి కనిపిస్తే అధికారులు జరిమానా విధించారు. అప్పట్లో ప్లాస్టిక్ సంచుల విక్రయాలతో పాటు వినియోగమూ ఆగింది. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవటంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తున్నారు. హోటళ్లు, పండ్ల దుకాణాలు, శాకాహారం, మాంసాహార మార్కెట్‌లో ప్లాస్టిక్ వినియోగం ఆగితేనే భద్రాచలం పట్టణానికి పూర్వవైభవం వస్తుంది.

**ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించాలి**

రామాలయంలో ప్రసాదాలకు ఉపయోగించే కవర్లతో ఇబ్బంది లేదు. ఆలయ సమీపంలో కొందరు వ్యాపారులు పూజా ద్రవ్యాలను విక్రయించే క్రమంలో కొబ్బరికాయలు, అంగర్‌బత్తీలు కలిపి ప్లాస్టిక్ సంచిలో పెట్టి ఇస్తున్నారు. వీటిని తనిఖీ చేయాలి.

100 మైక్రాన్ల లోపు సంచులను వాడకూడదనే నిబంధనలను పట్టించుకోవటం లేదు. ఇలాంటి సంచులన్నీ డంపింగ్ యార్డుకు చేరిన తర్వాత పనికొచ్చే ప్లాస్టిక్‌ను ఏరుకుని మిగతాది కాల్చేస్తుం డటంతో పొగ అలముకుని శ్వాస సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వరదల తరుణంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు గోదావరిలో కలుస్తుండటంతో నీరు కలుషితమవుతోంది. కొన్నిరకాల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవటానికి కొన్ని తరాలు పడుతుంది. వీటివల్ల భావితరాలకు కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించాలి.

గోవులు ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆలయ పరిసరాలతో పాటు గోదావరి వద్ద వస్త్రంతో తయారుచేసిన ఫ్లెక్సీలు అమర్చి భక్తుల సహకారం కోరాలి. వస్త్రంతో తయారైన సంచులను తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావాలి. కాగితం, జనపనార, విస్తరాకులు, స్టీలు పాత్రలు వినియోగించాలని అవగాహన కల్పించాలి.

భక్తులు, భద్రాచలం పట్టణవాసులు ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నా యాలను పరిశీలించాలి. మైక్ ద్వారా ప్రచారం చేస్తూ సహకరించాలని కోరుతాం. అధికారుల ఆదేశాలతో దుకాణాలను తనిఖీ చేస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తాం.– శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ ఈఓ, భద్రాచలం

## మూగ వేదన.. రైతుల యాతన

బోధన్ : ఇది బోధన్ మండల పశువైద్యశాఖ కేంద్రం. ఇక్కడ రెండేళ్లుగా ఇన్‌ఛార్జి వైద్యుడే కొనసాగుతున్నారు. ఆయన కోటగిరి, పోతంగల్ పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో గత కొన్నాళ్లుగా పశువైద్యులు, ఇతర సిబ్బంది కొరత ఉంది. మొత్తం నాలుగు ప్రాంతీయ పశు వైద్యశాలలు, 36 ప్రాథమిక వైద్యశాలలు, 41 ఉపకేంద్రాలు ఉన్నాయి. జిల్లా పశు వైద్యాధికారి ఉద్యోగ విరమణ చేయడంతో కొన్ని నెలలుగా ఆ పోస్టులో ఇన్‌ఛార్జి అధికారి కొనసాగుతున్నారు. మండల పశువైద్యుల పోస్టుల్లోనూ ఖాళీలు ఉండటంతో సమీప మండలానికి చెందిన అధికారులకు అదనపు బాధ్యతలు ఇచ్చారు.జిల్లాలో లక్షల్లో పశువులు, జీవాలు ఉన్నప్పటికీ పశు వైద్యశాలలకు కొన్ని నెలలుగా అవసరమైన మందులు సరఫరా కావడం లేదు. దీంతో పశువులకు, జీవాలకు సకాలంలో.. సరైన వైద్యం అందడం లేదని రైతులు వాపోతున్నారు. పశువులను చికిత్స నిమిత్తం తాము దవాఖానాలకు తీసుకెళ్తే మందులు



బయట కొనుక్కోవాలని పశువైద్యులు సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రైవేట్ దుకాణాల్లో కొంటున్నామని చెబుతున్నారు. కొన్నిచోట్ల సరైన సమయానికి మందులు లభించక పశువులు మృత్యువాత పడిన ఘటనలూ వెలుగుచూశాయి. ప్రస్తుతం వానాకాలం కావడంతో వాటికి వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా సరిపడా మందులు అందించాలని పాడిరైతులు కోరుతున్నారు.

**వారంలో సరఫరా చేస్తాం**

**రోహిత్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి**

కొన్ని నెలల నుంచి మందులు అందుబాటులో లేవు. ఈ విషయమై ఇది వరకే ప్రభుత్వానికి నివేదించడంతో రెండు రోజుల కిందట జిల్లాకేంద్రానికి మందులు వచ్చాయి. వాటిని పరిశీలించి మండలాల వారీగా విభజించి పశు వైద్యశాలలకు సరఫరా చేస్తాం. వైద్యుల కొరత ఉన్నా పశువులకు వైద్యం అందేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పశువైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలు ప్రభుత్వ పరిధిలో ఉంది. ఖాళీల వివరాలు సర్కారుకు నివేదించాం.

## మేల్కొంటారా.. ముప్పు తప్పిస్తారా!

సంగారెడ్డి : ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగుకు, హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందించే సింగూరు జలాశయం భద్రతపై నీటిపారుదల శాఖ అధికారులు మేల్కోవాల్సిన తరుణమిది. ఇటీవల ప్రాజెక్టును పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ(నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) బృందం సదరన్ రీజియన్ డైరెక్టర్.. జలాశయం హైరిస్క్‌లో ఉందని, తక్షణమే బలోపేతం చేయాలని పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 16.5 టీఎంసీలకు మించవద్దని నిర్దేశిస్తూ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ ఆగస్టు 8న స్థానిక ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మూడేళ్ల కిందటే మట్టికట్ట, రివిట్‌మెంటు దెబ్బతిన్నట్లు గుర్తించిన అధికారులు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికతోనైనా ప్రాజెక్టు భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

**ప్రధాన సూచనలివి..**

రిజర్వాయర్ నీటి నిల్వ ప్రాంతంలో మట్టికట్ట, రివిట్‌మెంట్ దెబ్బతిన్నాయని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు నివేదికలో వెల్లడించారు. పారపెట్ గోడ, మట్టికట్ట పైభాగంలో పగుళ్లు ఉన్నట్లు తెలిపారు. రిజర్వాయర్ అసలు(ఒరిజినల్) డిజైన్ మేరకు ఎఫ్‌ఆర్‌ఎల్ 517.8 మీటర్ల వరకే నీటిని నింపాలని అధికారులు స్పష్టం చేశారు. మిషన్ భగీరథ, సాగునీటి అవసరాల నిమిత్తం సామర్థ్యాన్ని మించి పూర్తిస్థాయి వరకు నీటిని నిల్వ చేస్తున్నారని వెల్లడించారు. ఇది ప్రమాదమని తేల్చారు. దిగువన మంజీరా, నిజాంసాగర్ ప్రాజెక్టులున్నాయని ఈ నేపథ్యంలో సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని అత్యంత కీలకంగా పరిగణించి చేపట్టాలని సూచించారు.

మూడేళ్ల క్రితమే నిధులొచ్చినా..ప్రాజెక్టు మట్టికట్ట, రివిట్‌మెంట్ మరమ్మతులకు మూడేళ్ల క్రితమే రూ.16.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాతో పాటు మిషన్ భగీరథ పథకం నిమిత్తం నీటి సరఫరాకు ఈ ప్రాజెక్టు నీటినే వినియోగిస్తున్నారు. తాగునీటి అవసరాల ప్రాజెక్టు అనే కారణంగానే నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కీలక మరమ్మతులు చేపట్టాలని నివేదికలు స్పష్టం చేస్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులు ఇప్పటికీ కార్యాచరణ చేపట్టలేదు.

**ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా..**

నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టులో నీటి నిల్వలను ఎఫ్‌ఆర్‌ఎల్ మేరకే ఉంచాలని నిర్ణయించాం. ఇందులో భాగంగానే నీటిని దిగువకు విడుదల చేస్తున్నాం. మట్టికట్టతో పాటు రివిట్‌మెంట్‌కు తాత్కాలికంగా సిమెంటు సంచులతో మరమ్మతులు చేపట్టాం. వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. మరోసారి ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు భద్రతను పరిశీలింపజేస్తాం. వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం.పోచమల్లు, ఎస్‌ఈ, నీటిపారుదల శాఖ, సంగారెడ్డి

## ప్లాస్టిక్ రహితం.. మల్లన్న ఆలయం

చేర్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం గత రెండేళ్లుగా ప్లాస్టిక్ రహితంగా కొనసాగుతోంది. స్థానిక వ్యాపార వర్గాలకు ఆదర్శంగా నిలిచేలా ఆలయ వర్గాలు నిషేధిత పాలిథీన్ సంచుల వాడకాన్ని పూర్తిగా నియంత్రించారు. ఇందుకోసం జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి ఆలయ వర్గాలతో కలిసి కృషి చేశారు. చివరకు 2023 నుంచి భూమిలో త్వరగా కలిసిపోయే కంపోస్టబుల్ సంచులను వినియోగిస్తున్నారు. ప్రముఖులు, కల్యాణ, అభిషేకం చేసిన భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని మాత్రం కాగితపు అట్టల్లో పంపిణీ చేస్తున్నారు. ఇక సాధారణంగా ప్రసాదాలను మాత్రమే భక్తులకు సంచుల్లో అందజేస్తారు. ఏటా ఆలయానికి సుమారు 30 లక్షల మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు.ప్రతి సంవత్సరం సుమారు 18లక్షల లడ్డూలు, 8లక్షల పులిహోర సంచులు విక్రయం అవుతున్నాయి. ఈ లెక్కన ప్రతి ఏటా 25లక్షలకు పూగా ప్రసాదాల కోసం సంచులు అవసరమవుతున్నాయి. ప్రసాదం తీసుకున్న ప్రతి భక్తుడికి సంచుల్లోనే వేసి ఇస్తున్నారు. ఆలయ పరిసరాల్లో వ్యాపారాలు చేసేవారు నిషేధిత ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే ముందుగా హెచ్చరించి, అనంతరం జరిమానా విధిస్తున్నారు. పంచాయతీ శాఖ అధికారులతో కలిసి ఆలయ ఆవరణలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ వ్యాపార వర్గాల్లోనూ పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ రహితానికి నిర్వాహకులు కృషి చేస్తున్నారు.

# నిధులు రావు.. అభివృద్ధి జరగదు

ధర్మపురి : పల్లె ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్స్) గుర్తింపునిస్తోంది. జిల్లాలో 17 ఆరోగ్య కేంద్రాలు ఎంపికై రెండేళ్లయి పథకం నిధులు విడుదల కాలేదు. దీంతో ఈ ఆసుపత్రుల అభివృద్ధిపై నిరాశే మిగులుతోంది.

జిల్లాలోని వివిధ ఆసుపత్రులను కేంద్ర వైద్య అధికారుల బృందం తనిఖీ చేసింది. అంశాలవారీగా వైద్య సేవలు, పరిశుభ్రత, పచ్చదనం, రికార్డుల నిర్వహణవంటి అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి 2022, 2023 సంవత్సరాల్లో జిల్లాలో 17 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేశారు. ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన పీహెచ్‌సీలకు మూడేళ్లపాటు ఏటా రూ.3



లక్షలు, సీహెచ్‌సీలకు రూ.2 లక్షలు అందుతాయి. ఈ నిధులు అందితే మరింత అభివృద్ధి చేసుకోవచ్చని స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది భావించారు. ఉత్తమంగా మార్కులు పొందేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఎంపికైనట్లు జాబితాలను పంపించినా నిధులు మాత్రం విడుదల కాలేదు.

**ఎంపికైనవి ఇలా..**

ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, పెగడపల్లి, కొడిమ్యాల పీహెచ్‌సీలు, ఖలాగడ్డ, ఎస్‌రామ్‌వెల్లు, మోతెవాడ యూపీహెచ్‌సీలు, ఆత్మకూర్, పైడిమడుగు, వేములకుర్తి, ధరూర్, రేచ్‌పల్లి, నూకపల్లి, కట్కాపూర్, దొంతాపూర్ పల్లె ఆరోగ్య కేంద్రా లు(హెచ్‌డబ్ల్యూపీఎస్) ఎంపికయ్యాయి. ఈ విషయమై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు మంజూరు చేసిందన్నారు. సంబంధిత వివరాలతో మరోమారు ప్రభుత్వానికి నివేదించామని, త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశముందన్నారు.

# నిధుల్లేక నీరసం

నల్గొండ : నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో జిల్లాలో గ్రామ పంచాయతీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. అసలే వర్షాకాలం.. వ్యాధులు ముసిరే పరిస్థితుల్లో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ-పచ్చదనం త్వరలో నిర్వహించే వినాయక నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, దసరా పండుగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారనుందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జాడలేని ఎస్‌ఎఫ్‌సీ నిధులు**

కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్‌ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులు సైతం కొన్ని నెలలుగా విడుదల కాలేదు. రాష్ట్రంలో సర్పంచుల పదవీ కాలం ముగిసి.. 18 నెలలైంది. 2024 ఫిబ్రవరిలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. వెంటనే ఎన్నికలు జరపాల్సి ఉన్నా.. ఏదో ఓ కారణంతో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పాలకవర్గాలు లేని కారణంగా పంచాయతీలకు కేంద్రం విడుదల చేయాల్సిన నిధులను ఆపేసింది. జిల్లాలోని 868 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద ప్రతి నెల దాదాపు రూ.5



కోట్లు రావాల్సి ఉండగా 15 నెలలకు సంబంధించి రూ.125 కోట్లు నిలిచిపోయాయి. ఎన్నికలు పూర్తయి.. పాలకవర్గాలు ఏర్పాటు చేస్తేనే నిధులు విడుదలయ్యే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు సైతం 13 నెలలుగా విడుదల కావడం లేదు. మొత్తం రూ.72 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించాల్సి ఉంది.

**గాడితప్పిన గ్రామ పాలన**

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతోంది. పారిశుద్ధ్యం, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు, ట్రాక్టర్లకు డీజిల్ కొరత ఇలా.. అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీల్లో ఏదైనా అత్యవసర పనులుంటే కార్యదర్శులపైనే ప్రత్యేకాధికారులు భారం మోపుతున్నారు. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు వచ్చే నిధులను గ్రామాల్లో సమస్యలు తీర్చడం, ఇతర ఖర్చుల కోసం వినియోగించేవారు. నిధులు ఆగిపోవడంతో ఇప్పుడు ఈ చెల్లింపులన్నీ నిలిచిపోయాయి. ఏమాత్రం ఆదాయ వనరుల్లేని చిన్న పంచాయతీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది.

# ముంపు వలయం.. ముప్పేట విలయం



హైదరాబాద్: నగరం ఓ మోస్తారు వానకే వణికిపోతోంది. గంటకు 5 సెంటీ మీటర్లకు మించి వర్షం పడితే చాలు రోడ్లపై వరద పారుతోంది. మురుగునీటి పైపులైన్లు పొంగిపొర్లుతున్నాయి. ముంపు సమస్యపై ఇటీవల జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా సర్వే చేపట్టగా గ్రేటర్ పరిధిలోని 436 ప్రాంతాల్లో రహదారులు మునుగుతున్నట్టు తేలింది. వర్షాకాలం మొదలైనప్పుడు జీహెచ్‌ఎంసీ 141 ప్రాంతాలను గుర్తించగా.. హైడ్రా అధికారులు రంగంలోకి దిగాక సంఖ్య అమాంతం పెరిగింది. సమస్యాత్మక ప్రాంతాలు పెద్ద సంఖ్యలో వెలుగులోకి వచ్చాయి. అందులో ఏళ్ల తరబడి నానుతున్న సమస్యలు అనేక ఉండటంతో జీహెచ్‌ఎంసీ పరిష్కరించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

**93 చోట్ల విపరీతమైన ట్రాఫిక్ సమస్య**

రాజ్‌భవన్ రోడ్డు, బేగంపేటలోని పలు బస్తీలు, ప్రకాశ్‌నగర్ ప్రధాన రహదారి, ప్యాట్నీనగర్ రోడ్డుతోపాటు మలక్‌పేట రైల్వే అండర్ బ్రిడ్జి, కొండాపూర్‌లోని కొత్తగూడ అండర్‌పాస్, ఎల్బీనగర్‌లోని చింతలకుంట అండర్‌పాస్, హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ సమీపంలోని అండర్‌పాస్, బయోడైవర్సిటీ కూడలి, మల్కంచెరువు రహదారి, టోలిచౌకి వైపు షేక్‌పేట్ పైవంతెన ప్రారంభమయ్యే చోటు, మైత్రివనం కూడలి, సత్యం థియేటర్ రోడ్డు, కృష్ణానగర్ రోడ్డు, కేసీపీ సర్కిల వంటి 93 చోట్ల అడుగు నుంచి మూడు అడుగుల లోతున నీరు నిలుస్తోందని విపత్తు స్పందన బృందాలు నివేదిక రూపొందించాయి.

**మ్యాపింగ్ ద్వారా సూచనలు..**

డీఆర్‌ఎఫ్ సూచనతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆయా ప్రాంతాలను జీపీఎస్ మ్యాపింగ్ చేయించి.. ఏయే ప్రాంతాల నుంచి వరద వస్తుందనే విషయంపై దృష్టిపెట్టారు. ఆ ప్రాంతాల్లో 880 మందితో కూడిన 309 స్టాటిక్ లేబర్ టీంలను ఏర్పాటు చేశామని చెబుతున్నారు. వాతావరణశాఖ డివిజన్ల వారీగా ఇచ్చే వర్ష సూచనలను గమనిస్తూ.. భారీ వర్షాలు కురిసే సమస్యాత్మక ప్రాంతాల్లో సహాయక చర్యలకు 51 డీఆర్‌ఎఫ్ బృందాలు, 150 వర్షాకాల అత్యవసర బృందాలను 24గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నామని హైడ్రా చెబుతోంది.

# కన్వీనర్ సీట్లలోనే కష్టంగా భర్తీ!



కరీంనగర్ : ఇంజినీరింగ్‌లో సీఎస్‌ఈ, ఈసీఈల తరవాత కొత్త కోర్సులకే కుర్రకారు జై కొట్టారు. మెకానికల్, సివిల్ కోర్సుల పట్ల ఆసక్తి తగ్గింది. ఇటీవల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగియగా అతి కష్టంగా ఈసారి కన్వీనర్ కోటా సీట్లు భర్తీ అయ్యాయి. పలు దఫాలుగా కొనసాగిన వెబ్ ఆప్షన్ ప్రక్రియలో విద్యార్థులు మెచ్చిన కోర్సులను ఎంపిక చేసుకున్నారు. మొదటి విడతలో నచ్చిన కళాశాల, కోర్సులో అవకాశం రాకపోవడంతో మలి విడతలో అవకాశాన్ని అందుకున్నారు. కొందరు అదే కళాశాలలో కోర్సులు మార్చుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రభుత్వ, 9 ప్రైవేటు కళాశాలలున్నాయి. మొత్తంగా 16 కోర్సులను అందిస్తుండగా అందులో సగం కోర్సుల్లో మాత్రం పూర్తిస్థాయిలో సీట్లు నిండాయి. పాత కోర్సుల పట్ల చాలామంది ఆసక్తి చూపించలేదు. దాదాపుగా 1.37 లక్షలకుపైగా ర్యాంకు వచ్చిన వారికి కూడా ఉమ్మడి జిల్లాలో సీటు వచ్చింది. దీంతో మొదట నామమాత్రపు కోర్సులో వచ్చిన సీటును కాస్తా మలి విడతలో మంచి కోర్సుకు పలువురు మార్చుకున్నారు.

**ఇదీ పరిస్థితి..**

బయో టెక్నాలజీ, పార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు.

హుస్నాబాద్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసారి 4 కోర్సుల్లో కేవలం 65 సీట్లు భర్తీ అయ్యాయి.

కరీంనగర్ సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఏ కోర్సుల్లోనూ ఒక్కరూ చేరలేదు.

సిరిసిల్లలోని టైక్స్‌టైల్స్ కోర్సులో మొదటి విడత అయిదుగురు చేరగా, ఇప్పుడు ఇద్దరే మిగిలారు.

**3,229 మంది చేరిక..**మొత్తంగా కన్వీనర్ కోటాలో 4,305 సీట్లు ఉండగా ఇందులో మొదటి దఫాలోనే 3,451 మంది సీట్లు దక్కించుకున్నారు. తరువాత విడతలో ఇంకొంత మందికి చోటు లభించింది. మార్పులు చేర్పుల తరువాత జిల్లాలో మొత్తంగా 3,229 మంది ఆయా కళాశాలల్లో చేరారు. మొదటి విడత కేటాయింపుతో పోలిస్తే 222 మంది తగ్గారు. హైదరాబాద్ సమీపంలోని కళాశాలల పట్ల వీరు మొగ్గు చూపారు. ఎప్పటిలాగే ఈసారి సీఎస్‌ఈ హవా కొనసాగింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) పట్ల విద్యార్థులు అంతగా ఆసక్తిని చూపించలేదు. మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్‌లదీ అదే పరిస్థితి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు పట్ల ఆసక్తి కనబడింది. కన్వీనర్ కోటానే పూర్తిగా భర్తీకాని నేపథ్యంలో యాజమాన్య కోటాలో భర్తీ అయ్యే సీట్ల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

# ఆధార్ నమోదుకు ఎదురుచూపులు



కరీంనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆధార్ కార్డుల నమోదు కోసం ఎదురుచూస్తున్నారు. ఆధార్ నమోదు, నవీకరణ కార్యక్రమాన్ని కొన్నేళ్లుగా ప్రభుత్వం ఉచితంగా బడుల్లోనే నిర్వహిస్తోంది. ఏటా ప్రభుత్వం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలను పాఠశాలల్లోనే ఏర్పాటు చేస్తుండగా ఈసారి ఏర్పాటు కాలేదు. దీంతో విద్యార్థుల వివరాలు యూడైస్, రికార్డుల్లోకి చేర్చడం లేదు. **కార్డుల జారీ, నవీకరణలో జాప్యంతో అవస్థలు...**

ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే బడులకు ప్రభుత్వం నిధుల కేటాయింపులు, ఉపాధ్యాయుల నియామకం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను సమకూరుస్తుంది. జాతీయ ఉపకార వేతనాలకు కూడా ఆధార్ తప్పనిసరి. కేంద్రం జారీ చేస్తున్న అపార్ నమోదుకు కూడా అవసరమే. జిల్లాలో గతేడాది 14 మందిని ఆధార్ నమోదుకు నియమించినా వారికి సమీపంలోని పాఠశాలల విద్యార్థులకే ఈ సేవలను అందించడంతో పూర్తి స్థాయిలో ఆధార్ నమోదు, నవీకరణ జరగలేదు.

**కార్డు లేని బాలలు 4,979**

జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 4979 మంది బాలలకు ఆధార్‌కార్డులు లేనట్లు గుర్తించారు. వారిలో ప్రాథమిక తరగతులు చదువుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. గతంలో ఎమ్మార్సీ కార్యాలయాల్లో ప్రతి మండలంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రభుత్వం వాటిని రద్దు చేసి పరికరాలను తిరిగి వెనక్కి తీసుకుంది. గతేడాది ప్రైవేటు వ్యక్తులకు ఈ పనిని అప్పగించారు. మండలానికి ఒకరు, అవసరమున్న చోట ఇద్దరిని నియమించారు. ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఆధార్ నమోదు, నవీకరణకు 11 మందికి జిల్లాలో రాష్ట్ర విద్యాశాఖ అనుమతులిచ్చింది. కానీ జిల్లా విద్యాశాఖకు ఆ వివరాలు రాకపోవడంతో నమోదు ప్రక్రియ చేపట్టడం లేదు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 7 వేలకుపైగా బాలలు కొత్తగా ప్రవేశాలు పొందినా.. దాదాపు అయిదు వేల మందికి ఆధార్‌కార్డులు లేకపోవడంతో యూడైస్‌లో వారి నమోదు కనిపించడం లేదు. బడుల్లోని విద్యార్థుల సంఖ్యకు యూడైస్‌లోని విద్యార్థుల సంఖ్యకు పొంతన కుదరడం లేదు. జిల్లాకు వేరే ప్రాంతాల నుంచి వలస వచ్చిన బాలలకే ఎక్కువగా ఆధార్‌కార్డులు ఉండటం లేదు. ప్రభుత్వం నియమించిన ఈ ప్రైవేటు వ్యక్తులు బయోమెట్రిక్ ద్వారా పనులను చేపడితే సమస్య తీరే అవకాశముందని ఉపాధ్యాయులు అంటున్నారు.

# రోడ్డంతా ఆక్రమణలే..!

వేములవాడ : ఈ చిత్రం వేములవాడ పట్టంలోని బద్ది పోచమ్మ వీధిలోనిది. ఈ వీధిలో నడవాలంటే పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాల వ్యాపారుల ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. కోళ్ల దుకాణాల తూకాల యంత్రాలు రోడ్డుపై పెట్టడం, వస్తుసామగ్రిని రోడ్డంతా వేలాడదీయడంతో కాలినడకన నడవడానికి సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది. తోపుడుబండ్లు, ఇతర వాహనాలు అటుగా వెళ్లడానికి ప్రతికూల పరిస్థితి ఉంటోంది. సోమ, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుండగా ఆ రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు భక్తులు చెబుతున్నారు. రోడ్డంతా కబ్జా చేసినా, ఇష్టారాజ్యంగా దుకాణాలు నిర్వహిస్తున్నా మున్సిపల్ అధికారులకు, పోలీసులకు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు ఆక్రమణలపై మున్సిపల్, పోలీసు అధికారులు దృష్టి సారించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.



# ఆ గంటే.. ఊపిరి పంట

మిర్యాలగూడ : ఉమ్మడి జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, విద్యుదాఘాతాలు, కుక్క, పాము కాట్లు వంటి ఘటనలతో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరిగినా సమీపంలో ఉండే వారు తక్షణమే స్పందించి తగిన చికిత్సకు చర్యలు చేపడితే ప్రాణాలు నిలిపే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కానీ అనేక మంది ప్రమాదాలు జరిగిన సమయంలో చూస్తూ.. నిలబడి అయ్యో పాపం అంటూ చాలా మంది కాలక్షేపం చేస్తున్నారు. సరైన అవగాహన ఉంటే అనేక ప్రాణాలు నిలుపవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గత నాలుగేళ్లలో సుమారు 7 వేలకు పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా..3 వేల మందికి పైగా మృత్యువాత పడ్డారు. మరో 5 వేల మందికి పైగా క్షతగాత్రులుగా మిగిలారు. ఇక గత నాలుగేళ్లలో కుక్క కాటు బాధితులు సుమారు లక్షన్నర మంది వరకు ఉన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌గా పిలిచే తొలి గంట లోపే ఆసుపత్రికి తరలిస్తే బాధితుడి ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు చెబుతున్నారు. రక్త గాయాలు అయితే రక్తం పోకుండా, ఎముకలు విరిగితే కదలకుండా తక్షణమే ఆసుపత్రికి తరలించాలి. ఇలా చేస్తే రోడ్డు ప్రమాద బాధితులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు. అంబులెన్స్ కోసం ప్రయత్నిస్తూనే ఇతర మార్గాలను అన్వేశించాలని వైద్యులు సూచిస్తున్నారు.

కుక్క కరిచిన చోట సబ్బుతో బాగా శుభ్రం చేయాలి. అనంతరం యాంటీసెప్టిక్ ద్రావణంతో శుభ్రం చేసి..కట్టు కట్టాలి. ఈ పనులు చేస్తూనే ఆసుపత్రికి తరలించి తగిన చికిత్స అందించాలి.

ఇటీవలి కాలంలో 30 ఏళ్ల లోపు వారు సైతం గుండె పోటు సమస్యలతో ప్రాణాలు విడుస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు సీపీఆర్‌పై



అవగాహన పెంచుకోవాలి. ఎవరైనా గుండె పోటుకు గురైతే తక్షణమే సీపీఆర్ చేస్తే అతడి ప్రాణాలు నిలపవచ్చు.

రైతులు పొలాల వద్దకు వెళ్లిన సమయంలో, రోడ్ల వెంట ప్రయాణించే సమయాల్లో పాము కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. పాము కరిచిన వెంటనే అది ఏ పామో నిర్ధారించుకోవాలి. పాము కరిచిన భాగాన్ని కదలకుండా ఉంచి..తక్షణమే ఆసుపత్రికి తరలించాలి.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తిని తగిన జాగ్రత్తలు తీసుకుంటూ కాపాడాలి. తొలుత బాధితుడిని తీగల నుంచి తొలగించాలి. దీనికి తీగలను, బాధితుడి నేరుగా తాకకుండా పొడిగా ఉండే కర్ర, రబ్బరు వస్తువులను ఉపయోగించాలి.

**ఆందోళన అనవసరం...:**ప్రమాదాల్లో గాయపడిన వారిని కాపాడేందుకు సమీపంలో ఉండే వారు తక్షణమే స్పందించాలి. దీనికి పోలీసుల వేధింపులు వంటి ఇబ్బందులపై ఆందోళన అవసరం లేదు. ప్రమాదం ఏదైనా బాధితుడిని ఎంత త్వరగా ఆసుపత్రికి తరలించామనే అంశంపైనే అతడి ప్రాణాలు నిలుస్తాయి. డాక్టర్ అల్లుబెల్లి జగన్‌రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుడు, మిర్యాలగూడ.

## ఆరేళ్లు.. రెండు జిల్లాలు.. మూడు మండలాలు

వెల్గటూరు : జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాలకు ఓ ప్రత్యేకత ఉంది. దారికి కుడివైపు ముంజంపల్లి, ఎడమ వైపు మారేడుపల్లి గ్రామాలు ఉన్నాయి. పైచిత్రంలోని ఈ రెండు బోర్డులకు పక్కపక్కనే ఉన్న పొరుగిళ్లు వేర్వేరు గ్రామాల పరిధిలోకి రావడం ఆసక్తికరం. ఒక్కో చోట ఇల్లు ఒక ఊరి పరిధిలో, వాకిలి(రోడ్డు) మరో ఊరి పరిధిలో ఉండే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. తొలుత మారేడుపల్లికి అనుబంధంగా ఉన్న ముంజంపల్లి 1986లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారింది. ముంజంపల్లిలో 1,167 మంది ఓటర్లుండగా 1,550 జనాభా, మారేడుపల్లిలో 1,139 మంది ఓటర్లు 1,450పైగా జనాభా ఉంది. 2016లో జిల్లాల



పునర్విభజనకు ముందు జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలంలో ఉన్న ఈ గ్రామాలు తర్వాత వీటిని కొత్తగా ఏర్పాటు చేసిన పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలంలో చేర్చారు. 2022లో కొత్త మండలాల ఏర్పాటుతో తిరిగి జగిత్యాల జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ఎండపల్లి మండలంలో చేర్చారు. దీంతో ఆ ప్రజలు ఆరేళ్లలో రెండు జిల్లాలు, మూడు మండలాల పరిపాలనలో కొనసాగారు.

# రసాయన వ్యర్థాల కలకలం

అడ్డగూడూరు : గుర్తుతెలియని రసాయన వ్యర్థాలను వాహనంలో తీసుకువచ్చి యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం కంచనపల్లి క్రాస్‌రోడ్ సమీప వలిగొండ-తొర్రూరు ప్రధాన జాయతీరహదారి పక్కనే పారబోశారు. వ్యర్థాల బస్తాల నుంచి వెలువడుతున్న దుర్గంధంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి క్రాస్‌రోడ్ సమీపంలో మూటలుగట్టి పడేసిన బస్తాల్లోంచి భరించలేని దుర్వాసన వస్తుండటంతో స్థానికులు భయపడి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక ఏఎస్ఐ ఈశ్వర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కాలుష్య నియంత్రణ బోర్డుకు విషయం తెలిపారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు ఏఈఎస్ పురుషోత్తంరెడ్డి అక్కడికి చేరుకొని బస్తాల్లోని వ్యర్థాలను పరిశీలించారు. సమీప జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆయిల్‌మిల్, పాటిమట్ల క్రాస్‌రోడ్ వద్ద సీసీకెమెరాలను పరిశీలించారు. మోత్కూరు మండలం దాచారం గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే, పాటిమట్ల క్రాస్‌రోడ్ సమీపంలో రసాయన వ్యర్థాలను పారబోసినట్లు గుర్తించారు. రసాయన వ్యర్థాల నుంచి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక ఆధారంగా అప్పుడే అవి ఏ కంపెనీవో తెలుస్తాయన్నారు. అనంతరం ఆయా కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కానిస్టేబుల్ ఎన్.శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

# టర్బయిన్ పనుల్లో కదలిక

నల్గొండ: నాగార్జునసాగర్‌లోని జలవిద్యుత్తు ప్రాజెక్టులో 8వ యూనిట్ టర్బైన్ ఏప్రిల్ నెల నుంచి పనిచేయడంలేదు. జెన్కోకు చెందిన ఈ ప్లాంట్‌లో దేశీయ పరిజ్ఞానంతో 'భెల్' సంస్థ ఎనిమిదో యూనిట్‌ను రూపొందించింది. 8వ టర్బయిన్ పనులు నెలాఖరు నాటికి పూర్తయ్యే అవకాశాలున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోసారి ట్రయల్ రన్ చేసిన అనంతరం ఆగస్టు మొదటి వారం నుంచి జలవిద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియకు ఉపయోగించనున్నారు.

**ఉపముఖ్యమంత్రి పరిశీలనతో పనులు వేగిరం**

రాష్ట్రంలో జల, పవన, సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలు సజావుగా పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. వాటి మరమ్మతులు, పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తామని ఇటీవల సాగర్ జలవిద్యుత్తు ప్రాజెక్టును సందర్శించిన సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. రెండేళ్ల క్రితం 15వేల మెగావాట్ల మేర, గతేడాది 17,162 మెగావాట్ల విద్యుత్తు వినియోగించారు. అంటే ఒక్క ఏడాదిలోనే అదనంగా 2వేల మెగావాట్ల అవసరం పెరిగింది. రాష్ట్రంలోని అన్ని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టులోని యూనిట్లను వినియోగంలోకి తీసుకురావాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో నాలుగునెలలపాటు నిలిచిన 8వ యూనిట్



యంత్రం స్థానంలో కొత్తది బిగించే పనులను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా 'ఓవరాయిలింగ్' ప్రక్రియ 60 శాతం పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తయ్యేందుకు మరో వారం రోజులు పట్టనుంది. జెన్కో అధికారులు సైతం త్వరితగతిన ఈ పనులను పూర్తి చేసి విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ ప్లాంట్ వద్ద భద్రత ప్రమాణాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అత్యవసర నెంబర్ బోర్డు వద్ద నల్గొండ ఎస్పీ, మిర్యాలగూడ పోలీసులకు సంబంధించిన పాత నెంబర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. కనీసం ఆ నెంబర్లు మారిపోయిన విషయం ఆ అధికారులకు తెలియకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**పురాతన ప్రాజెక్టులో తరచూ మొరాయిస్తూ..**

ఈ ప్లాంటు నిర్మించి 50 ఏళ్లు దాటగా ప్రధాన విద్యుత్తు కేంద్రంలో ఉన్న మొత్తం 8 యూనిట్లలో ఏడు జపాన్, మిగిలిన ఒకటి దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఈ ప్రాజెక్టు 810 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ 21 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది. పురాతన ప్రాజెక్టు కావడంతో ఏప్రిల్ నెల నుంచి తరచూ సాంకేతిక మొరాయింపులు చోటు చేసుకుంటున్నాయి. జపాన్ టెక్నాలజీతో నిర్మించిన యూనిట్లలోనూ అప్పుడప్పుడు యంత్రాలు పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు.

# టీకా... అందక..!

మిర్యాలగూడ: నిరుపేదల వైద్యం కోసం ప్రభుత్వం ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన మేర ఫలితాలు రాకపోగా, అభం శుభం ఎరుగని చిన్నారులకు బాల్యంలో అందించాల్సిన టీకాలు అందక వ్యాధుల బారిన పడుతున్నారు. పేద, ధనిక తేడా లేకుండా ఎక్కడ జన్మించిన శిశువులకైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో టీకాలు వేస్తున్నారు. ఏటా సాధారణ రోజులతో పాటు పల్స్ పోలియో రెండుసార్లు, ఇంద్ర ధనుస్సు పేరుతో ఏడాదికి రెండుసార్లు టీకాలు అందిస్తున్నారు. ఇంత చేస్తున్నా చిన్నారులకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలు పూర్తి స్థాయిలో



వేయించడం లేదని పలు సర్వేలు చెబుతున్నాయి.

**ఉచితంగా ఇచ్చే వ్యాక్సిన్లు**

క్షయవ్యాధి నివారణకు బీసీజీ, పోలియో వ్యాధి రాకుండా ఓపీవీ, ఐపీవీ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, కామెర్లు, మెదడువాపు, న్యూమోనియా వ్యాధులు రాకుండా పెంటా వాక్సిన్, తట్టు, రుబెల్లాకు ఎంఆర్ వ్యాక్సిన్, మెదడు వాపునకు జేఈ వ్యాక్సిన్, అంధత్వ నివారణకు విటమిన్ ఏ ద్రావణం, జ్వరం, శ్వాసలో ఇబ్బంది, నిరంతర దగ్గు, స్పృహ కోల్పోవటం వాటికి పీసీవీ వ్యాక్సిన్ అందిస్తున్నారు.

**అందకపోవడానికి కారణాలు**

గ్రామాల్లో మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆశ, ఏఎన్ఎంలు వివరాలు నమోదు చేసి అవసరమైన టీకాలు అందిస్తున్నారు. ప్రసవించిన తర్వాత శిశువులకు ప్రాథమిక టీకాలు వేయించిన తర్వాత తల్లిదండ్రులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో వారు నివాసం ఉండే ప్రాంతంలో టీకాలు వేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు టీకాల విషయంలో పర్యవేక్షించి ముందస్తు సమాచారం ఇస్తుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లిన తల్లిదండ్రులు వ్యాక్సిన్‌లు సకాలంలో వేయించడం లేదు. తల్లిదండ్రుల చరవాణి నెంబర్లకు ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేయించే విషయమై సమాచారం అందిస్తే కొంత మేర మార్పు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇచ్చే వ్యాక్సిన్‌లతోపాటు నివురుగప్పిన నిప్పులా వ్యాపిస్తున్న క్యాన్సర్‌కు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన అవసరం ఉంది. ప్రైవేటుగా వ్యాక్సిన్ వేయించాలంటే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది.

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి**–డా.కేసా రవి, జిల్లా ఉపవైద్యాధికారి వలస వెళ్లిన వారికి సైతం ఆశ, ఏఎన్ఎంలు ఫోన్ చేసి వ్యాక్సిన్ల విషయం సమాచారం ఇస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పదో ఏడాది వచ్చేంత వరకు అప్రమత్తంగా ఉండాలి.

# భద్రాచలం కొండ.. అభివృద్ధికి అండ



భద్రాచలం : రామాలయం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. నూతన నిర్మాణాలకు ప్రణాళిక తయారు చేయాలని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి భావిస్తున్నారు. భద్రాచలాన్ని యాదగిరి గుట్ట తరహాలో అభివృద్ధి చేయాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గతంలో నిర్వహించిన సమీక్షల్లో ప్రస్తావించారు. దీంతో దేవాదాయశాఖలో కదలిక వచ్చింది. ఇలాంటి నిర్మాణాలలో విశేష అనుభవమున్న సీనియర్ ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, స్థపతి వల్లినాయగంలను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరిద్దరితో పాటు ఇదే రంగంలో అనుభవం ఉన్న ఇంజినీర్ల సలహాలు, సూచనలు తీసుకునే అవకాశం ఉంది. రెండ్రోజుల్లో సర్వే పనులు మొదలు కానున్నాయి.

**సువిశాల ప్రాంగణం కోసం...**

కోవెలకు మూడు వైపులా ఉన్న 41 ఇళ్ల నిర్వాసితులకు పరిహారంతో పాటు కాలనీ ఏర్పాటుకు రూ.60.20 కోట్లు అవసరం ఉండగా ఇప్పటికే రూ.34.45 కోట్లు మంజూరయ్యాయి. ముప్పై మందికి పైగా నిర్వాసితులు తమ ఇళ్లను ఖాళీ చేయగా మిగతావారు వారంలో చేస్తారు. ఇలా స్వాధీనం చేసుకున్న 1.3 ఎకరాల్లో మళ్లీ ఆక్రమణలకు ఆస్కారం లేకుండా బోర్డులు, కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మిథిలా ప్రాంగణం 3 ఎకరాలు ఉంది. 2 ఎకరాల్లో ప్రధాన ఆలయ పరిసరాలున్నాయి. దీనికి ఆనుకుని మాడవీధి విస్తరణ కోసం 1.3 ఎకరాలు కలవనుంది. ఈ మొత్తం 6.3 ఎకరాల్లో బృహత్తర ప్రణాళిక అమలు చేయనున్నారు.

**ఆధ్యాత్మిక పర్యాటకం**

రామాలయ దర్శనానికి నిత్యం ఐదారు వేల మంది వస్తుండగా సెలవు రోజుల్లో ఇది పెరుగుతోంది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 23.74 లక్షల మంది వచ్చారు. అదే ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 13.69 లక్షల మంది దర్శించుకున్నారు.

ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 14.78 లక్షల మంది వచ్చారు. భక్తుల సంఖ్య రానున్న రోజుల్లో పెరిగే వీలుంది. ఇక్కడి ఆధ్యాత్మిక పర్యాటక అవసరాలను తీర్చేలా రూ.200 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తారని సమాచారం. అవసరమైతే ఇంకొంత స్థల సేకరణ ఉంటుంది.

మాడవీధుల్లో ఎత్తుపల్లాలు లేకుండా పనులు చేయాలని నిర్ణయించారు. ఇది సాకారమైతే భద్రగిరిపై ప్రధాన ఆలయం మరింత సుందరంగా కనిపించనుంది.

**నిపుణులను పిలిపిస్తున్నాం**

రవీంద్రనాథ్, రామాలయం ఈఈ

బృహత్తర ప్రణాళిక అమలుకు నిపుణులు త్వరలోనే ఇక్కడకు రానున్నారు. నూతన నిర్మాణాల గురించి స్పష్టత రావాల్సి ఉంది. భవిష్యత్తు అవసరాలను తీర్చేలా పనులు ఉంటాయి.

# సర్దుబాటు.. తడబాటు



ఖమ్మం : విద్యుత్తు సరఫరాలో ఉపకేంద్రాల్లో ఆపరేటర్ల పాత్ర కీలకం. నలుగురు పనిచేయాల్సిన చోట ఒకరిద్దరు శ్రమిస్తుండటంతో పని ఒత్తిడి పెరిగి ఆపరేటింగ్ లోపాలు తలెత్తుతున్నాయి. గుత్తేదారుల నిర్వహణలో సాగిన ఉపకేంద్రాల్లోని సిబ్బంది(కాంట్రాక్ట్ వర్కర్స్)ని నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం ఆర్టిజన్లుగా గుర్తించింది. తదుపరి కొందరు ఉద్యోగ విరమణ చేయడం, ఉపకేంద్రాల సంఖ్య పెరుగటం, కొత్త నియామకాలు లేకపోవట వంటి కారణాలతో ఆపరేటర్ల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. సర్కిల్ పరిధిలో 150మంది కొరత ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నియామకం లేకపోవడంతో ఇతర విభాగాల్లోంచి సర్దుబాటు చేస్తున్నారు.

**తీవ్రమైన పని ఒత్తిడి..**

ఉపకేంద్రాల్లో ఆపరేటర్ల కొరతతో విధుల్లో ఉన్న వారిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ఎల్‌సీలు తీసుకునే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. జిల్లాలోని ఉపకేంద్రాల్లో ఇద్దరు మాత్రమే ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల ఒక్కరే ఉండటం విశేషం.

**కనీసం ముగ్గురు అవసరం**

ఒక్కో ఆపరేటర్ 8 గంటల పనివేళలతో లెక్కిస్తే ఉపకేంద్రంలో ముగ్గురు అవసరం. గతంలో ముగ్గురు ఆపరేటర్లతోపాటు, వాచ్‌మెన్ పనిచేసేవారు. ఆర్టిజన్ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత వాచ్‌మెన్‌లను తొలగించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలో మొత్తం 125 విద్యుత్తు ఉపకేంద్రాలున్నాయి. కొత్తగా మరో 18 నిర్మించాలని నిర్ణయించారు.

ఉద్యోగ విరమణ చేసిన 56 మంది, సింగరేణి కాలరీస్‌లో పదవీ విరమణ చేసిన మరో 14 మంది ఉపకేంద్రాల్లో పనిచేస్తున్నారు. కొన్నిచోట్ల జేఎల్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు.

మామిళ్లగూడెం(బుర్హాన్‌పురం) ఉపకేంద్రంలో ఆపరేటర్ ఒకరే ఉన్నారు. ఈయనకు తోడు విశ్రాంత ఉద్యోగి, ఒక జూనియర్ లైన్ మెన్(జేఎల్ఎం) విధులు నిర్వహిస్తున్నారు.

ఖమ్మం రామాలయం ఉపకేంద్రంలో ఒక్క ఆర్టిజన్ కూడా లేరు. రెగ్యులర్ ఉద్యోగికి, ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు పనిచేస్తున్నారు. జేఎల్ఎంలు మీటరు రీడింగ్, కొత్త కనెక్షన్లు ఇవ్వడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్, నియంత్రికల నిర్వహణ చేయాలి. ఉప కేంద్రాల్లోనూ పనిచేయాల్సి రావడంతో ఒత్తిడి పెరుగుతోంది.

'ఉపకేంద్రాల్లో ఆపరేటర్ల కొరత ఉన్నమాట వాస్తవమే. సంస్థ పరిధిలో కొత్త నియామకాలు లేవు. సీఎండీ ఆధ్వర్యంలో నియామకాలకు కసరత్తు జరుగుతోంది.'

శ్రీనివాసాచారి, ఎస్ఈ, ఖమ్మం

ఆర్టిజన్ కార్మికులు: 285

ఖమ్మం డివిజన్: 82.

ఖమ్మం గ్రామీణం: 76.

సత్తుపల్లి: 71.

వైరా: 25 మంది. (ఎంఆర్‌టీలో ఆరుగురు, సర్కిల్ కార్యాలయంలో 25 మంది పనిచేస్తున్నారు)

# ఖాళీలు చెప్పి.. కొలువులు చూపి

సూర్యాపేట : ప్రభుత్వ పథకాలు, నూతన పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య, ఉపాధి చేపట్టాలనే వారి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిరుద్యోగిత రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి తీసుకొచ్చిన 'రైసింగ్ ఆక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్' (ఆర్ఏఎంపీ)లో భాగంగా డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్) యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌పై పరిశ్రమల శాఖ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ యాప్ ఆవశ్యకత, డౌన్‌లోడ్ చేసుకునే విధానం, దీంతో ప్రయోజనం తదితరాలను పాఠశాలల్లో, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు వివరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 486 గ్రామ పంచాయతీల్లో త్వరలో అవగాహన చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించనున్నారు.

**నిరుద్యోగ యువతకు డీట్ యాప్**

డీట్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీంతో ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది. అందులో ఉద్యోగార్థిగా చేరి ఇంటి పేరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, పుట్టిన తేదీ, లింగం, విభిన్న వికలాంగులు, సామాజిక స్థితి, చిరునామా వంటి ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేయాలి. తెలిసిన భాషలు, విద్యార్హత, నైపుణ్యాలు, విద్య, అనుభవం తదితర వివరాలను పూరించాలి. తరువాత మెనూకు వెళ్లి కొలువులను అన్వేషించాలి. ఉద్యోగాన్ని ఆమోదిస్తే ఉద్యోగ సంస్థతో సంభాషించాలి. మౌఖిక పరీక్షకు పిలిస్తే వెళ్లే తేదీ తెలుస్తుంది. కొలువుకు ఎంపికైతే నియామక పత్రాన్ని పొందుతారు.

ప్రయోజనాలు: డీట్ యాప్‌తో పరిశ్రమల్లో ఖాళీల వివరాలు, నిరుద్యోగుల వివరాలు తెలుసుకోవచ్చు. ఉపాధిలో రాణించాలనుకునే యువత నైపుణ్యం పెంచుకునేందుకు శిక్షణ సంస్థల సమాచారం అందిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి

–సీతారామ్, పరిశ్రమలశాఖ మేనేజర్, సూర్యాపేట

డీట్ యాప్ గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన చేపట్టనున్నాం. త్వరలో పోస్టర్లను ఆవిష్కరించి పల్లెల్లో ప్రదర్శిస్తాం. గ్రామాల్లోని నిరుద్యోగులు ఈ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుంటే ఉద్యోగవకాశాలు పొందే వీలుంటుంది. దీన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి.

# ఆపదలో ఆదుకునే టోల్‌ఫ్రీ నెంబర్లు

భువనగిరి : నిత్యం ఎదురవుతున్న సమస్యలకు టోల్‌ఫ్రీ ఫోన్ పరిష్కారం చూపుతుంది. ఇటీవల పెరిగిపోతున్న ఆన్‌లైన్, వస్తు కొనుగోళ్లలో కొనసాగుతున్న మోసాలతో పాటు పలు సామాజిక అంశాలు, సమస్యలకు టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లను ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. మోసానికి, సమస్య పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలన్న విషయమై టోల్‌ఫ్రీ ఫోన్ నంబర్లు దారి చూపుతున్నాయి. సామాజిక భద్రత అంశాలపై భరోసా కల్పిస్తున్నాయి. ఏ నెంబర్ నుంచి ఎలాంటి సాయం పొందవచ్చో మీకోసం...అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు సహాయం పొందవచ్చు. ఫిర్యాదు అంశం మేరకు పోలీసులు సమస్య పరిష్కరిస్తారు. సైబర్ నేరాల బారిన పడినప్పుడు ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 1930 ఫోన్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఎవరైనా కాజేసినా వెంటనే ఫిర్యాదు చేసిన పక్షంలో డబ్బు తిరిగి పొందే అవకాశం ఉంది. ఫిర్యాదులో ఆలస్యమైన పక్షంలో నష్టపోవాల్సిన పరిస్థితి ఉంటుంది.

బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికుల, బాల్య వివాహాల నియంత్రణకు 18001801551 నెంబర్‌ను వినియోగించుకోవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు బాలలకు విముక్తి కల్పిస్తారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి విద్యుత్తు సంస్థ 1912 నెంబరును అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకునే అవకాశం ఉంది. మహిళలు గృహహింస ఎదుర్కొంటే 181కు ఫోన్ చేయవచ్చు. మహిళా సహాయక కేంద్రం సిబ్బంది స్పందించి సహాయం అందిస్తారు. పనిచేసే చోట వేధింపులు, లైంగిక, వరకట్న వేధింపులతో పాటు ఆడ శిశువుల విక్రయం, మానవ అక్రమ రవాణా సంబంధిత



అంశాలపై నేరుగా ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చు.

**స్టేషన్ బెయిల్ ఎలా ఇస్తారంటే**

వివిధ నేరాల్లో నిందితులపై పోలీసులు భారతీయన్యాయ సంహిత(బీఎన్ఎస్) చట్ట ప్రకారం వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తుంటారు. తీవ్రమైన నేరాలతో పాటు ఏడేళ్లలోపు శిక్షలు విధించే కేసుల్లో నిందితులు విచారణకు సహకరించే వారికి అన్ని కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇచ్చే అధికారం పోలీసులకు ఉంది. పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టంలోని సెక్షన్ 35(3) ప్రకారం నోటీసు ఇచ్చి నేర విచారణతోపాటు చట్టంలో పేర్కొన్న నిబంధనలు పాటిస్తారని పోలీసులు భావిస్తే స్టేషన్ అధికారి బెయిల్ ఇవ్వవచ్చు. కేసులో ఉన్న నిందితులు వ్యక్తిగత వివరాలు, గుర్తింపు ధ్రువపత్రాలు, జామీను బాండ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. నిందితులు సెక్షన్ 35(4) నోటీసు నిబంధనలు, షరతులు పాటించాలి.

సెక్షన్ 35(5) ప్రకారం నిబంధనలు పాటిస్తున్నప్పటికి పోలీసులు అరెస్టు చేయాలని భావిస్తే ఆ కారణాన్ని రికార్డు చేయాలి. నిబంధనలు పాటించని నిందితులను న్యాయస్థానం ఆదేశాలకు లోబడి సెక్షన్ 35(6) ప్రకారం అరెస్ట్ చేయవచ్చు. ఏడేళ్లలోపు శిక్షలు విధించే కేసుల్లో ఉన్న నిందితులు పోలీసుల విచారణకు సహకరించరని అనుకుంటే సెక్షన్ 35(1)బీ నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేయవచ్చు.

ఏడు సంవత్సరాలు కంటే ఎక్కువ శిక్షలు ఉన్న కేసుల్లో సెక్షన్ 35(1)సీ అరెస్టుకు కారణం చూపాల్సిన అవసరం లేదు. నేరుగా అరెస్టు చేయవచ్చు. అరెస్టులపై పోలీసులకు విచక్షణాధికారం ఉన్నప్పటికి అర్నేష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ 2014 కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును వెల్లడించింది. ఏడేళ్లలోపు శిక్షలు పడే కేసుల్లో నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వాలని తన తీర్పులో పేర్కొంది. అరెస్ట్ సమయంలో పోలీసుల విచక్షణాధికారాల గురించి ఈ తీర్పు చెబుతుంది.

# బియ్యం.. బలవర్ధకం

మిర్యాలగూడ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుపేదలకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా మూడేళ్లుగా ఫోర్టిఫైడ్ బియ్యం (బలవర్ధక బియ్యం) సరఫరా చేస్తుండగా వీటిలో ఉన్న పోషకాల విషయంలో ఇటీవల చర్చ మొదలైంది. గ్రామీణ ప్రాంత పేదలకు సరైన పోషకాలు అందకపోవటంతో తరచూ రక్తహీనత, ఎముకల సమస్యలు, కంటి చూపు, శారీరక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం పౌర సరఫరాల ద్వారా పేదలకు అందించే బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ 12




వంటి సూక్ష్మ పోషకాలను కలిపి అందిస్తున్నారు.

**రేషన్ దుకాణాలకు ఫోర్టిఫైడ్ బియ్యం..**

ఐకేపీ కేంద్రాల ద్వారా పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్‌కు ఇస్తున్నారు. మర పట్టిన అనంతరం బియ్యంను రైస్ మిల్లుల వారు భారత ఆహార సంస్థ వారికి అప్పగించాల్సి ఉంది. మిల్లుల్లో ప్రత్యేకంగా ఫోర్టిఫైడ్ మిక్సింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో సూక్ష్మపోషకాలు కలుపుతున్నారు. పౌరసరఫరాలశాఖ వారే ఆయా మిల్లులకు ఇచ్చిన కస్టమ్ మిల్లింగ్ ధాన్యానికి అనుగుణంగా సూక్ష్మపోషకాల బస్తాలను అందిస్తున్నారు. మిల్లుల్లో బస్తాలను ప్యాకింగ్ చేసే సమయంలో బస్తాకు ఒక కిలో సూక్ష్మపోషకాలను కలిపి ప్యాకింగ్ చేసి ఎఫ్‌సీఐకి పంపుతున్నారు. నాణ్యత నియంత్రణ అధికారులు ప్రత్యేకంగా బియ్యం నాణ్యతతో పాటు సూక్ష్మపోషకాల శాతం గుర్తించిన తరువాతే ఎఫ్‌సీఐ తీసుకుంటుంది. ఈ బియ్యం రేషన్ దుకాణాల ద్వారా నిరుపేదలకు అందిస్తున్నారు. బీ మొదట్లో కొందరు బియ్యం రంగుమారి వస్తున్నట్లు గా అపోహలు చెందినప్పటికీ అధికారులు అవగాహన కల్పించడంతో ప్రస్తుతం వాటినే వినియోగిస్తున్నారు.

**పిల్లలకు ఎంతో ఆరోగ్యం–డాక్టర్ జి.అంజయ్య, చిన్నపిల్లల వైద్య నిపుణులు**

సాధారణంగా తినే పాలిష్ బియ్యంలో బలవర్ధకమైన పోషకాలుండవు. అందుకే ప్రభుత్వం ఇచ్చే ఫోర్టిఫైడ్ బియ్యంను గంజి వార్చకుండా వండి తింటే చిన్నపిల్లలకు, పెద్దలకు ఎంతో మంచిది. వీలైతే కుక్కర్‌లో వండితే అన్ని విధాలుగా మేలు. వీటిపై ఎలాంటి అపోహలకు లోనుకావొద్దు.

# నిధుల అరగదీత.. నాణ్యత కరగదీత

కర్నూలు : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు వెక్కిరిస్తున్నాయి. పనులు పూర్తైన కొద్ది నెలల్లోనే లోపాలు వెలుగుచూస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు.

కర్నూలు నగరంలో 52 వార్డులు ఉండగా 6.5 లక్షలకుపైగా జనాభా ఉంది. మౌలిక సదుపాయాల కల్పన కోసం నగరపాలక నిధులతో పలు ప్రాంతాల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మించారు. దీనికిగాను రూ.కోట్లు వెచ్చించారు. పలువురు గుత్తేదారులు టెండర్లలో పాల్గొని లెస్‌కు వేసి పనులు దక్కించుకున్నారు. కొందరు సిబ్బంది కమీషన్లకు అలవాటు పడి నాణ్యతను పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. గత మూడేళ్ల కాలంలో నగరంలోని పలు కాలనీల్లో రూ.30 కోట్లకుపైగా విలువైన పనులు చేశారు. చాలా ప్రాంతాల్లో పరిశీలిస్తే రహదారులు అధ్వానంగా మారాయి. కాలువ పనుల్లోనూ నాణ్యత కొరవడింది. ఈ పనులపై విజిలెన్స్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని



పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల విశ్వేశ్వరయ్య కూడలి నుంచి రైతుబజారు వెళ్లే మార్గంలో సీసీ రహదారి ఏర్పాటు చేశారు. దీనికిగాను రూ.50 లక్షలు వెచ్చించారు. విద్యుత్తు స్తంభాలు, ఇతరత్రా కట్టడాలు అడ్డంగా ఉన్నప్పటికీ తొలగించకుండానే పనులు చేసేశారు. ప్రస్తుతం ఆ మార్గంలో పలుచోట్ల నెర్రెలుండటం గమనార్హం.

**సీసీ దారిపై కంకర తేలి..**


కల్లూరు 31వ వార్డులోని రాఘవేంద్ర నగర్‌లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టారు. గతేడాది ఆగస్టు 13న శంకుస్థాపన చేశారు. కొన్ని నెలల తర్వాత పనులు ప్రారంభించారు. దీనికిగాను సుమారు రూ.70 లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం పరిశీలిస్తే సీసీ రహదారిపై కంకర తేలి అక్కడక్కడా గుంతలు పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో నెర్రెలిచ్చాయి.

# వాగులో వాలిన అక్రమార్కులు

డోన్ : డోన్ పట్టణంలో ప్రాధాన్యమున్న పెద్ద వంక చిన్న కాల్వగా మారిపోతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఏటా వాగు ఆక్రమణకు గురవుతోంది. పట్టణ ప్రాంతం మీదుగా జగదుర్తి, ఉడుములపాడు చెరువులకు నీరు చేర్చే వాగు కబ్జాలకు గురై పట్టణానికి ముప్పువాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. వాగుకు ఆనుకుని మట్టితో పూడ్చివేసి మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. అప్పట్లో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించినా ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. చిన్న నీటి పారుదల, రెవెన్యూ అధికారులు మిన్నకుండి పోవటంతో వాగు విస్తీర్ణం తగ్గి నిర్మాణాలు పెరిగిపోతున్నాయి.

**సెంటు స్థలం రూ.10 లక్షలు**

డోన్ మండలంలోని కొచ్చెర్వు నుంచి పెద్దవాగు ద్వారానే అబ్బిరెడ్డిపల్లె, ఉడుములపాడు చెరువుకు వర్షం నీరు చేరుతుంది. డోన్ సమీపంలో ఈ వాగు 3 కి.మీ.లకు పైగా వెళ్తుంది. డోన్ పట్టణం వేగంగా విస్తరించటంతో వాగుకు అవతలివైపు నిర్మాణాలు ఊపందుకున్నాయి. వాగుపక్కన ఉన్న పొలాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో వాగుకు ఆనుకుని ఉన్న స్థలాలను కొందరు కబ్జాచేశారు. గతంలో 20- 40 మీటర్ల వెడల్పుతో ఉన్న వాగు విస్తీర్ణం ప్రస్తుతం 10- 20 మీటర్లకు తగ్గిపోయింది. వాగుకు సంబంధించి 14 ఎకరాల వరకు పోరంబోకు



భూమి ఉంది. సర్వే నంబరు 292లో 6.54 ఎకరాల వరకు భూమి ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 291, 270, 322, 289, 169తో పాటు కొన్ని సర్వేనంబర్ల పరిధిలోకి వాగువస్తుంది. ఇక్కడ సెంటు స్థలం దాదాపు రూ.10లక్షల వరకు పలుకుతోంది.

**మట్టివేసి..మాయ చేసి**

పెద్దవాగుకు సమీపంలో కేఈ కృష్ణమూర్తినగర్ ఎదురుగా ఉన్న వెంచర్ వద్ద వాగులోకి మట్టిని పెద్దఎత్తున వేశారు. ఉడుములపాడుకు వెళ్లే వాగు పెద్దఎత్తున ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉడుములపాడుకు వెళ్లే కాల్వ పక్కన వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని, కాల్వ చిన్నదైతే తమ చెరువుకు నీరు ఎలా వస్తుందని ఉడుములపాడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీఐ సమీపంలో ఓ భవనం వాగులోకి నిర్మించినా అడిగేవారే కరవయ్యారు. కొన్నిచోట్ల బఫర్‌జోన్ నిబంధనలు పాటించకుండానే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. "వాగు ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదని, ఒక వేళ జరిగితే సర్వే చేయించి చర్యలు తీసుకుంటామని" డోన్ ఆర్‌డీఓ నరసింహులు తెలిపారు.

# వసతి గృహాల్లో ప్రవేశాల సందడి

డోన్ : పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు బాసటగా నిలుస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన హాస్టళ్లు.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటిని మరపించే సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచే వసతి గృహాల్లో ప్రవేశాల సందడి నెలకొంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థులను వసతి గృహాల్లో చేర్చుకునేందుకు వార్డెన్లు దరఖాస్తులను ఆహ్వానించారు. ఇప్పటికే ఎస్సీ హాస్టళ్లలో సీట్లు భర్తీకాగా.. బీసీ వసతి గృహాల్లో కొన్ని సీట్లు భర్తీ కావల్సిఉంది.నంద్యాల జిల్లాలో 46 ప్రీమెట్రిక్, 25 పోస్టు మెట్రిక్ బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లు ఉన్నాయి. ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతి గృహాల్లో 3,800 సీట్లకు గాను 4,592 మందికి ప్రవేశాలు పొందారు. అదే ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ బీసీ వసతిగృహాల్లో 4,700 సీట్లకు గాను 3,890 మంది చేరారు. ఇంకా 810 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల చివరి వరకు మరింత మంది చేరే అవకాశం ఉంది.

# సరుగుడు.. నష్టాలకు విరుగుడు



అనకాపల్లి :సరుగుడు, సుబాబుల్ ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొత్తగా ప్లైవుడ్ తయారుచేసే పరిశ్రమలు రావడంతో పాటు ఉన్న పరిశ్రమలు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాయి. దీంతో కర్రకు మంచి డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో 1.6 లక్షల ఎకరాల్లో సరుగుడు, 70 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగు చేసేవారు. సుబాబుల్, సరుగుడు దీర్ఘకాలిక పంటలు. నాటిన తర్వాత నాలుగు నుంచి అయిదేళ్లకు కోతకు వస్తుంది. గత ప్రభుత్వ హయాంలో సరైన ధరలు లభించక చాలామంది తోటలు వేయడం మానేశారు. దీంతో ఇప్పుడు సరుగుడు లక్ష ఎకరాలకు లోపే ఉంది. సుబాబుల్ ఒకసారి నాటితే దాదాపు 25 నుంచి 30 ఏళ్లు పంట వస్తుంది. అయినా చాలా ప్రాంతాల్లో దీన్ని తొలగించి జీడిమామిడి తోటలు వేసుకున్నారు. ప్రస్తుతం 50 వేల ఎకరాల లోపే తోటలున్నాయి. నీటి వసతిలేని మెట్ట ప్రాంతాలైన బుచ్చెయ్యపేట, పరవాడ, అచ్యుతాపురం, మాకవరపాలెంతోపాటు నిత్యం సాగునీరు లభించే మునగపాక, నాగులాపల్లి, తిమ్మరాజుపేట, జగన్నాథపురం, చూచుకొండ వంటి ప్రాంతాల్లోనూ సాగు చేస్తున్నారు. పేపరు తయారీకి సరుగుడు, సుబాబుల్ ముక్కలు వినియోగిస్తారు. ప్లైవుడ్ తయారీకి సుబాబుల్ ఎక్కువగా వాడతారు. ఇప్పుడు సరుగుడు ముక్కలు కొనుగోలు చేస్తున్నారు. బాదులను నిర్మాణ రంగంలో ఎక్కువగా వినియోగిస్తారు. జిల్లాలో అనకాపల్లి, రావికమతం, కన్నూరు పాలెం, గోవాడ, వడ్డాది, కొత్తపేట, తట్టబంద ప్రాంతాల నుంచి సరకు ఎగుమతి అవుతుంది.

**కర్రకు కొరత**

పూర్వం మెట్ట ప్రాంతాల్లోనే వీటిని సాగు చేసేవారు. ఆహార పంటలు గిట్టుబాటు కానందున పుష్కలంగా సాగునీరున్న ప్రాంతాల్లో సరుగుడు, సుబాబుల్ తోటలను రైతులు పెంచడం ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి ధరలు పతనమయ్యాయి. ప్రభుత్వం వారికి గిట్టుబాటు ధర కల్పించలేదు. దీంతో చాలామంది తోటలు తీసేశారు. కొత్త తోటల జోలికి పోలేదు. ఫలితంగా ప్రస్తుతం జిల్లాలో కర్ర కొరత ఏర్పడింది. దీంతో కంపెనీలు ధరలు పెంచాయి.

**టన్ను ధర రూ. 9,500**

గతంలో సుబాబుల్ టన్ను ధర రూ. 3,800 ఉంటే... ప్రస్తుతం రూ. 6,500 పలుకుతుంది. సరుగుడు టన్ను రూ. 4,500 ఉంటే ఇప్పుడు ఏకంగా రూ. 9,500 కొనుగోలు చేస్తున్నారు. ముక్కలు టన్ను గత ఏడాది రూ. 3,500 ఉంటే ఇప్పుడు రూ. 7,000 పలుకుతుంది. అన్ని ఖర్చులు పోను ఎకరాభూమిలో సరగుడు విక్రయిస్తే నికరంగా రూ.లక్ష ఆదాయం వస్తున్నట్లు రైతులు తెలిపారు. సబ్బవరం, ఆనందపురం, పరవాడ ప్రాంతాల్లో దాదాపు అయిదు వరకు ప్లైవుడ్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. అచ్యుతాపురం, రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండలిలో ఒక పరిశ్రమ ఉండగా మరొకటి కొత్తగా వస్తోంది. అచ్యుతాపురంలోని పరిశ్రమకు రోజుకు వెయ్యి టన్నుల సరకు అవసరమని వ్యాపారులు తెలిపారు.

# ఆస్తులు తా'కొట్టే'శారు'




కర్నూలు : ఇంటి రుణాల పేరుతో మహీంద్రా హోం ఫైనాన్స్ సంస్థ సంబంధం లేని వ్యక్తుల భూములను తాకట్టు పెట్టింది. కల్లూరు మండలం బొల్లవరానికి చెందిన సుమారు 33 మంది నగరంలోని బళ్లారి చౌరస్తాలో ఉన్న మహీంద్రా హోం ఫైనాన్స్ సంస్థలో వివిధ సంవత్సరాల్లో ఇంటి రుణాలు తీసుకున్నారు. సాధారణంగా ఎవరైనా రుణం తీసుకుంటే వారి ఇల్లు, ఆస్తి తాకట్టులో ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల్లో నమోదు చేయిస్తారు. రుణం మొత్తం చెల్లించిన తర్వాత రుణం తీసుకున్నవారికి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వడంతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆయా ఎన్‌వోసీలను సమర్పించి తాకట్టు నుంచి తొలగించినట్లు రికార్డులు మారుస్తారు. బొల్లవరం రైతులకు సంబంధించిన విషయంలో మాత్రం సదరు సంస్థ ప్రతినిధులు ఆ ప్రక్రియను తుంగలో తొక్కారు. రుణం తీసుకున్నవారి నుంచి చట్టపరంగా పత్రాలు తీసుకున్నప్పటికీ వారి భూమి పత్రాలుకాక ఇతరుల భూముల పత్రాలు తాకట్టులో ఉన్నట్లు చూపించారు. గ్రామంలోని సర్వే నంబర్లు 100, 123 పరిధిలోని భూమిలో నివసిస్తున్నవారు రుణాలు తీసుకోగా.. సర్వే నంబరు 150లో భూములు తాకట్టులో ఉంచినట్లు చూపారు.

**అక్రమాలు బయటపడినా**

సర్వే నంబరు 150 పరిధిలో 16 ఎకరాల విస్తీర్ణంలో పదకొండు మంది రైతులకు సంబంధించిన భూములను వారికి తెలియకుండానే మహీంద్రా హోం ఫైనాన్స్ సంస్థ తాకట్టులో ఉంచింది. వాస్తవానికి రుణం ఇచ్చే ముందు బ్యాంకు ప్రతినిధులు రుణాలు తీసుకునేవారి ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ఆ పత్రాలను న్యాయవాదికి పంపి విచారణ చేయిస్తారు. వాస్తవానికి రుణాలు తీసుకున్నవారు తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఇచ్చారు. అయినప్పటికీ వాటితో సంబంధం లేకుండా ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు ఇతరుల సర్వే నంబర్లను రికార్డుల్లో నమోదు చేసి వారికి రుణాలిచ్చారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు అక్రమాలకు పాల్పడినట్లు 2018లోనే వెలుగుచూసింది. తప్పిదాన్ని సవరిస్తామంటూ పలుమార్లు తిప్పించుకున్నా ఇప్పటికీ పట్టించుకోలేదు. ఓర్వకల్లు, వెల్దుర్తి, డోన్ తదితర ప్రాంతాల్లోనూ కొన్ని ఫైనాన్స్ సంస్థలు రుణాలిస్తామని చెప్పి వారి ఆస్తులకు బదులు ఇతరుల భూములను తాకట్టులో పెట్టుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. రుణం తీసుకున్నవారికి ఆస్తులు లేకపోవడంతో ఇతరుల ఆస్తులను తాకట్టులో ఉంచినట్లు సమాచారం.

**ఆస్తుల బదిలీకి వెళ్తే విషయం తెలిసింది**వీరన్న, బొల్లవరం గ్రామం గ్రామంలోని సర్వే నంబరు 150లో నాకు 2.04 ఎకరాలు ఉంది. దానిని నా ఇద్దరు కుమార్తెలకు రాసిచ్చేందుకుగాను ఐదేళ్ల కిందట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే అది తాకట్టులో ఉందని తెలిసి షాక్‌కు గురయ్యా. నాకు తెలియకుండానే సదరు సంస్థ నా భూమిని ఇతరులు తీసుకున్న రుణానికి తాకట్టులో ఉంచినట్లు తేలింది. కొన్ని నెలలపాటు వారి చుట్టూ తిరిగిన తర్వాత ఆ భూమి నాపేరుతో మార్చింది. దీంతో పిల్లలిద్దరికీ ఆస్తుల పంపకాలు చేయగలిగా.

# తాగు'నిధి' కోత



నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంచినీటి పథకాల(సీపీడబ్ల్యూ) నిర్వహణ అధ్వానంగా ఉంది. అవసరమైన నిధులు కేటాయించకపోవడం.. పర్యవేక్షణ కరవవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జడ్పీకి 14వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించలేదు. 15వ ఆర్థిక సంఘం అమల్లోకి వచ్చాక 2020–21 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణకు రూ.140.73 కోట్లు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు రూ.53.97 కోట్లు అవసరమని ప్రతిపాదించగా రూ.28.58 కోట్లు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికం ప్రారంభమైనప్పటికీ నిధులు మంజూరవలేదు. దీంతో నీటిని శుద్ధి చేయకనే సరఫరా చేస్తున్నారు.

**పెరుగుతున్న బకాయిలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 70 సీపీడబ్ల్యూ పథకాలున్నాయి. రెండేళ్లుగా పథకాలకు సంబంధించి విద్యుత్తు బిల్లులకు చెల్లింపులు లేవు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.52.12 కోట్లు కావాలని ప్రతిపాదించారు. ఇందులో పథకాల నిర్వహణకు రూ.28.16 కోట్లు, విద్యుత్తు బిల్లులకు రూ.23.96 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు ఒక్క పైసా నిధులు రాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత రెండేళ్లుగా విద్యుత్తు బకాయిలే రూ.18 కోట్ల వరకు ఉండటం గమనార్హం. జిల్లాలో 351 గ్రామాలకు శుద్ధ జలం అందడం లేదు.

**అవసరం రూ.55 కోట్లు**

కర్నూలు జిల్లాలో 33, నంద్యాల జిల్లాలో 27 సమగ్ర రక్షిత తాగునీటి పథకాలున్నాయి. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షిస్తున్నప్పటికీ నిర్వహణ, నిధులను విడుదల చేసేది జడ్పీనే. ఈ పథకాల నిర్వహణ కోసం సగటున ఏటా రూ.55 కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ జడ్పీ నుంచి వస్తున్నది రూ.32 కోట్లు మాత్రమే.

2024–25 ఆర్థిక సంవత్సరంతో 15వ ఆర్థిక సంఘం ముగిసింది. 16వ ఆర్థిక సంఘం అమల్లోకి వచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో పంచాయతీలకు 70 శాతం, మండల, జడ్పీకి మిగిలిన నిధులు కేటాయించారు.

# చేరువలో ఉన్నా.. సేవలు దూరం!

పాలకొల్లు : జిల్లాలో అయిదు పట్టణాల్లో గత ప్రభుత్వ హయాంలో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయగా నిర్వహణను మాత్రం గాలికొదిలేసింది. వివిధ విభాగాలకు సంబంధించి సిబ్బందిని నియమించినా వారు పనిచేయడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం పట్టణాల్లోని సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయక సేవలు నామమాత్రంగా మారాయి.

**90 శాతం మూలకే..**

ప్రతి వార్డు సచివాలయానికి రెండు చొప్పున కంప్యూటర్లు, ఒక ప్రింటర్ అందజేశారు. అనంతరం వాటి నిర్వహణ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో జిల్లాలోని 90 శాతం కంప్యూటర్లు మూలకు చేరాయి. కొన్నిచోట్ల మాత్రం మరమ్మతులకు సిబ్బంది సొంత సొమ్ము వెచ్చించడంతో పనిచేస్తున్నాయి. నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో పరిశీలిస్తే కొన్ని చోట్ల కంప్యూటర్లు బల్లపై అలంకార ప్రాయంగా కనిపిస్తున్నాయి. ఇంకొన్ని వార్డుల్లో పనిచేయని వాటిని బీరువాల్లో, ఫర్నిచర్ గదుల్లో



భద్రపరిచారు.

**తప్పని అదనపు వ్యయం**

వివిధ ధ్రువపత్రాల నిమిత్తం వచ్చే విద్యార్థులు, ప్రజలు అక్కడ సేవల నిమిత్తం రుసుములు చెల్లించినా వాటి ప్రింట్ల కోసం అదనంగా చెల్లించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. పాలకొల్లు 1, 2, 3 వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయకపోవడంతో వచ్చిన వారు వెనుదిరుగుతున్నారు. సమీప మీసేవా కేంద్రాలకు వెళ్లి అవసరమైన పత్రాలు పొందుతున్నారు. నరసాపురం పట్టణంలో 16 సచివాలయాలుండగా ఏఒక్క చోటా తగిన పరికరాలు, స్టేషనరీ అందుబాటులో లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పురపాలిక సంఘాలు సచివాలయాల నిర్వహణ బాధ్యతను తీసుకునే అవకాశం ఉన్నా అలా జరగడం లేదు. ఈ అంశంపై సచివాలయాల పర్యవేక్షణాధికారి దోసిరెడ్డి స్పందిస్తూ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పాలకొల్లు హౌసింగ్‌బోర్డుకాలనీలో 24, 25 వార్డులకు సంబంధించి సచివాలయంలో కంప్యూటర్ సీపీయూ మరమ్మతులకు గురికావడంతో ఇలా అటకెక్కించేశారు. ఇక్కడ సరిపడే సిబ్బంది ఉన్నా నిర్వహణ సామగ్రి, పరికరాలు లేకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లోని పలు వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయడం లేదు. సిబ్బంది జారీ చేసే ధ్రువపత్రాలను ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి కాపీలు తీసుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

# క్యాన్సరుపై పోరు!


ఒంగోలు : క్యాన్సరుపై పోరుకు వైద్య,ఆరోగ్యశాఖ మరోసారి ఇంటింటి సర్వేకు సిద్ధమవుతోంది. ఎన్‌సీడీ 3.0 పేరుతో గతంలో చేపట్టిన సర్వే రెండు నెలల కిందట ముగిసింది. దీనిలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రమాణాలకనుగుణంగా సమాచారం రాకపోవడంతో 4.0 పేరుతో సెప్టెంబరు నుంచి మరో సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే వైద్యులకు శిక్షణ పూర్తయింది. ఏటా అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సరుపై సాధారణ సర్వే జరుగుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి వ్యాధులపై తూతూమంత్రంగా సమాచారం సేకరిస్తుండడంతో వివరాలు పక్కాగా ఉండడంలేదు. క్యాన్సరు వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నా సర్వేలో వెలుగు చూడడంలేదు. ఎక్కువమంది వ్యాధి బారిన పడినా చెప్పడానికి ఇష్టపడడంలేదు. పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడంలేదు. ఈ సారి పక్కాగా సర్వే చేసి ప్రారంభ దశలోనే క్యాన్సరును గుర్తించాలని వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళిక రూపొందించింది.

**ముందుకు రాని రోగులు**

మూడు రకాల క్యాన్సర్లు అధికంగా వస్తున్నట్లు గుర్తించారు. సర్వైకల్, బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో చేసే ప్రాథమిక పరీక్షల్లో అనుమానితులను గుర్తిస్తారు. పీహెచ్‌సీ వైద్యులు పరీక్షించాక వారిని పూర్తిస్థాయిలో పరీక్షించి వ్యాధి నిర్ధారణకు ఒంగోలు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలిస్తారు. అక్కడ వ్యాధి నిర్ధారణ అనంతరం రోగి బంధువులకు తెలియజేసి చికిత్స చేయించుకోవాలని సూచిస్తారు. క్యాన్సరు బారిన పడినవారు చికిత్సకు రావడంలేదు. వీరికి అవగాహన కల్పించి ఆసుపత్రులకు తీసుకురావాల్సిన వైద్యసిబ్బంది ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సారి చేపట్టే సర్వేలో వ్యాధి నిర్ధారణ అయినవారందరికీ తప్పనిసరిగా చికిత్స చేయించాలని నిర్ణయించారు.

# చెరువుల్లా చేలు.. ముంపులోనే ఆలయాలు

పెనుమంట్ర : భారీ వర్షాల ప్రభావంతో గోస్తనీ కాలువలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువ నుంచి ప్రవాహం శుక్రవారం మరింత పెరగడంతో ముంపు మరికొన్ని ప్రాంతాలకు విస్తరించింది. గోస్తనీ పరీవాహక ప్రాంతమైన సోమరాజు ఇల్లింద్రపర్రులో వరి చేలు



ముంపులో చిక్కి చెరువులను తలపిస్తున్నాయి. మల్లిపూడి, జుత్తిగ, నత్తారామేశ్వరం, మాముదూరు ప్రాంతాల్లో మరో 3 వేల ఎకరాల్లో సైతం ముంపు ప్రభావం పడింది. నత్తారామేశ్వరంలో రామేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ముంపులోకి ఉంది. ఆలయ ప్రాంగణంలోకి వచ్చే అవకాశం లేకపోవడంతో మహిళలు ప్రవేశమార్గం, గోపురం వద్ద పూజలు చేసుకుంటున్నారు. జుత్తిగలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోకి తొలిసారిగా వరద నీరు చేరింది. ప్రస్తుతం స్వామి మూల విరాట్ నీళ్లలో ఉండగా అలాగే పూజలు చేస్తున్నారు. పెనుమంట్రలోని చిన్నపైడావ పుంతదారిలోకి మరింత నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమంట్ర రాజీవ్ కాలనీ వెనుక పేదల లేఅవుట్ ముంపులో చిక్కుకోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

# కంచేసుకో.. పంచేసుకో!!

విశాఖపట్నం : గెడ్డలపై కొందరు గద్దల్లా వాలిపోతున్నారు. భవన వ్యర్థాలతో తొలుత గెడ్డలు, వాగులను పూడ్చి ఆపై చదును చేస్తున్నారు. కొన్ని చోట్ల చుట్టూ రక్షణ కంచెలు నిర్మించి కబ్జాదారులు గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. మరికొన్ని చోట్ల పునాదులు వేసి నిర్మాణాలు చేస్తున్నా... కట్టడి చేసే అధికారులు కరవయ్యారు. ఫలితంగా రూ.కోట్ల విలువైన స్థలాలు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. వర్షాలు కురిసి గెడ్డలు పొంగితే పెను ప్రమాదమే సంభవిస్తుంది.

ఎండాడ వద్ద సర్వే నెంబరు 100లో ఉన్న వాగు ఆక్రమణలతో బక్కచిక్కిపోతోంది. ఆక్రమించిన వాగు స్థలంలో రహదారులు, పశువుల షెడ్లు, మొక్కలు నాటి రక్షణ కంచె వేశారు. కార్తికవనం హోటల్ సమీపంలో ఆక్రమణలు గుర్తించి గతంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా, వాటిని తొలగించి మరీ కబ్జాదారులు పాగా వేశారు. రూ.కోట్ల విలువైన వాగు స్థలం అడుగడుగునా కబ్జాకు గురవుతున్నా అధికారులు సర్వేచేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సాగర్‌నగర్ సమీపంలో తాటిచెట్లపాలెం గెడ్డ ఆక్రమణలకు గురైంది. భవన వ్యర్థాలతో గెడ్డ స్థలం చదును చేసి సుమారు రూ.కోటిన్నర విలువైన 300 గజాలపైగా ఆక్రమించేశారు. సొంత స్థలాల్లా చుట్టూ ప్రహరీ, ఫెన్సింగ్‌లు నిర్మించారు. జూపార్కు కొండలు, కంబాలకొండ నుంచి వచ్చే వర్షపు నీరు ఈ గెడ్డలోనే ప్రవహిస్తుంది. ఈ వ్యవహారంలో స్థానిక వైకాపా నాయకుడు ఒక చక్రం తిప్పుతున్నారు. ఈయనతో



పాటు ఓ ప్రభుత్వ అధికారి కుటుంబ సభ్యులు సైతం ఈ గెడ్డ ఆక్రమణలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. నగరంపాలెం గెడ్డపై అడుగడుగునా ఆక్రమణలే దర్శనమిస్తున్నాయి. 15 అడుగులుండాల్సిన గెడ్డ కొన్నిచోట్ల 5 అడుగులే ఉంది. మొత్తంగా పిల్లకాల్వలా మార్చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గెడ్డకు మరో వైపు ఉన్న స్థలాలకు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేశారు. దీంతో పూడికతీతకు అవకాశంలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎనిమిది కాలనీలు, మూడు గ్రామాల నుంచి వచ్చే వాడుక నీరు, వర్షపు నీరు ఈ గెడ్డలోనే ప్రవహించాలి. వరదనీరు పోటెత్తితే ఇక్కడ ప్రమాదకరమే. పీఎంపాలెం చివరి బస్‌స్టాప్ నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ మీదుగా బక్కన్నపాలెం ప్రాంతాలకు వెళ్లే గెడ్డను ఆక్రమించేశారు. ప్రధానంగా హెచ్‌పీసీఎల్ లేఅవుట్ వద్ద నిర్మాణాలు గెడ్డలోకి చొచ్చుకువచ్చాయి. ఈ గెడ్డలో ప్రహరీలు, నిర్మాణాలు ఆరు చోట్ల జరిగాయి. సుమారు రూ.3.50 కోట్ల విలువైన 600 గజాల మేర గెడ్డ స్థలం ఆక్రమణలపాలైంది.

# బోర్డు ఛైర్మన్ పదవి ఎవరిని వరించునో..!

పుంగనూరు : కూటమి ప్రభుత్వం ప్రముఖ ఆలయాల్లో పాలక మండళ్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే చౌడేపల్లె మండలం బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న ఆలయాలకు ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన బోయకొండ గంగమ్మ ఆలయ ట్రస్టు బోర్డులో స్థానం దక్కించుకోవడానికి తెదేపా, జనసేన, భాజపాల నుంచి కొందరు ముమ్మర యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పుంగనూరు నియోజకవర్గంలో పేరొందిన పుంగనూరు, సోమల, రొంపిచెర్ల మార్కెట్



కమిటీల ఛైర్మన్ల నియామకం పూర్తయింది. అలాగే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బోయకొండ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవికి పోటీ నెలకొంది. దీంతో ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. అమ్మవారి వార్షిక ఆదాయాన్ని గుర్తించి 13 మందితో ట్రస్టు బోర్డు సభ్యులను నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరిలో ఎస్సీ వర్గం నుంచి ఒకరు, ఎస్టీ–ఒకరు, బీసీ–ఐదుగురు, ఇతరులు ఆరుగురికి అవకాశం ఉంది.

**దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..– ఏకాంబరం, ఈవో, బోయకొండ**

బోయకొండ ఆలయ కమిటీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆస క్తి ఉన్నవారు ఈ నెల 27లోపు బోయకొండ ఈవో కార్యాలయం లో దరఖాస్తులు అందించాలి.

# నీటి బొట్టు.. ఒడిసి పట్టు..!

పుంగనూరు : కరవు నివారణ, భూగర్భ జలాలను పెంచేందుకు ఈ ఏడాది కూటమి ప్రభుత్వం పంట సంజీవని(నీటి కుంటలు)కి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీరు కుంటల్లోకి వచ్చి చేరడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 18 వేల పంట సంజీవని కుంటలు ప్రభుత్వం మంజూరు చేసింది. కష్టపడి తవ్వుకున్న రైతులకు ఫలితాలు కళ్లముందే కనిపిస్తుండటంతో పంటల సాగుకు ఉపక్రమించారు. జిల్లాలోని 31 మండలాల్లో 18వేల ఫారం ఫండ్లు మంజూరు కాగా ఇప్పటికి వరకు 6,577 పూర్తయ్యాయి. రైతులకు ఉన్న భూమి విస్తీర్ణం పరిగణలోకి తీసుకుని అత్యధికంగా 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతు, అత్యల్పంగా ఐదు మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో పంట సంజీవని తవ్వుతున్నారు.

**లక్ష్యాలు సాధిస్తాం.. – రవికుమార్, పీడీ, డ్వామా, చిత్తూరు**

జిల్లాలో పంట కుంటల నిర్మాణ లక్ష్యాలు సాధిస్తాం. మెట్ట భూములు అధిక విస్తీర్ణంలో ఉన్న రైతులు తవ్వుకున్న కుంటల్లో ప్రస్తుతం వర్షపు నీరు చేరుతోంది. పంటల సాగుకే కాదు భూగర్భ జలాలు పెంపొందేందుకు దోహదపడుతోంది. రైతులు త్వరితగతిన తవ్వకాలు పూర్తి చేయాలి. అందుకు పూర్తి సహకారం అందిస్తాం.

# హంద్రీనీవా.. గుంతకల్లుకు అందేనా?



గుంతకల్లు: హంద్రీనీవా కాలువ రూపకల్పన సమయంలో గుంతకల్లు నియోజకవర్గంలో ఎకరా భూమి కూడా కాలువ కింద ఆయకట్టుగా పొందుపర్చలేదు. దీంతో ఇక్కడి రైతులు హంద్రీనీవా నీటికి దూరమయ్యారు. కాలువను ప్రభుత్వం కర్నూలు జిల్లా నుంచి కసాపురం, గుంతకల్లుకొట్టాల, రాగులపాడు మీదుగా ఏర్పాటు చేసింది.

**పూర్తయితేనే ప్రయోజనం**

రైతుల విన్నపంతో కాలువను సరిదిద్దడానికి రాగులపాడు గ్రామం వద్ద తూము ఏర్పాటు చేసి... కాలువ నిర్మించి 14 చెరువులు, కుంటలకు నీటిని సరాఫరా చేసే ప్రణాళికను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఆయా పనులు పూర్తయితే దాదాపు 4 వేల వ్యవసాయ, తాగునీటి బోర్లలోనూ భూగర్భ జలం పెరుగుతుంది.

**భూమిపూజతో సరిపెట్టారంతే..**

కాలువ పనులకు గత తెదేపా ప్రభుత్వం 2018లో పరిపాలనా ఆమోదం తెలిపింది. రూ.40 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం 2021లో కాలువ పనులకు టెండర్లను నిర్వహించింది. అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పనులకు భూమిపూజ చేశారు. నిధులివ్వకపోవడంతో పనులు సాగలేదు. ప్రసుత్తం కూటమి ప్రభుత్వం పనులు చేయడానికి అంగీకారం తెలిపింది.

**సీఎం ప్రకటించినా...**

ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు నెలల కిందట ఉరవకొండ నియోజకవర్గ పర్యటన సమయంలో జరిగిన బహిరంగ సభలో కాలువ పనులు చేపడతామని ప్రకటించారు. మొత్తం 20 కి.మీ.ల పొడవునా నిర్మించాల్సి ఉంది. కాలువ తవ్వకానికి 240 ఎకరాల భూసేకరణకు గాను రూ.40 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. **నిధులు రాగానే పనులు చేపడతాం: శ్రీనివాసనాయక్, ఈఈ, హంద్రీనీవా గుంతకల్లు డివిజన్**

కాలువ పనులకు రూ.40 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం. గతంలోని టెండర్లు రద్దు చేయలేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు కాలువ పనులు కొనసాగుతాయి.

# వణుకుతున్న గురుకులం!



హిందూపురం : గ్రామీణ మండలం మలగూరులోని అంబేద్కర్ గురుకుల బాలుర సంక్షేమ పాఠశాలలో విద్యార్థులను వైరల్ ఫివర్ వారం రోజులుగా వణికిస్తోంది. జ్వరాల భారిన పడిన విద్యార్థులకు పాఠశాల నర్సు సునిత మందులు అందించి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించగా ఈ లక్షణాలు బయటపడక పోవటం, మందులు వినియోగిస్తున్నా జ్వరం తగ్గుముఖం పట్టక పోవడంతో శుక్రవారం దాదాపు ఆరుగురు విద్యార్థులను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వరుణ్‌సందేశ్‌నాయక్ (9వ తరగతి)తోపాటు 8వ తరగతి చదువుతున్న కౌసిర్, అఖిర, వరుణ్‌కుమార్‌లు చికిత్స పొందుతున్నారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులకు జ్వరం తగ్గుముఖం పట్టడంతో ఇంటికి పంపారు. ఇప్పటికే జ్వరం భారిన పడిన కొంతమంది విద్యార్థులకు ఇంటికి వెళ్లి పోయారు. వాతావరణంలో మార్పులు, పరిసరాల ప్రభావంతో విద్యాలయం విద్యార్థులకు జ్వరాలు సోకినట్లు వైద్యులు తెలిపారు. జ్వరాల భారిన పడిన విద్యార్థులకు తగిన వైద్యసేవలు అందిస్తూ మరొకరికి సోకకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నామని పాఠశాల ప్రిన్సిపల్ నూరుల్లా తెలిపారు.

**జేసీ, డీఎంహెచ్‌వో సందర్శన**

విద్యార్థులు విషజ్వరాల భారిన పడిన విషయం తెలుసుకొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎంహెచ్‌వో ఫైరోజ్‌బేగం శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఎంత మంది విద్యార్థులకు ఎప్పటి నుంచి జ్వరాలు వస్తున్నాయి. వైద్యసేవలు ఎలా అందుతున్నాయనే విషయంపై ఆరా తీశారు. వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను జేసీ ఆదేశించారు.

**చుట్టూ ముళ్లకంపలు, కిటికీలకు చిరిగిన తెరలు**

గురుకుల పాఠశాల విద్యార్థుల నివాస భవనం శిథిలావ్థకు చేరుకొంది. 510 మంది విద్యార్థులు పాఠశాలల్లో ఉన్నారు. విద్యాలయం చుట్టూ ముళ్లకంపలు ఏపుగా పెరిగిపోవటంతో రాత్రుళ్లలో విద్యార్థులు తీవ్ర దోమలబెడదను ఎదుర్కొంటున్నారు. దోమలు గదుల్లోకి ప్రవేశించకుండా కిటికీలకు అమర్చిన తెరలు పలుచోట్ల చిరిగి పోవటంతో రాత్రుళ్లలో విద్యార్థులు దోమల బెడద ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని దెబ్బతిన్న కిటికీలకు మరమ్మతులు చేయించి, గదుల్లోకి దోమలు రాకుండా కొత్తగా మెష్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# మబ్బులే.. వర్షాల్లేవు!



విశాఖపట్నం: 'నైరుతి' రుతుపవనాలు ప్రవేశించి రెండు నెలలు దాటినా విశాఖ నగర ప్రజలకు ఎదురుచూపులు తప్పలేదు. జూన్ తర్వాత ఇప్పటివరకు శివారు ప్రాంతాల్లో మినహా నగరంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురవలేదు. జూన్, జులై నెలల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయిదు రోజుల క్రితం వరకు వేసవి తరహా పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఏసీలు, కూలర్లు లేకపోతే ఇళ్లు, కార్యాలయాల్లో ఉండలేని పరిస్థితి.

అల్పపీడనం ఏర్పడినా: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ముందుగా ప్రకటించింది. మూడు రోజులుగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. నగరంలో చిరుజల్లులు మినహా వర్షాలు లేవు. శుక్రవారం పెందుర్తి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట వ్యవధిలో 86.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పద్మనాభం, విశాఖ గ్రామీణం, ఆనందపురం తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవగా.. గాజువాక, సీతమ్మధార, భీమునిపట్నం, పెదగంట్యాడ, మహారాణిపేట తదితర ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగింది. జూన్ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో ఆరిలోవ, మధురవాడ, ఎండాడ తదితర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు పడిపోయాయి.

ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు వర్షపాతం ఇలా (మి.మీ.)

జోనల్ కార్యాలయం (పెందుర్తి) 86.5

పోలీస్ స్టేషన్ (పెందుర్తి) 61.5

కణమాం (ఆనందపురం) 50

శిల్పారామం (కొమ్మాది) 49.5

ఎండాడ 27 పద్మనాభం 18.5.

ఇప్పటివరకు 206.6 మి.మీ. వర్షం: జిల్లాలో మూడు నెలలుగా వర్షాభావ పరిస్థితులు కొనసాగు తున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 40 శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఇది రాష్ట్రంలోనే అత్యధికం. జూన్ తర్వాత ఇప్పటివరకు జిల్లాలో 344.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 206.6 మి.మీ. మాత్రమే నమోదైంది. ఎక్కువ లోటు వర్షపాతమున్న జాబితాలో విశాఖ అర్బన్, విశాఖ గ్రామీణం, గాజువాక, పద్మనాభం, పెదగంట్యాడ, పెందుర్తి మండలాలున్నాయి.

# ఏనుగులకూ ఉందో మార్గం..!

తిరుపతి : వన్యప్రాణులకు ఎలాంటి అడ్డంకి లేకుండా సంచరించేం దుకు ఎక్స్‌ప్రెస్ వే అధికారులు ప్రత్యేక మార్గాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం చెన్నై–బెంగళూరు 258 కి.మీ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి రూ.17,930 కోట్లతో పనులు చేపట్టారు. ఈ హైవే జిల్లాలో చిత్తూరు పలమనేరు అడవి మార్గం గుండా వెళ్తుంది. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 65 కి.మీ దూరం పనులు జరుగుతున్నాయి. ఈ మార్గం అడవి గుండా సాగుతుంది. ఇక్కడ ఏనుగుల సంచారం ఉండటంతో వాటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్మాణాన్ని చేపట్టాలని ఎక్స్‌ప్రెస్ వే అధికారులు ఆలోచించారు. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఈ మార్గంలో ఏనుగులు సంచరించడానికి వీలుగా 12 అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నారు. ఎత్తైన పిల్లర్లు నిర్మించి



దానిమీద రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అలాగే తిరుపతి జిల్లాలోని కాలూరు నుంచి పీలేరు వరకు ఎన్‌హెచ్–71ను భాకరాపేట రక్షిత అడవిలో నిర్మించాల్సి ఉంది. కనుమదారిలో మొత్తం 11 కి.మీ. ఉండగా నిర్మాణంలో భాగంగా ఏనుగులు, ఇతర వన్యప్రాణుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నాలుగుచోట్ల 15 అడుగుల ఎత్తులో అండర్‌పాస్‌లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. తిరుపతి జిల్లా పరిధిలో 30, చిత్తూరు పరిధిలో వందకుపైగా గజరాజులు సంచరిస్తుండటంతో అభివృద్ధి పనుల్లో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అటవీ అధికారులు వెల్లడిస్తున్నారు.

# విద్యాలయంలో పెరటి సేద్యం

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలం బీటీ ప్రాజెక్టులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులు చదువుతోపాటు పెరటి సేద్యంపై అవగాహన పెంచుకుంటున్నారు. వసతిగృహంలోని వంటశాలలో నిత్యం స్థానికంగా పండే ఆకుకూరలు, కూరగాయలతోనే వంటకాలు చేస్తుండటం గమనార్హం. ఇక్కడ 280 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నిత్యం సాయంత్రం అరగంట పాటు పెరటి సాగులో భాగంగా కలుపు మొక్కలు తొలగించడంతోపాటు నీరు పెట్టడం, పాదులు చేయడం తదితరాలు సిబ్బంది సాయంతో చేస్తుంటారు. ప్రతిరోజూ వంటకాలకు అవసరమయ్యే కూరగాయలు ఇక్కడే సాగవుతుండటం విశేషం.

**సేంద్రియ ఎరువులతోనే..**

విద్యాలయం ఆవరణలోని ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో పెరటి సాగు చేస్తున్నారు. తోటకూర, గోంగూర, చుక్కాకు, మెంతాకు,



సబ్బాక్షి, కొత్తిమీర, కరివేపాకుతోపాటు ముల్లంగి క్యారెట్, బెండ, చిక్కుడుకాయలు పండిస్తున్నారు. ప్రతి శనివారం సాయంత్రం విద్యార్థినులకు తోట పనిపై అధ్యాపకులు అవగాహన కల్పిస్తారు.

**పోషకాహార లోపం అధిగమిస్తున్నాం: షబానా, ప్రత్యేకాధికారిణి, గుమ్మఘట్ట కేజీబీవీ**

ఇక్కడ చదివేవారిలో ఎక్కువ శాతం కౌమార దశలో ఉన్నవారే. రక్తహీనతతోపాటు ఇతర రుగ్మతలు అధిగమించడానికి పనికొచ్చే పోషకాహారం ఇక్కడే పండిస్తున్నాం. ఉద్యానశాఖ అధికారులు సహకరిస్తే మరిన్ని కూరగాయలు సాగు చేస్తాం.

# ఆధార్‌కు 'బాలా'రిష్టాలు

కర్నూలు : ఆధార్ అన్నింటికీ ప్రామాణికంగా మారింది. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరికి ఈ గుర్తింపు పత్రం తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించాలన్నా.. ఆసుపత్రుల్లో ఓపీ కావాలన్నా ఇదే కీలకం. పిల్లలు బడిలో చేరాలన్నా ఆధార్‌పత్రం కావాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఆరేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా నమోదు చేయాలని ఆదేశించింది. కానీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇది అమలుకావడం లేదు. ప్రజలు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

**నవీకరణలోనూ నాన్చుడే**

పిల్లలకు 6, 15 ఏళ్లు దాటగానే ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలి. బయోమెట్రిక్ వివరాలు నవీకరించుకోవాలి. ఇలాంటి పిల్లలు కర్నూలు జిల్లాలో 5.55 లక్షలు, నంద్యాల జిల్లాలో 2.76 లక్షల మంది ఉన్నారు. వీరిలో లక్షమంది కూడా ఆధార్ నవీకరణ చేయించుకోలేని పరిస్థితి నెలకొంది.

**1.19 లక్షల మంది ఎదురుచూపు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది డిసెంబరు వరకు ఆధార్ నమోదు చేసుకోని ఆరేళ్లలోపు చిన్నారులు 1,37,272 మంది ఉన్నారు. గడిచిన 7 నెలల్లో మాసాల్లో 17,542 మంది చిన్నారులకు మాత్రమే ఆధార్ నమోదు చేశారు. ఈనెల 14వ తేదీ నాటికి ఇంకా 1.19 లక్షల మంది చిన్నారులకు ఆధార్ లేదు. వీరిలో 29,493 మందికి ఇదివరకే ఆధార్ నమోదు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 96,565 మంది చిన్నారుల వివరాలు నమోదు చేయించాల్సి ఉంది.

**నత్తనడకన ప్రక్రియ**

ఉమ్మడి జిల్లాలో చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది చివరికి కూడా ఇది పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయాల సంచాలకులు ఎం.శివప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. కానీ ఎక్కడా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో 1,188 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 234 ఆధార్ నమోదు కేంద్రాలున్నట్లు అధికారులు చెబుతున్నా వీటిలో 78 కేంద్రాలు పనిచేయడం లేదు. ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని చెబుతున్న 156 కేంద్రాల్లో ఆధార్ కేంద్రాల్లో కూడా 80 పనిచేయడం లేదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు కిట్లు పనిచేయకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు వ్యయ ప్రయాసలకోర్చి ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించి అధిక మొత్తం చెల్లించి ఆధార్ నమోదు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

చురకలు



## ప్లాస్టిక్ నిషేధంపై తొలి అడుగు

కాకినాడ : జిల్లా పరిపాలనా కేంద్రం కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలని నిర్ణయించారు. ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లేట్లు, సంచులు వంటివి శనివారం నుంచి వినియోగించవద్దని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం 'అంతం-ప్లాస్టిక్ కాలుష్యం' అనే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని శనివారం నుంచి అమల్లోకి తేనున్నారు. దీనిపై డీఆర్వో జె.వెంకటరావు శుక్రవారం విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ బాటిల్‌తో తాగునీరు వెంట తెచ్చుకుంటే ఆ ఉద్యోగికి ఆ రోజు సీఎల్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని మూడు క్యాంటీన్లలోనూ నిషేధం అమలు చేయనున్నారు. రీ-యూజ్ ప్లాస్టిక్ వస్తువులు మినహా, మిగతా ఏ ఇతర ప్లాస్టిక్ సామగ్రిని కలెక్టరేట్‌లో వినియోగించకూడదని ఆదేశాలు జారీ చేశారు.

**రూ.లక్షతో ఆర్వో ప్లాంటు**



కలెక్టరేట్‌లో 100 మంది ఉద్యోగులున్నారు. సెలవు రోజు మినహా మిగతా అన్ని రోజుల్లో కలెక్టర్, జేసీ, డీఆర్వో జిల్లాస్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నెలకు సుమారు 7,500 వరకు ప్లాస్టిక్ నీటి సీసాలు వినియోగిస్తున్నారు. కార్యాలయ సిబ్బంది తాగునీటి అవసరాలకు నెలకు 200 ప్లాస్టిక్ బబుల్స్(20 లీటర్లవి) కొనుగోలు చేస్తున్నారు. వీటన్నింటికీ నెలకు రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా వీటికి స్వస్తి పలకనున్నారు. రూ.లక్ష వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు నిర్ణయించారు. స్టీల్ సీసాలను కొనుగోలు చేయనున్నారు. సమీక్షల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు వీటినే వినియోగిస్తారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ దీనిని అమలు చేస్తారు.

**ఆదర్శంగా నిలవాలని..** ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని ఎప్పటి నుంచో ప్రభుత్వాలు సూచిస్తు న్నా.. కార్యాచరణలోకి రావడం లేదు. ఈసారి కచ్చితంగా కలెక్టరేట్‌లో ప్రారంభించి, మిగతా శాఖలకు ఆదర్శంగా నిలవాలని భావిస్తున్నారు. కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్న వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాల యాల్లో దశలవారీగా దీనిని అమలు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ భావిస్తున్నారు.

## అన్నదాత గుండెకోత

రావులపాలెం : గోదావరికి వరద వచ్చిందంటే చాలు లంక రైతుల్లో ఆందోళన మొదలవుతోంది. భూమి కోతకు గురై నదిలో కలిసిపోతుండటంతో ఏం చేయలేని పరిస్థితుల్లో కూలీలుగా మారాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల్లో గ్రోయిన్‌లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

కొత్తపేట నియోజకవర్గంలో గౌతమి, వశిష్ట గోదావరి పాయలకు ఇరువైపులా ఉన్న లంక భూములు గల్లంతవుతున్నాయి. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, మండలాలు ఈ పాయల మధ్యలో ఉంటాయి. ఆలమూరు మండలం గౌతమి గోదావరిని ఆనుకుని ఉంటుంది. బొబ్బర్లంక మొదలుకొని రావులపాలెం, కొమరాజులంక మీదుగా కొత్తపేట వరకు.. అటు అంకంపాలెం, ర్యాలీ, లక్ష్మీపోలవరం, పొడగట్ట పల్లి, గోపాలపురం వరకూ ఉన్న లంక భూములు నదిలో కలిసిపో



తున్నాయి. రూ.లక్షలు విలువచేసే భూములను తమ పాస్ పుస్తకాల్లో చూసుకుంటున్నామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించినా..**

గోపాలపురంలో 450, ర్యాలి-లక్ష్మీపోలవరం ప్రాంతాల్లో 160, పులిదిండి పరిసర ప్రాంతాల్లో 90, బడుగువానిలంక సమీపంలో 100, కొమరాజులంకలో 95 ఎకరాల చొప్పున కోతకు గురైనట్లు గతంలో అధికారులు గుర్తించారు. రెండేళ్ల క్రితమే బొబ్బర్లంక, కొమరాజులంక, గోపాలపురం, పులిదిండి ప్రాంతాల్లో గ్రోయిన్స్ నిర్మించాలని హెడ్‌వర్క్స్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కొత్తగా మళ్లీ నియోజకవర్గంలో గ్రోయిన్, రివిట్‌మెంట్ నిర్మాణాలకు రూ.160 కోట్లు అవసరమని ప్రణాళిక వేశారు. 'గోదావరి వరద నేపథ్యంలో లంక భూములు కోతకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఏయే చర్యలు తీసుకోవాలో, ఎక్కడెక్కడ నిర్మాణాలు చేపట్టాలో పరిశీలించి ఉన్నతాధికారులకు పంపిస్తాము'. హెడ్‌వర్క్స్ ఏఈ ప్రసాద్ తెలిపారు.

## కాలువలు బాగుంటేనే చెరువులకు జలకళ

పుట్టపర్తి : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 17న మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవాకు నీటిని విడుదల చేశారు. నీటిపారుదల సాఫీగా సాగాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మల్యాల నుంచి జీడిపల్లి జలాశయం వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ కాంక్రీట్ లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టింది. చాలావరకు పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం నుంచి చిత్తూరు వరకు నీటిని తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట జిల్లాలోని జలాశయాలను.. ఆపై చెరువులను నింపేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. **అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా..**

ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వందలాది చెరువులకు నీరందనుంది. గత ప్రభుత్వంలో హంద్రీనీవా నీటిని తూతూమంత్రంగా చెరువులకు అందించినప్పటికీ ఆయకట్టుకు అందిన దాఖలాల్లేవు.. దీంతో చెరువుల ఆయకట్టు కాలువలు పిచ్చిమొక్కలతో నిండి, పలుచోట్ల పూడిక పేరుకుపోయింది. జగన్ సర్కారు కనీసం చెరువుకట్టలు, కాలువలకు మరమ్మతులు చేయించిన పాపానపోలేదు. ఆరేళ్లుగా నిర్వహణకు నోచుకోని కాలువలు రూపు కోల్పోయాయి. అదే నిర్లక్ష్యం పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వివాదాలు రానీయకుండా..

శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 1,186 చెరువులు ఉన్నాయి. వీటి కింద 83,485 ఎకరాల ఆయకట్టు ఉంది.

# కాలుష్య కోరల్లో కాలువ గట్లు



కడియం : అంతర్జాతీయంగా పేరొందిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ సమీపంలోని తూర్పు డెల్టా కాలువ గట్టు మీద పంచాయతీ సిబ్బంది యథేచ్ఛగా వ్యర్థాలు వేస్తున్నారు. అవన్నీ గోదావరిలో కలిసి కలుషితం అవుతోంది. మేజర్ పంచాయతీగా పేరొందిన ధవళేశ్వరంలో వ్యర్థాల తరలింపు ఓ ప్రహసనంగా మారింది. ఇక్కడ డంపింగ్ యార్డు సమస్య ఉండటంతో బొమ్మూరు జాతీయ రహదారి చెంతనున్న డంపింగ్ యార్డుకు తరలించేవారు. గత కలెక్టరు ఆదేశాలతో ఇక్కడకు తరలించడం ఆపేశారు. అప్పటి నుంచి సేకరించిన వ్యర్థాలన్నీ గోదావరి కాలువ గట్లపై డంపింగ్ చేస్తున్నారు. ఆపై వాటిని జేసీబీలతో నదిలోకి తోసేయడం పరిపాటిగా మారింది.

**ఫిర్యాదులు చేసినా..**

కొన్ని సందర్భాల్లో కాటన్ బ్యారేజీ దిగువన వ్యర్థాలను కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్నారు. దీంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులు, సమీపంలోని పాఠశాల విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవట్లేదనే విమర్శలు ఉన్నాయి. బ్యారేజీ నుంచి అదనపు జలాలను విడుదల చేసే సమయంలోనూ ఈ వ్యర్థాలు పెద్దఎత్తున నదిలో కలుస్తున్నాయి. అవి మత్స్యసంపదపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులస లభ్యత తగ్గుతోందని వాపోతున్నారు. నదుల పర్యవేక్షణకు నదీ కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇంత జరుగుతున్నా ఎలాంటి చర్యలు ఉండట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం అప్రమత్తమై పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**నివేదికలు సిద్ధం చేస్తున్నాం..** - జి.శ్రీనివాస్, డీఈ గోదావరి హెడ్‌వర్క్స్, ధవళేశ్వరం కాలువ గట్లపైకి చెత్త తరలించొద్దని ధవళేశ్వరం పంచాయతీ అధికారులకు పలుసార్లు నోటీసులు ఇచ్చాం. నగరపాలక సంస్థతో ముడిపడిన అంశం కావడంతో జాప్యమవుతోంది. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నదీ కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తాం. ధవళేశ్వరం నుంచి వేమగిరి, కడియం వరకు కాలువ గట్ల నిర్వహణ, సుందరీకరణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. వాటికి అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధి అంశం పరిశీలనలో ఉంది.

# కడలి కోతకు చికిత్స!



కాకినాడ: కాకినాడ జిల్లాలో ఉప్పాడ తీరం కోత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ తీర రక్షణపై చేస్తున్న ప్రకటనలు స్థానికుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. రూ.323 కోట్ల వ్యయంతో రక్షణగోడ నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉందని ఇటీవల ఎంపీ వెల్లడించారు. ఈనెల 30న దిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శితో జరిగే సమావేశంలో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర ఉన్నతాధికారులతో కూడిన సబ్ కమిటీ పాల్గొననుంది. తద్వారా మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**సాగరంలో కలిసిపోతూ..**

కాకినాడ సాగర తీరంలో కెరటాల ధాటికి సుబ్బంపేట నుంచి ఉప్పాడ మీదుగా కోనపాపపేట వరకు మత్స్యకార గ్రామాలు మాయమవుతున్నాయి. ఇప్పటికే వందల సంఖ్యలో ఇళ్లు, ఆలయాలు, ఆస్తులు కడలిలో కలిసిపోయాయి. ఉప్పాడ కొత్తపల్లి రోడ్డు కోతకు గురవుతోంది. వీటి రక్షణకు గతంలో నిర్మించిన జియోట్యూబ్ చెల్లాచెదురైపోయింది. కొన్నేళ్లుగా సమస్య మరింత తీవ్రం కావడంతో స్థానికులంతా నేతలకు విన్నవిస్తూ వస్తున్నారు. వైకాపా హయాంలో కేంద్ర బృందం వచ్చి పరిశీలించినా పరిష్కారానికి అప్పటి నేతలు చొరవ చూపలేకపోయారు. పిఠాపురం నుంచి ఎన్నికైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉప్పాడ తీర రక్షణపై ప్రత్యేక దృష్టిసారించారు. శాశ్వత పరిష్కారం కోసం నిపుణులతో మాట్లాడి రక్షణ గోడ నిర్మాణానికి రూ.323 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కేంద్రం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్తూ ఈ భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు కృషిచేస్తున్నారు.

**ప్రతిపాదనలు పరిశీలించి..** దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల్లో కోత నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. పరిశీలించిన కేంద్రం విశాఖపట్నం, కాకినాడ జిల్లాల డీపీఆర్‌లను తుది దశ సమీక్షకు తీసుకున్నట్లు సమాచారం. ఉప్పాడ తీర ప్రాంతం ఎక్కువ కోతకు గురవడం, ఇళ్లు నేలమట్టమవ్వడంతో కాకినాడ జిల్లా అధికారులు ప్రతిపాదించిన డీపీఆర్ ఆమోదానికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల భాజపా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన మాధవ్ కూడా ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. సుబ్బంపేట నుంచి కోనపాపపేట వరకు సుమారు 15 కి.మీ మేర రక్షణ గోడ నిర్మించి మత్స్యకార గ్రామాలకు ముంపు ముప్పు నుంచి పరిష్కారం చూపనున్నారు.

# సాగు తరుణం.. కానరాని జలం



కాకినాడ : ఓవైపు జలాశయాలన్నీ అరకొర నీటితో ఉన్నాయి. వర్షాలు తగినంతగా కురవడం లేదు. ఏలేరు నుంచి తాండవ వరకు వరుణుడి వైపే చూస్తున్నాయి. ఈ దఫా ఖరీఫ్ పరిస్థితి ఏమిటో తెలియక మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు, ఇతర నీటి వనరులున్న చోట నారు, ఊడ్పులు అక్కడక్కడ జరుగుతున్నా అధికశాతం విస్తీర్ణం ప్రాజెక్టులపైనే ఆధారపడ్డాయి. ప్రత్తిపాడు మండలంలో 10వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఇ.గోకవరం సమీప మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్‌లో నీటిమట్టం 79 మీటర్లుగా ఉంది. పూర్తిస్థాయి మట్టం 87 మీటర్లు కాగా ఏజెన్సీ, ఉపప్రణాళిక మన్యంలోని 40 చదరపు మైళ్ల విస్తీర్ణంలో కురిసిన వర్షం ఈ ప్రాజెక్టుకు చేరాలి. జులైలో గట్టిగా సెం.మీ. కూడా కురవలేదు. ఆగస్టు మొదటి వారంలో ఊడ్పులకు సుబ్బారెడ్డిసాగర్ జలాలు విడుదల చేయాల్సి ఉన్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు.

**వాన రాకడ ఇంతే..!**

కాకినాడ జిల్లాలో జులై 1 నుంచి 16వ తేదీ వరకు 92.54 మి.మీ. వర్షం కురవాలి. కేవలం 40.46 మి.మీ. కురిసింది. జూన్ 1 నుంచి జులై 16 వరకు వర్షం కురిసిన రోజులు 14 మాత్రమే..! మేలో 109.77కు 115.48 మి.మీ వాన పడగా వేసవి ఉపశమనానికే ఉపయోగపడింది.

**పంపా దిగువన ఖాళీగా..**

అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. తొండంగి మండలంలోని 12,005 ఎకరాలకు పంపా నుంచే సాగునీరు అందుతుంది. గరిష్ఠ నీటిమట్టం 105 అడుగులు కాగా ఈ ఏడాది కేవలం 91.5 అడుగులే ఉంది. ఇది ఎటూచాలని పరిస్థితి. కనీసం 101 అడుగులకు చేరి నీటిని విడుదల చేస్తే రైతులకు ప్రయోజనం. దీంతో ఆయకట్టు పరిధిలో కేవలం బోర్లు కింద మాత్రమే తక్కువగా వరినాట్లు వేశారు. **ఏలేరులోనూ అంతంతమాత్రమే..!** రుతుపవనాలు కరుణించక ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ప్రాజెక్ట్‌పై ఆధారపడి మెట్టలో 53 వేల ఎకరాల సాగు జరగాలి. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 86.56 మీటర్లు (24.11 టీఎంసీలు). ప్రాజెక్టులో కేవలం 10.60 టీఎంసీల జలాలు మాత్రమే ఉన్నాయి. ఈ నిల్వల్లో 6 టీఎంసీలను కనిష్ఠ స్థాయిగా ఉంచాలి. నాలుగు టీఎంసీలనే సాగుకు, విశాఖ పారిశ్రామిక అవసరాలకు, తాగునీటికి వినియోగించుకోవాలి. ఏలేరు నుంచి సాగుకు 1400 క్యూసెక్కులు, విశాఖకు 150 క్యూసెక్కుల వంతున సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత నిల్వలను సాగుకే కేటాయించాలని మెట్ట రైతులు కోరుతున్నారు.

## నష్టపోతే 'కౌలు'కునేదెలా..

శ్రీకాకుళం : కౌలు రైతులు పండించిన ఉత్పత్తులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలన్నా.. విపత్తుల కారణంగా నష్టపోతే సాయం పొందాలన్నా.. ప్రభుత్వ లబ్ధి పొందడానికి సీసీఆర్సీ కార్డులు తప్పనిసరి. ఖరీఫ్ ప్రారంభమైనా వీటి మంజూరు నామమాత్రంగా సాగుతోంది. కౌలు గుర్తింపు కార్డులు వస్తే పంట సాగుకు అవసరమైన పెట్టుబడి రుణం పొందొచ్చని ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతులకు అవగాహన లేకపోవడం.. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో లక్ష్యం మేరకు ప్రక్రియ సాగడం లేదు.

జిల్లాలో కౌలు కార్డుల లక్ష్యం 9,800 కాగా ఇప్పటివరకు 6,402 మందికి జారీ చేశారు. ఈ-పంట నమోదు ప్రక్రియ త్వరలో మొదలవుతుంది. కౌలు రైతుల వద్ద సీసీఆర్సీ కార్డులు లేకపోతే వారి పేర్లు నమోదు కావు. పంట రుణాలు పొందలేరు. విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారమూ రాదు. ఇటీవల గ్రామ సచివాలయ, సాధారణ ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో కార్డుల అందజేత ప్రక్రియ



ఆలస్యమైందని సమాచారం. ఇప్పటికైనా అధికారులు కౌలు రైతులను గుర్తించి సకాలంలో వారు ప్రయోజనాలు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

**ప్రయోజనాలివీ..:** సీసీఆర్సీ కార్డు పొందిన రైతు వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు, ఎరువులు తీసుకోవచ్చు. బ్యాంకులు, పీఏసీఎస్‌ల నుంచి రుణాలు పొందొచ్చు. అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి చేకూరుతుంది. ఈ కార్డుల కోసం సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి. కౌలు రైతుకు కార్డు ఉంటే భూ యజమానితో పాటు సమానంగా పథకాలు వర్తిస్తాయి. ఈ-పంటలో వివరాల నమోదుకు ఇది తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు.

**అర్హులందరికీ అందజేస్తాం..**

సీసీఆర్సీ కార్డుల అందజేత ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. చాలా మంది రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నాం. ఈ నెలాఖరుకు అర్హులందరికీ కార్డులు అందజేస్తాం. - కె.త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

## ప్రణాళికా లోపం.. విద్యార్థులకు శాపం..!

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు అసౌకర్యాలతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆర్జీయూకేటీ అధికారుల ముందస్తు ప్రణాళికా లోపాలు వారిపాలిట శాపంగా మారుతున్నాయి. తరగతులు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా అరకొర సౌకర్యాలతో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా బ్యాచ్‌లు సర్దుబాటు నిర్ణయాలు కొత్త చిక్కులు తీసుకొచ్చింది..

ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురంలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఉంది. ఇప్పటివరకు పీయూసీ-1, 2తో పాటు ఇంజినీరింగ్-1, 2 బ్యాచ్‌లకు ఎస్.ఎం.పురం, శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు నిర్వహించేవారు. ఈసారి వర్సిటీ అధికారులు ఇక్కడున్న పీయూసీ-1ను నూజివీడుకు, అక్కడున్న ఇంజినీరింగ్-3, 4 బ్యాచ్‌లను శ్రీకాకుళానికి తరలించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇదెలా ఉన్నా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు, సమస్యలు, వసతులను పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక అధికారుల అభిప్రాయాలు దృష్టిలోకి తీసుకోకపోవడంతో కొత్తగా వచ్చిన విద్యార్థులకు అవస్థలు తప్పలేదు.

**పనులు ముందుకు సాగక..**

ప్రాంగణంలో రూ.62 కోట్లతో మూడువేల మందికి తరగతుల నిర్వహణకు సరిపడా అకడమిక్ భవన నిర్మాణ పనులు నాలుగేళ్ల కిందట ప్రారంభయ్యాయి. నేటికీ 30 శాతం కూడా పనులు




పూర్తికాలేదు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా, అందుకు తగినట్లుగా తాగునీరు సౌకర్యం మెరుగుపరచలేదు. వాడుక నీరు శుద్ధి చేసి బయటకు విడిచిపెట్టే ప్లాంట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

**వసతిగృహాల్లో కానరాని సౌకర్యాలు..**

శివానీ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో 1,100 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యంతో తరగతుల నిర్వహణకు గతంలో అద్దెకు తీసుకున్నారు. కానీ ప్రస్తుతం అక్కడ 500-600 మందికే వసతి కల్పించి తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి సరిపడా పడకలున్నాయి. తాజా నిర్ణయాలతో 1,100 మందికి వసతి కల్పించాల్సి ఉంది. ఇందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయలేదు. 500 మందికి పరుపులు, మంచాలు లేవు. ఎస్.ఎం.పురం క్యాంపస్‌లో గతం కంటే మరో 700 మంది వరకూ విద్యార్థులు పెరగటంతో వారికి సైతం మంచాల కొరత ఏర్పడింది. ముగ్గురు మాత్రమే ఉండాల్సిన గదుల్లో ఏడెనిమిది మంది వరకు ఉంచుతున్నారు.

**సమస్యలు పరిష్కరిస్తాం..**

ఏ బ్యాచ్‌లు ఎక్కడ నిర్వహించాలనేది వర్సిటీ అధికారుల నిర్ణయం. అందుకనుగుణంగా విద్యార్థులకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకొంటున్నాం. మంచాలు, బెడ్‌లు కొంతమందికి లేకపోవటం వాస్తవమే. ఒంగోలు నుంచి తీసుకొచ్చే చర్యలు తీసుకొంటున్నాం. 600 పడకల కొనుగోలుకు టెండర్లు వేశాం. త్వరలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. - కె.వి.జి.డి.బాలాజీ, డైరెక్టర్, శ్రీకాకుళం ప్రాంగణం

## దశాబ్దాలుగా అదే వరస

చీమకుర్తి : ఇటీవల రూపుదిద్దుకున్న ఎన్నో రహదారులకు జాతీయ హెూదా దక్కినా..ఒంగోలు – కర్నూలు రహదారికి ఆ మహా భాగ్యం దరిచేరడం లేదు. ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నా నేటికీ ఎలాంటి ఫలితం లేదు. దీంతో ఈ ఛిద్ర రహదారిపై అష్టకష్టాలు పడుతూ జిల్లావాసుల ప్రయాణం సాగుతోంది. ఒంగోలు – కర్నూలు రోడ్డుకు జాతీయ హెూదా అన్నది దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. పశ్చిమ ప్రకాశంలో పలు రోడ్లు జాతీయ రహదారులుగా మారుతూ నాలుగు వరసలుగా విరాజిల్లుతుంటే ఎంతో ప్రాముఖ్యమున్న ఈ రోడ్డును మాత్రం ఆ జాబితాలో చేర్చడం లేదు. ఒంగోలు నుంచి బేస్తవారపేట కూడలి వరకు ఉన్న 107 కిలోమీటర్ల రోడ్డుకు జాతీయ హెూదా ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. అయితే ఒంగోలు – చీమకుర్తి మధ్య 21 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలంటే కారులో సైతం నలభై నిమిషాలు



పడుతుందంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎందరో ప్రాతినిథ్యం..:** ఒంగోలు నుంచి చీమకుర్తి మండలం వరకూ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. అక్కడి నుంచి బేస్తవారపేట కూడలి వరకు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇద్దరు ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నా జాతీయ హెూదా మాత్రం నేటికీ కలగానే మిగిలింది. అదేవిధంగా సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు శాసనసభ్యులు సైతం నిత్యం ఆపసోపాలు పడుతూ జిల్లాకేంద్రానికి వస్తుంటారు. వీరేకాక ఒంగోలు నుంచి రాయలసీమ, పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు రాష్ట్ర రహదారులు జాతీయ రహదారులుగా మారి సర్వాంగ సుందరంగా తయారవుతున్నాయి. ఒంగోలు – పొదిలి మధ్య శిథిల రహదారిలో ప్రయాణిస్తూ ఏడాదికి కనీసం 25 మంది వరకూ మృత్యువాత పడుతున్నారు. ఇక క్షతగాత్రుల సంఖ్యకు అయితే లెక్కేలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు హెూదా కల్పించడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆశల అలలు తీరం చేరేనా!

జిల్లా అభివృద్ధిలో మరో మణిహారం చేరనుంది.. తూర్పు తీరంలో పూసపాటిరేగ మండలం చింతపల్లి వద్ద మరో గొప్ప మత్స్య ఓడరేవు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న మత్స్యకారులకు ఉపాధి దక్కనుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖ తరహాలో పూర్తిస్థాయి 'ఫిషింగ్ హార్బర్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో వేలాది మంది మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. వేటకు వెళ్లే వీరంతా తమ బోట్లను తీరానికి చేర్చాలన్నా, చేపలను నిల్వ చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నా ఫిష్ ల్యాండింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు కొన్నాళ్లుగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చింతపల్లి వద్ద ఆరు ఎకరాల్లో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపినా.. అయిదేళ్లూ నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మత్స్య ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలిస్తూ వృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ఫిషింగ్ హార్బర్ ప్రణాళికను తెరపైకి తెచ్చింది. దీని ఏర్పాటుకు తీర ప్రాంతంలో 22 ఎకరాల స్థల సేకరణకు యోచిస్తున్నారు. సెంట్రల్ కోస్టల్ అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.



జిల్లాలో వేటాడిన మత్స్య సంపద వాహనాలతో విశాఖ హార్బర్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో రవాణా ఖర్చు, సమయం వృథా అవుతున్నాయి. హార్బర్ ఏర్పాటైతే మత్స్యకారులు హార్బర్‌లోనే చేపలు విక్రయించవచ్చు. ఇతర రాష్ట్రాలకూ తరలించొచ్చు. మరోవైపు పర్యాటకంగానూ జిల్లా అభివృద్ధి చెందుతుంది. బహుముఖ లాభదాయక మత్స్య కేంద్రంగా నిలుస్తుందని ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి...**

సముద్ర తీరం : 29 కి.మీ
పంచాయతీలు : 16
మత్స్యకార జనాభా : 27వేలు
వేటపై ఆధారపడిన
కుటుంబాలు : 6 వేలు
జిల్లాలో మోటరైజ్డ్ బోట్లు: 714
చింతపల్లిలో మోటరైజ్డ్: 487
సంప్రదాయ వేట పడవలు: 361

ఇవీ ప్రయోజనాలు..
రోడ్ల వసతులు మెరుగవుతాయి
కోల్డ్ స్టోరేజీలతో వ్యర్థాలు తగ్గుతాయి.
మత్స్య ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వస్తుంది.
ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది.
పరిశ్రమలు ఏర్పాటవుతాయి.
పర్యాటక రంగానికి ఊతం వస్తుంది.
అభివృద్ధి హబ్‌గా మారుతుంది.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం..
–శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో మత్స్యశాఖ

తపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు వర్చువల్‌గా ప్రారంభమైనా గత ప్రభుత్వం పూర్తిచేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు 22 ఎకరాలు అవసరం. ఇటీవల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కోస్టల్ ఇంజినీరింగ్ ఆఫ్ ఫిషరీస్ అధికారులు ఈ ప్రాంతంలో స్థలానికి పరిశీలించి నివేదికను పంపించారు. అనుమతులు రాగానే స్థల సేకరణ పనులు చేపడతాం.

## అధికారం అండ.. ప్రతిపక్షం దందా



సింగరాయకొండ : వైకాపా నాయకులు స్థానిక అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకుని అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆయా తహసీల్దారు కార్యాలయాల్లో కొందరు అధికారుల అండదండలతోనే అక్రమార్కులు ఈ తతంగాన్ని నడుపుతున్నారు. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వెంచర్లుగా మారుస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండానే అక్రమ లేఔట్లు ఏర్పాటు చేశారు. అక్రమ వెంచర్లు మళ్లీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చాలా వాటికి అనుమతులు కూడా లేకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సైతం సమకూరడం లేదు. పనిలో పనిగా వెంచర్ల పక్కనున్న ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నా యంత్రాంగం మొద్దునిద్ర నటిస్తోంది.

**భారీగా ధరలు పెంచేసి..**

రూ.వేలల్లో ఉన్న స్థలాల విలువ రూ.లక్షల్లోకి మారుతోంది. కనుమళ్ల, శానంపూడి, మూలగుంటపాడు, సోమరాజుపల్లి, సింగరాయకొండ గ్రామాల పరిధిలో అధికారులు సుమారు 30 అనుమతులు లేని వెంచర్లు గుర్తించారు. ఎకరాకు అనుమతి తీసుకుని అయిదెకరాల వరకు వెంచర్లు వేసినవి మరో 30 నుంచి 40 వరకు ఉన్నాయి. మండలంలోని శానంపూడి గ్రామ పరిధిలోని ప్రధాన రహదారి వెంబడి సర్వే నంబరు 438లో పదెకరాల స్థలంలో నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన వైకాపా నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా మూడు వెంచర్లు ఏర్పాటు చేశారు. కనుమళ్ల, సోమరాజుపల్లి, మూలగుంటపాడు గ్రామాల పరిధిలో సుమారు 50 ఎకరాల్లో వెంచర్లతో పాటు గృహ నిర్మాణాలు సాగుతున్నాయి. అక్కడ సెంటు స్థలాన్ని రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నారు.

**ఆక్రమణలో అసైన్డ్ భూములు..** సింగరాయకొండలోని బాలయోగినగర్ సమీపంలో గతంలో పేదలకిచ్చిన అసైన్డ్ భూములను కొందరు తక్కువకు కొనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా విద్యుత్తు, ఇతర శాఖల అధికారులు తమవంతు సాయం చేస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై సింగరాయకొండ ఇన్‌ఛార్జి తహసీల్దార్ పుల్లారావును వివరణ కోరగా..పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్లలో హద్దు రాళ్లను తొలగిస్తామన్నారు. అక్రమార్కులకు నోటీసులు అందజేసి క్రిమినల్ చర్యలు సైతం చేపడతామన్నారు.

## అంతిమ కష్టాలు ఇక అంతం!



ఒంగోలు: ఆప్తులను పోగొట్టుకుని దుఃఖంలో ఉంటే వారి అంతిమ సంస్కారాలు ఎలా నిర్వహించాలనే దానిపై కష్టాలు పడాల్సి రావడం ఆవేదన కలిగిస్తోంది. మరుభూమిలో కాలు పెట్టేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ కష్టాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం శ్మశానవాటికల్లో సమస్య పరిష్కారం దిశగా అడుగులేస్తోంది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో శ్మశానవాటికలు ఆక్రమణలో చిక్కుకోవడం, స్థానికంగా పంచాయతీలు పట్టించుకోకపోవడంతో కంప చెట్లు మొలిచి సమస్యగా మారాయి. కొన్నిచోట్ల కనీసం వెళ్లేందుకు దారి లేక పొలాల నుంచి కాలువ గట్ల వెంబడి వెళ్లాల్సి వస్తోంది. పట్టణాల్లోని పలుచోట్ల సమాధులతో నిండిపోయి జాగా లేకుండా పోయింది. సమస్యను గుర్తించిన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం కదిలింది. ప్రస్తుతం శ్మశాన వాటికల స్థలాలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి..? ఆక్రమణలో చిక్కుకున్నవి ఎన్ని..? తదితర వాటిపై ఆరా తీస్తున్నారు. ఎక్కడైనా స్థలం అందుబాటులో లేకపోతే సేకరించాలని ఆదేశాలుండడంతో ఆ దిశగా రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం అన్వేషిస్తోంది. ఏయే గ్రామాల్లో ఎంతెంత స్థలం అవసరమనేది తహశీల్దార్లు లెక్కలు కట్టే పనిలో ఉన్నారు.

**దాతల సహకారం:** గ్రామాల్లో దాతల సహకారంతో పలుచోట్ల శ్మశానవాటికల రూపురేఖలు మారాయి. గ్రామస్థుల నుంచి విరాళాలు సేకరించి అక్కడ సౌకర్యాలు కల్పిస్తున్నారు. కొన్నిచోట్ల దాతలు ముందుకొచ్చినా స్థలాలు ఆక్రమణలో చిక్కుకోవడంతో ముందడుగు పడడం లేదు. రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం ఆక్రమణల సమస్యపై ప్రత్యేక దృష్టిసారిస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుంది.

**ఆదేశాలిచ్చాం:** శ్మశానవాటికల్లో సమస్యలు పరిష్కరించే విషయమై ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. సమస్య పరిష్కారానికి రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టనుంది. జిల్లాలో ప్రాంతాల వారీగా ఎక్కడెక్కడ స్థలాలు సేకరించాలనే విషయమై ఇప్పటికే తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేశాం. అవసరమైనచోట ప్రైవేటుగా భూములను సేకరిస్తాం.
గోపాలకృష్ణ, జేసీ

## రభశా.. కబ్జాల రభస!

ఒంగోలు: ఒంగోలు నగర నడిబొడ్డునున్న ప్రభుత్వ స్థలాలు పరాధీనమవుతున్నాయి. వీటిని పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండడంతో ఆక్రమణలకు అడ్డే లేకుండా పోతోంది. రూ.కోట్ల విలువైన భూముల్లో ఇళ్లు నిర్మించి వాటిని అద్దెలకిచ్చి కాసులు దండుకుంటున్నారు. నగరంలోని రహదారులు, భవనాలశాఖ (రభశా) ఆధ్వర్యంలో సీఆర్పీ నివాస సముదాయాల స్థలాలను ఒకరిని చూసి మరొకరు ఆక్రమించేస్తున్నారు. కొంత కాలానికి ఇక్కడ ప్రభుత్వ స్థలమనేది లేకుండా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ ఉద్యోగులకు ఆవాసం కల్పించేందుకు సీఆర్పీ నివాసాలను టైప్–ఎ, బి, సి, డి నాలుగు రకాలుగా నిర్మించారు. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించడం, నిర్వహణ లేకపోవడంతో చాలా నివాసాలు నిరుపయోగంగా మారగా, మరికొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతమున్న వాటిలో కూడా ఎవరు నివాసం ఉంటున్నారో తెలియని పరిస్థితి. ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు నివాసం ఉంటున్నట్లు సమాచారం. ఇక్కడ నివాస సముదాయాలకు అనుకుని ఉన్న స్థలాలను ఒక్కొక్కటిగా ఆక్రమించేసి భారీ భవంతులు నిర్మించేశారు. కొందరు ఏకంగా నాలుగంతస్తుల భవనాలు నిర్మించారంటే ఏ స్థాయిలో ఇక్కడ ఆక్రమణలున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతంపై అవగాహన ఉన్న ఉద్యోగులు కన్నేసి కబ్జా చేస్తున్నారు. పోలీసుశాఖలో ఎ.ఎస్.ఐ.గా పనిచేస్తున్న ఒకరు ఏకంగా భారీ భవంతిని నిర్మించి అద్దెకు ఇచ్చారు. ఉద్యోగ సంఘంలో పట్టున్న కొంతమంది నేతలు, స్థానిక రాజకీయ నేతలు స్థలాలు స్వాహా చేయడంలో ముందున్నారు. తాజాగా రహదారిని ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువైన 100 గదుల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఏకంగా యంత్రాలతో చదును పనులు చేపట్టినా అధికారులు కనీసం కన్నెత్తి చూడడంలేదు. శిథిలమైన నివాసాల పక్కనే ఉన్న స్థలాన్ని బాహాటంగా ఆక్రమించేస్తున్నా చర్యలు



తీసుకోని అధికారుల తీరుపై స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. తొలుత నివాసాల చుట్టూ ఉన్న స్థలాన్ని చదును చేసి క్రమేపీ కబ్జా చేసేస్తున్నారని వారంతా ఆరోపిస్తున్నారు.

**పొంచి ఉన్న ప్రమాదం**

నివాసాలను ఆనుకుని ఉన్న కొండను సైతం తొలిచేసి భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. తొలుత తాత్కాలికంగా రేకుల షెడ్లు వేస్తున్నారు. కొంతకాలం తరువాత కాంక్రీటు నిర్మాణాలు చేపడుతున్నారు. కొండను ఛిద్రం చేసి అంతకంతకూ పైపైకి నిర్మాణాలు చేపడుతున్నారు. కొండను తొలచడంతో వర్షాలకు బండరాళ్లు కదిలి దిగువకు జారిపోయే ప్రమాదం పొంచి ఉంది. కొండ నుంచి మట్టి పెళ్లలు విరిగిపడినా, బండరాళ్లు జారి పడినా దిగువన పెద్దసంఖ్యలో నివాసం ఉంటున్న సామాన్యుల ప్రాణాలకు ముప్పు తప్పదు. అధికార యంత్రాంగం ముందుగానే మేల్కొనాల్సిన అవసరం ఉంది. ఆక్రమణలు తొలగించాలని ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని రహదారులు, భవనాలశాఖ ఈఈ కె.గోపినాయక్ పేర్కొన్నారు. రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం సహకారంతో ఆక్రమణలు తొలగించి విలువైన స్థలాన్ని కాపాడతామన్నారు.

## పైడితల్లి ఆలయాభివృద్ధికి పచ్చజెండా

విజయనగరం :ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎట్టకేలకు పచ్చజెండా ఊపారు. అంతరాలయం, మండప విస్తరణ పనులు, ఆధునికీకరణకు ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. దేవస్థానానికి ఇరువైపులా ఉన్న దుకాణాలను తొలగించి రెండేళ్లయినా.. విస్తరణ పనులకు మాత్రం నోచుకోకపోవడంతో అటు భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ పనులకు కొన్నేళ్లుగా దేవస్థానం మ్యాచింగ్ గ్రాంటు చూపిస్తున్నా.. గత ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ కాలయాపన చేస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించడంతో రూపురేఖలు మారనున్నాయి.

**17 అడుగుల మేర విస్తరణ**

పైడితల్లి ఆలయం లోపల మండపానికి తూర్పు, పడమర వైపున గోడలు తొలగించి, 17 అడుగుల చొప్పున విస్తరించనున్నారు. మ్యాచింగ్ గ్రాంట్‌గా ప్రత్యేక ఖాతాలో దేవస్థానం రూ.36 లక్షలు



చూపితే.. మిగిలిన రూ.1.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇందుకు చేపట్టాల్సిన నిర్మాణాల నివేదిక గ్రాంట్‌తో కలిపి చూపించాలి. గర్భగుడి, రాజగోపురాలకు ఎలాంటి మార్పు చేయరు.

**పండగ అనంతరం పనులు**
– కె.శిరీష, ఈవో, పైడితల్లి దేవస్థానం

ఈ ఏడాది అమ్మవారి సిరిమాను పండగ అనంతరం ఆలయ విస్తరణ పనులు చేపడతాం. ఇందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

## వసతి వేదన

విజయనగరం : అందని రక్షిత నీరు.. అధ్వానంగా వంట గదులు.. ప్రాంగణాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం.. ఇదీ పలు వసతి గృహాల్లో పరిస్థితి. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు నిశితంగా పరిశీలించారు. ప్రతిచోటా విద్యార్థుల దయనీయ పరిస్థితుల ను చూసి చలించిపోయారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వసతి గృహాల వైపు కన్నెత్తి చూడలేదు. భవనాల మరమ్మతులకు కాసులు విదల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంచెలంచెలుగా వసతి గృహాల



మరమ్మతులకు నిధులిచ్చింది. కొన్నిచోట్ల పనులు పూర్తయ్యాయి. మరికొన్నిచోట్ల జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో భవనాల మరమ్మతులకు సుమారు రూ.15 కోట్లు విడుదల చేసింది. విజయనగరం జిల్లాలో ప్రభుత్వ బీసీ సంక్షేమ విద్యార్థుల వసతి గృహాలు 51, ఎస్సీ వసతి గృహాలు 30, ఎస్టీ వసతి గృహాలు 8, విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలు రెండు ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు చివరి దశలో ఉన్నాయి. వీటిలో 6,745 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాలు 8, బీసీ హాస్టళ్లు 10, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు 58 ఉన్నాయి. వీటిలో సుమారు ఇరవై వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

వసతి గృహాలు చాలా వరకు శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్నాయి. చాలాచోట్ల భవనాలకు ప్రహరీలు లేవు. కనీస మరమ్మతులు లేక గదుల్లో గచ్చులు, గోడలు పెచ్చులూడిపోయాయి. కొన్నిచోట్ల విద్యార్థులు నేలపైనే నిద్రిస్తున్నారు. మరుగుదొడ్లు సరిపడా లేవు. ఉన్నవాటికి వాడుక నీరు లేక వినియోగించలేకపోతున్నారు. బాలికల వసతి గృహాల్లో పరిస్థితి మరీ దయనీయం.

**43 చోట్ల తనిఖీలు**

సాంఘిక సంక్షేమ, బీసీ, గురుకుల ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల లేమిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అన్ని జిల్లాల్లో పరిస్థితిని పరిశీలించి నివేదించాలని గతంలో ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో ఇంత వరకు 43 వసతి గృహాల్లో తనిఖీలు చేపట్టిన న్యాయాధికారులు హైకోర్టుకు నివేదించారు. వీటిని పరిశీలించిన హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరణ ఇచ్చేందుకు ప్రతిపాదనలతో ఈ నెల 21న హాజరు కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా సంబంధిత సంక్షేమ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో అధికార యంత్రాంగంలో కాస్త కదలిక కనిపించింది. వసతి గృహాల్లో తాజా పరిస్థితిపై నివేదికలు అందజేయాలని ఉభయ జిల్లాకలెక్టర్లు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

## రొమాంటిక్ బ్యూటీ అందాల షో

ఆకాష్ పూరి హీరోగా నటించిన 'రొమాంటిక్' సినిమాతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకుంది. ఈమె అందాల ఆరబోత పాత్రలు మాత్రమే కాకుండా నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు సైతం చేయడం ద్వారా నటిగా మంచి గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేసింది. కానీ లక్ కలిసి రాకపోవడంతో ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. తెలుగులో ఈమె చివరగా రాబిన్‌హుడ్‌లో ఐటెం సాంగ్‌లో కనిపించగా, సింగిల్ సినిమాలో సెకండ్ హీరోయిన్ పాత్రలో నటించింది. ఆ రెండు సినిమాల్లోనూ తన పాత్రకు మంచి పేరు వచ్చింది. కనుక ముందు ముందు మరిన్ని ఆఫర్లు వస్తాయని ఈ అమ్మడు ఆశ పడుతోంది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో కేతిక శర్మ అందాల ఫోటోలు...** ప్రస్తుతం ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు ఏమీ లేవు. ఒకటి రెండు చర్చల దశలో ఉన్నాయి. అయినా కూడా ఈమె రెగ్యులర్‌గా వార్తల్లో ఉంటుంది. అందుకు కారణం ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ



ఉంటుంది. అందుకే ఈమెకు మంచి ఫాలోయింగ్ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమె షేర్ చేసే ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. అందుకే ఈమె హీరోయిన్‌గా ముందు ముందు అయినా బిజీ అవుతుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో టాలీవుడ్‌లో ఇప్పుడు కాకున్నా లక్ కలిసి వచ్చి ముందు ముందు అయినా స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ కాకుండా పోతుందా అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**క్లీ వేజ్ షో తో కేతిక శర్మ షో....** కేతిక ఎప్పుడు ఫోటోలు షేర్ చేసినా ఖచ్చితంగా ఆకట్టుకుంటాయి. ఈసారి చాలా సింపుల్ ఔట్ ఫిట్, పెద్దగా స్కిన్ షో చేయకున్నా కూడా ఈ ఫోటోల నుంచి చూపు తిప్పలేక పోతున్నారు. ఇప్పటి వరకు ఈ అమ్మడు చేసిన సినిమాల విషయానికి వస్తే ఇంతకు మించి అందంగా కనిపించింది. అయినా కూడా ఈ ఫోటోల్లో చాలా చక్కగా, అందంగా కనిపిస్తుంది అంటూ అభిమానులు అంటున్నారు. సోషల్ మీడియాలో ఈ అమ్మడు షేర్ చేస్తూ ఉండే ప్రతి ఫోటో వైరల్ అవుతూ ఉంటుంది. అందుకే ఈ ఫోటోలు సైతం ఆమె స్థాయిని మరింతగా పెంచే విధంగా ఉన్నాయని, ఆమె క్లీ వేజ్ షో తో చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్‌తో పాటు, ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు లక్ ఉండాలని, అలా లేకుంటే కేతిక పరిస్థితి అందరికీ తప్పదని అంటారు.

## జిమ్‌లో దివి వర్కౌట్

తెలుగు బిగ్ బాస్ సీజన్ 4తో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ దివి. ఈ అమ్మడు అంతకు ముందు సినిమాల్లో నటించినా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. కానీ లక్కీగా బిగ్ బాస్ లో ఛాన్స్ దక్కించుకుని ఒక్కసారిగా కెరీర్ టర్న్ అయింది. బిగ్‌బాస్ లో ఫైనల్ వరకు లేకున్నా కూడా దివికి మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. బిగ్ బాస్ వల్ల సినిమాలు, సిరీస్‌లు దక్కించుకుంది. హీరోయిన్‌గా ఒకటి రెండు సినిమాలు చేసినా ఆశించిన స్థాయిలో గుర్తింపు తెచ్చుకోలేక పోయింది. కానీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంది. అంతే కాకుండా హీరోయిన్స్ రేంజ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం



ద్వారా మిలియన్‌కి పైగా ఫాలోవర్స్‌ను దక్కించుకుంది.

**తెలుగు బిగ్ బాస్‌తో గుర్తింపు...** 2020లో హైదరాబాద్ టైమ్స్ లో మోస్ట్ డిజైరబుల్ వుమెన్‌గా నిలిచిన ఈ అమ్మడు సినిమాల్లో ఎంట్రీ ఇచ్చింది. తక్కువ సమయంలోనే పలు సినిమాల్లో చేసినా కూడా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. హీరోయిన్‌గా సినిమాలు చేయాలి అని కలలు కన్న దివికి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. ఆ సమయంలో వచ్చిన బిగ్‌బాస్ ఆఫర్ ఆమెకు మంచి బూస్ట్ ఇచ్చింది. తెలుగు బిగ్ బాస్‌లో పాల్గొన్న వారిలో అతి కొద్ది మందికి మాత్రమే మంచి గుర్తింపు వచ్చింది. అందులో దివి ఒకరు అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా బిగ్ బాస్ చేసిన తర్వాత ఆఫర్లు వచ్చాయి. అంతే కాకుండా సోషల్ మీడియాలో లక్షల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. అందుకే ఈ అమ్మడికి బిగ్‌బాస్ ఖచ్చితంగా లైఫ్ ని ఇచ్చిందని, కెరీర్‌ను నిలబెట్టిందని అంటారు.

**దివి అందాల ఫోటో షూట్స్...** ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మిలియన్‌కు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ముద్దుగుమ్మ దివి తాజాగా మరోసారి అందమైన ఫోటోలను షేర్ చేసింది. జిమ్‌లో ఈ అమ్మడు వర్కౌట్ చేస్తున్న ఫోటోలను షేర్ చేసింది. టైట్ డ్రెస్‌లో దివి ఆకట్టుకుంటుంది. తన అందంతో ఎంతో మందిని కట్టి పడేసిన దివి ఎప్పటిలాగే ఈ వర్కౌట్ వీడియోలు, ఫోటోలతో వైరల్ అవుతోంది. తన అందమైన ఫోటోలు, వీడియోలతో ఈ అమ్మడు మెప్పించింది. అందాల దివి సోషల్ మీడియాలో ఆకట్టుకుంటూ ఉంది. టైట్ జెగ్గిన్ లో స్పోర్ట్స్ బ్రా ధరించి కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే విధంగా ఈ అమ్మడు వర్కౌట్ ఫోటోలు ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి.




## జన నాయగన్.. దళపతి విజయ్ ఏం చేస్తాడో మరి?




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి ఇప్పుడు జన నాయగన్ మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఓవైపు పూర్తి స్థాయి రాజకీయాల్లోకి అడుగు పెట్టిన ఆయన, ఇప్పుడు జన నాయగన్ ను పూర్తి చేస్తున్నారు. అదే ఆయన చివరి సినిమా అని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నా.. విజయ్ మాత్రం ఆ విషయంపై రెస్పాండ్ అవ్వలేదు. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా హెచ్. వినోత్ దర్శకత్వం వహిస్తున్న జన నాయగన్ లో పూజ హెగ్డే, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, నరైన్, ప్రియమణి సహా పలువురు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ క్రేజీ అండ్ రాక్ మ్యూజిక్ ను అందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి కానుకగా సినిమా రానుండగా.. ఇప్పుడు ఆ మూవీ వసూళ్లపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రీసెంట్ గా సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ మూవీ.. బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా రాణించకపోవడంతో కోలీవుడ్ లో అత్యధికంగా జనాలను ఆకర్షించేది ఎవరనే దానిపై చర్చ మొదలైంది. ముఖ్యంగా మౌత్ టాక్ తోనే భారీ వసూళ్లు సాధించగలనని దళపతి విజయ్ ఇప్పటికే పలుమార్లు ప్రూవ్ చేసుకున్నారు. వారిసు, గోట్ వంటి చిత్రాలతో పెద్ద ఎత్తున కలెక్షన్స్ సాధించి నిరూపించారు. స్టోరీ, జోనర్ తో సంబంధం లేకుండా.. విజయ్ ఎల్లప్పుడూ కోలీవుడ్ ఆడియన్స్ ను థియేటర్స్ కు రప్పిస్తారని చెప్పాలి. ఇప్పుడు మళ్లీ జన నాయగన్ మూవీతో దాన్ని రిపీట్ చేస్తారో లేదోనని అంతా డిస్కస్ చేసుకుంటున్నారు.

గ్రాండ్ గా ఓపెనింగ్స్ కు వివిధ అంశాలు దోహదం చేస్తాయని, మిగతాది మౌత్ టాక్ పైనే ఆధారపడి ఉంటుందని చెప్పాలి. అయితే జన నాయగన్ మూవీపై ఇప్పటికే ఆడియన్స్, సినీ ప్రియుల్లో మంచి అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా మేకర్స్ ఫస్ట్ రోర్ పేరుతో వీడియో గ్లింప్స్ రిలీజ్ చేయగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. పోలీస్ డ్రెస్ లో అల్లర్లు చెలరేగుతున్న వీధిలో నడుస్తున్నట్లు విజయ్ చూపించారు. అయితే ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సినిమాలు మనుగడ సాగించడానికి స్టార్ పవర్ తోడ్పడే రోజులు పోయాయి. కంటెంట్ ఉంటేనే క్లిక్ అవుతోంది. మరి ఇప్పుడు విజయ్ జన నాయగన్ మూవీతో ఏం చేస్తారో వేచి చూడాలి.

## నిధి అగర్వాల్.. రాజాసాబ్ 'సర్ప్రైజ్' చూశారా?




టాలీవుడ్ లో టాలెంటెడ్, ప్రామిసింగ్ హీరోయిన్స్ లిస్టులో అందాల భామ నిధి అగర్వాల్ కచ్చితంగా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సవ్యసాచి మూవీతో తెలుగు సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన అమ్మడు.. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. రీసెంట్ గా హరిహర వీరమల్లు మూవీతో సందడి చేసింది నిధి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన వీరమల్లు కోసం ఐదేళ్లపాటు డేట్స్ కేటాయించింది. కానీ అనుకున్న స్థాయిలో రిజల్ట్ అందుకోని నిధి అగర్వాల్.. ఇప్పుడు రాజా సాబ్ పైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ మారుతి కాంబోలో హారర్ కామెడీ డ్రామాగా ఆ మూవీ రెడీ అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న రాజా సాబ్ లో ముగ్గురు హీరోయిన్స్ నటిస్తున్నారు. నిధి అగర్వాల్ తో పాటు రిద్ధి కుమార్, మాళవిక మోహనన్ సందడి చేయనున్నారు. ఆ ముగ్గురూ రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ లో సందడి చేశారు. అందులో నిధి చాలా అందంగా కనిపించారు. ఇప్పుడు మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రాజా సాబ్ టీమ్ అందమైన, ప్రతిభావంతులైన నిధి ప్రత్యేక రోజు జరుపుకుంటుందని తెలిపారు. ఆమె పాత్ర కథకు తగ్గ విధంగా క్రియేట్ చేశామని చెప్పారు. హ్యాపీ బర్త్ డే నిధి అంటూ రాసుకొచ్చారు. అయితే పోస్టర్ లో నిధి అగర్వాల్ చాలా కూల్ గా కనిపించారు. వైట్ కలర్ ఔట్ ఫిట్ లో ఉన్న ఆమె.. క్యాండిల్స్ దగ్గర నిల్చుని ప్రేయర్ చేస్తున్నారు. నవ్వుతూ.. ఏదో చూస్తూ.. హ్యాపీ మూడ్ లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిధి అగర్వాల్ కొత్త పోస్టర్ ఫుల్ వైరల్ గా మారింది. నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పోస్టర్ అదిరిపోయిందని నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. సినిమాలో ఆమె రోల్ కు సరైన ప్రాధాన్యత ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెబుతున్నారు. మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచి.. ఆమెకు ఖాతాలో సరైన విజయం పడాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చెబుతున్నారు.

## ఒక్క హిట్ తోనే హీరోయిన్ ఓరియేంటెడ్!

నిధి అగర్వాల్ కెరీర్ లో ఇప్పటి వరకూ తెలుగులో నటించిన సినిమాలు ఐదు. వాటిలో హిట్ అయిన చిత్రాలెన్ని? అంటే ఒకటి మాత్రమే. అదే 'ఇస్మార్ట్ శంకర్'. ఈ సినిమా మినహా అన్ని చిత్రాలు అంచనాలు అందుకోవడంలో విఫలమైనవే. అవన్నీ స్టార్ హీరోలతో నటించిన సినిమాలే అయినా? వైఫల్యాలు నిధి స్టార్ డమ్ ని తీసుకు రాలేకపోయాయి. ఇటీవలే భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా లో రిలీజ్ అయిన 'హరిహరవీరమల్లు' తిరుగులేని విజయం సాధిస్తుందనుకున్నారంతా? కానీ ఆ సినిమా ఫలితం తీవ్ర నిరాశనే మిగిల్చింది.

**కొత్త డైరెక్టర్ తో ప్రయత్నం:** ప్రస్తుతం నిధి అగర్వాల్ చేతిలో ఉన్న పెద్ద ప్రాజెక్ట్ రాజాసాబ్ మాత్రమే. అమ్మడు ఆశలన్నీ ఈ చిత్రంపైనే పెట్టుకుంది. జరిగిందేదో? జరిగిపోయింది ప్రభాస్ సినిమాతోనైనా



బూస్టింగ్ దక్కుతుందని చాలా ఆశలతో ఎదురు చూస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ లో రిలీజ్ కానుంది. సరిగ్గా ఇదే సమయంలో నిధ అగర్వాల్ ఓ లేడీ ఓరియేంటెడ్ చిత్రం ప్రకటనతో రావడం విశేషం. నిఖిల్ కార్తీక్ అనే కొత్తకుర్రాడు ఈచిత్రాన్ని తెరకెక్కించనున్నారు. పుప్పాల అప్పలరాజు నిర్మిస్తున్నారు. ఇదొక హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్ .


**అవకాశమే గొప్ప విషయం:** బడ్జెట్ లెక్కలు బయటకు రాలేదు గానీ నిధితో లేడీ ఓరియేంటెడ్ ప్రకటనతోనే ఈ వార్త సోషల్ మీడియాలో దావానాలా వ్యాపిస్తోంది. వరుస ఫ్లాప్ ల్లో ఉన్నా నిధితో లేడీ ఓరియేంటెడ్ చిత్రమేంటనే విమర్శ వ్యక్త మవుతోంది. ఆ సంగతి పక్కన బెడితే నిధి అగర్వాల్ ఇలాంటి సమయంలో అవకాశం రావడం గొప్ప విషయం. సోలో నాయికగా సత్తా చాటలేకపోయినా అమెను నమ్మి లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో అవకాశం దక్కింది.

**వాళ్ల సరసన నిధి అగర్వాల్:** ఇలాంటి సినిమాలో పూర్తి స్థాయి నటనకు ఆస్కారం ఉంటుంది. హీరోతో సినిమా అంటే పాట, రొమాంటిక్ సన్నివేశాలకే పరిమితం. కానీ ఉమెన్ సెంట్రిక్ చిత్రమంటే కథ అంతా ఆమె పాత్ర చుట్టూనే తిరుగుతుంది కాబట్టి తనలో అసలైన నటిని బయటకు తీయోచ్చు. మరి ఈ అవకాశాన్ని నిధి అగర్వాల్ ఎంత వరకూ సద్వినియోగం చేసుకుంటుందో. ఇప్పటికే ఈ తరహా సినిమాలు చేయడంలో అనుష్క శెట్టి ఆరితేరింది. కీర్తి సురేష్, రష్మికా మందన్నా లాంటి వాళ్లు ప్రయత్నిస్తున్నారు. వాళ్ల సరసన నిధి కూడా చేరుతున్నట్లే.

## హలగలి గ్లింప్స్.. ఇదేదో బాగుందే..!

కన్నడలో తన నటనతో ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తూ వస్తున్నాడు ధనుంజయ్. పుష్ప సినిమాలో జాలి రెడ్డి రోల్ లో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చాడు ధనుంజయ్. అఫ్కోర్స్ అది కాస్త నెగిటివ్ టచ్ ఉన్న రోల్ అయినా కూడా తన పాత్రలో అదరగొట్టాడు. ఐతే ఇప్పుడు అతను సోలో హీరోగా ఒక క్రేజీ అటెంప్ట్ చేస్తున్నాడు. అదే హలగలి. సుఖేష్ నాయక్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను కళ్యాణ్ చక్రవర్తి దూళిపాళ్ల నిర్మిస్తున్నారు. హలగలి ఫస్ట్ గ్లింప్స్ తోనే సినిమా గ్రాండియర్ అప్పీల్ అనిపించింది.

**బిఫోర్ ఇండిపెండన్స్ కథతో హలగలి..** హలగలి బిఫోర్ ఇండిపెండన్స్ కథతో పీరియాడికల్ మూవీగా వస్తుంది. హలగలి అనే ఊరు మీద దండయాత్రకు వచ్చిన బ్రిటీషర్లకు అక్కడ నాయకుడు ఎలా బదులు చెప్పాడు అన్న కథతో ఈ సినిమా వస్తుంది. ముఖ్యంగా సినిమాలో యాక్షన్ బ్లాక్స్, పీరియాడికల్ అప్పీల్ అదిరిపోయాయి. ఇక ధనుంజయ్




కూడా తన రోల్ లో అదరగొట్టేలా ఉన్నాడు. తన శూళంతో బ్రిటీష్ జెండాను కూలగొట్టే షాట్ అదిరిపోయింది. పీరియాడికల్ స్టోరీ అది కూడా ఇండిపెండన్స్ ముందు కథ తో హలగలి వస్తుంది. ఈ సినిమా నుంచి వచ్చిన ఈ ఫస్ట్ లుక్ గ్లింప్స్ అయితే అంచనాలు పెంచింది. ఈమధ్య కాలంలో ఒక సినిమా అది ఏ భాష నుంచి వచ్చినా కూడా కథ, కథనం నచ్చేలా ఉంటే దాన్ని సూపర్ హిట్ చేస్తున్నారు. హలగలి కూడా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా గ్లింప్స్ తోనే గట్టి మ్యాటర్ ఉన్నట్టే అనిపిస్తుంది.

**అంచనాలను పెంచిన ఫస్ట్ గ్లింప్స్...** హలగలితో ధనుంజయ్ ఒక గొప్ప ప్రయత్నమే చేస్తున్నారనిపిస్తుంది. సినిమా గ్లింప్స్ అయితే అంచనాలను పెంచింది. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ కూడా దానికి యాడ్ అయ్యాయి. సో హలగలి హంగామా ఇంప్రెస్ చేసేలానే ఉంది. సినిమా నుంచి మరిన్ని అప్డేట్స్ వస్తేనే కానీ ఇంకాస్త డెప్త్ ఏంటన్నది తెలుస్తుంది. పుష్ప తర్వాత తెలుగులో ఛాన్స్ లు వచ్చినా తను కోరే లీడ్ రోల్స్ కాదని లైట్ తీసుకున్నాడు ధనుంజయ్. అందుకే ఇప్పుడు ఈ హలగలి సినిమాతో తన మాస్ స్టామినా చూపించనునాడు. హగలై సినిమా కన్నడ నుంచి రాబోతున్న మరో భారీ సినిమా అవుతుంది. కె.జి.ఎఫ్ నుంచి కన్నడలో భారీ సినిమాల నిర్మాణం జరుగుతుంది. అదే దారిలో హలగలి వస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536